ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
10-1-2026 శనివారం సంపుటి: 31 సంచిక: 340 పేజీలు: 12 వెల: 6.50

ఇరాన్‌లో ఖమేనీ వ్యతిరేక నిరసనలు
అమిత్‌షా ఆఫీసు ముందు టిఎంసి ఎంపిల ధర్నా
9లో

# ఇక మెక్సికోపై సైనిక చర్య!

## గ్రౌండ్ ఆపరేషన్ ప్రారంభిస్తున్నామన్న ట్రంప్

**వాషింగ్టన్, జనవరి 9:** వెనిజులాపై సైనిక చర్యకు పాల్పడి వారం రోజులు గడవకముందే అమెరికా తన సామ్రాజ్యవాద వైఖరిని మరోసారి బయటపెట్టింది. ఈసారి మెక్సికోపై సైనిక దాడి చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మెక్సికోలో గ్రౌండ్ ఆపరేషన్ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. 'మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై గ్రౌండ్ ఆపరేషన్ ప్రారంభిస్తున్నాం. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులు మెక్సికోనుపరిపాలిస్తున్నారు. ఆ దేశ స్థితిని చూస్తుంటే చాలా బాధాకరంగా ఉంది. ఏం చేస్తాం. మాదక ద్రవ్యాలరవాణాదారులు పాలిస్తున్నారు. వారి కారణంగా అమెరికాలో 3 లక్షల మంది చనిపోతున్నారు' అని సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. అంతకుముందు ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, 'సముద్ర మార్గాల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై అమెరికా పెద్ద విజయం సాధించింది. ఇప్పుడు భూ మార్గాలపై దృష్టి పెట్టాం. సముద్రం ద్వారా వచ్చే మాదక ద్రవ్యాలను దాదాపు 97శాతం అడ్డుకున్నాం. ఇప్పుడు డ్రగ్స్ కార్టెలపై భూ దాడులు ప్రారంభించబోతున్నాం. మెక్సికోను మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులే పాలిస్తున్నారు. ఇది చాలా విచారకరం. ఆ దేశంలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు' అని వ్యాఖ్యానించారు. అమెరికా సైనిక చర్యను మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ ఖండించిన తర్వాత ట్రంప్ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కోరినా మచాడో వచ్చే వారం వాషింగ్టన్ డిసిలో పర్యటించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు.





## వచ్చేనెల ఆర్సెలర్ మిట్టల్

# స్టీల్‌ప్లాంట్‌కు శ్రీకారం

### అమరావతిలో క్వాంటంవ్యాలీ ఏర్పాటుకు వేగంగా అడుగులు

### పుణే పబ్లిక్ పాలసీ ఫెస్టివల్‌లో మంత్రి లోకేష్

**విజయవాడ, జనవరి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వాల కొనసాగింపు ఎంతో కీలకమని, గత ప్రభుత్వ హయాంలో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ల (పీపీఏ) రద్దు వంటి నిర్ణయాల వల్ల చాలా కంపెనీలు భయపడి పొరుగు రాష్ట్రాలకు తరలివెళ్లాయని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సుస్థిర పాలన ఆవశ్యకతను ప్రజలు గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. పుణేలోని గోఖలే ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనమిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పబ్లిక్ పాలసీ ఫెస్టివల్‌లో లోకేశ్ కీలకోపన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలు క్యూ కట్టడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని లోకేశ్ వివరించారు. మొదటిది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం. రెండోది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. పరిశ్ర మలతో ఒప్పందం కుదిరిన తర్వాత,ఆ ప్రాజెక్టును మా సొంతదిగా భావించి వేగంగా >>2

# గొడవలకు నై..తెలుగుజాతికి జై



## వృధా జలాల కోసం రాష్ట్రాల మధ్య తగాదా వృధా

### విద్యుత్ ఛార్జీలు తగ్గించాం.. ఇంకా తగ్గిస్తాం

### ఐదేళ్లు రాజధాని లేకుండా చేసి.. ఇప్పుడు ఆ పదమే లేదంటున్నారు

### యజ్ఞంలా పోలవరం..నదుల అనుసంధానం తథ్యం

### రాయవరం సభలో సిఎం చంద్రబాబు

**మండపేట(తూర్పు గోదావరి జిల్లా), జనవరి 9 ప్రభాతవార్త బ్యూరో:** యేటా 3వేల టీఎంసీల నీళ్లు సముద్రం పాలవుతున్నాయి. ఇందులో 200టీఎంసీలు వాడుకుంటే వచ్చే నష్టం ఏమీ లేదు. సముద్రంలోకి వెళ్లే నీళ్ల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు? నీళ్ల వద్దు గొడవలే కావాలని కొందరు బయల్దేరారు. కొందరు రాయలసీమ ఎత్తిపోతల అంటూ వివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. నాకు గొడవలు కాదు తెలుగు జాతి ప్రయోజనాలు కావాలి. పోలవరం పూర్తి అయితే నీళ్లు తెలంగాణా రాష్ట్రం కూడా వాడుకునే అవకాశం ఉంటుంది. వివాదాల వల్ల ఎలాంటి ఉప యోగంలేదని అందరికీ చెబుతున్నాను. పట్టిసీమ కట్టి కృష్ణా డెల్టాలో వినియోగించుకుందామంటే వ్యతిరేకించారు. కృష్ణా డెల్టాలో ఇచ్చే నీళ్లను పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి తరలించాం. ఈ ఏడాది రాయలసీమలోని రిజర్వాయర్లలో నీళ్లు నింపాం.గతంలో ఆ ప్రాంతంలో వేసిన వేరు శనగ పంట ఎండి పోయిన పరిస్థితి. ప్రస్తుతం రాయలసీమ నీటి కొరత తీర్చి ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దున్నాం. కొందరు నీళ్లు వద్దు వివాదాలే కావాలని నానా యాగీ చేస్తున్నారని రాయవరంలో జరిగిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీసభలో సిఎం చంద్రబాబు అన్నారు.ప్రజలకు సంక్షేమం అందిస్తుంటే ఓర్చుకోలేకపోతున్నారని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విమర్శించారు. కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ సదస్సులో పాల్గొన్న సిఎం చంద్రబాబు రాష్ట్రంలో తాజా పరిణామాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్రం అభివృద్ధి జరుగుతోంటే కొందరు కుట్రలకు ఏ విధంగా పాల్పడుతున్నారనే అంశాన్ని ప్రజలకు వివరించి చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'రాష్ట్రంలో ఇప్పుడు పెద్ద నేరస్తుడు ప్రత్యర్థిగా తయారయ్యాడు. మంచి జరుగుతుంటే ఆ నేరస్తుడు సహించలేడు.. చెడు జరగాలని కోరుకుంటాడు, చెడు జరిగేలా కుట్రలు పన్నుతున్నాడు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. కానీ మంచి చేస్తున్న ప్రభుత్వానికి కొందరు అడుగు అడుగునా అడ్డంకులు కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే వారి కుట్రలను ఎప్పటికప్పుడు చేధిస్తూ, ప్రజలకు వాస్తవాలు వెల్లడిస్తున్నామన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఎపికే వచ్చాయి. ట్రిబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ తరహాలో ప్రధాని మోడీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి పనిచేస్తోంది. గుంతలు లేని రహదారులుగా రోడ్లను తయారు చేస్తున్నామని సిఎం అన్నారు.

**ప్రజలపై భారం తగ్గిస్తూ, ఉపాధి పెంచుతున్నాం:** 'గతంలో విద్యుత్ భారం అంతా ప్రజల నెత్తిన ట్రూ అప్ ఛార్జీల పేరిట వేశారు. మేం ట్రూ డౌన్ అని కరెంటు బిల్లుల భారం తగ్గించాం. రూ.4500 కోట్లు పెంచుకోమని ఈఆర్సీ అనుమతి ఇస్తే ప్రజలపై భారం వద్దని.. ఆ భారాన్ని ప్రభుత్వమే భరించాలని నిర్ణయించాం. భవిష్యత్తులోనూ కరెంటు ఛార్జీలు పెంచబోమని మరోమారు స్పష్టం చేస్తున్నా. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు పేరిట సుపరిపాలన అందించేలా కార్యాచరణ రూపొందించాం.వాట్సప్ గవర్నెన్సు ద్వారా పౌరసేవలన్నీ సులభతరం చేశాం. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడులతో గూగుల్ విశాఖకు వస్తోంది. 2027 మార్చిలోగా పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ధవళేశ్వరం బ్యారేజీ >>2

## కోర్టు ఆదేశాలంటే నవ్వులాటలా?

### మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్‌పై హైకోర్టు అసహనం



**విజయవాడ, జనవరి9, ప్రభాతవార్త ప్రతినిధి:** మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వైఎస్సార్సీపీ కార్యాలయానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని తామిచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని సంబంధిత అధికారిని ఆదేశించింది. కోర్టుఆదేశాలంటే నవ్వులాటలా ఉందని మండిపడింది.కోర్టు పవరేంటో >>2

## అద్దె బస్సు యజమానులతో చర్చలు సఫలం

**విజయవాడ.జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి :** ఈనెల 12నుంచి ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంఘాలు సమ్మెకు సిద్ధమైన నేపథ్యంలో వారితో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. స్త్రీశక్తి పథకం కింద నడుపుతున్న ఐదు రకాల బస్సులకు నిర్వహణ భారం పెరిగిందని,దానికి తగినట్లు అదనపు మొత్తం చెల్లించాలని సంఘం నేతలు డిమాండు చేశారు.రద్దీ అధికమైందని, నిర్వహణ ఖర్చులు పెరిగాయని పేర్కొన్నారు. బస్సులకు బీమా కవరేజ్లోనూ సమస్యలు ఎదురవుతున్నాయని ఆర్టీసీ ఎండీ దృష్టికి తెచ్చారు. వారి డిమాండ్లపై రవాణాశాఖ మంత్రి తోనూ ఎండీ ద్వారకాతిరుమలరావు చర్చించారు. అద్దెబస్సుల యజమానుల >>2

## 28 నుంచి పార్లమెంటు ఫిబ్రవరి ఒకటినే బడ్జెట్

**న్యూఢిల్లీ, జనవరి 9:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈనెల 28వ తేదీనుంచి ఫిబ్రవరి 13వ తేదీవరకూ జరుగుతాయి. రెండో విడత సమావేశాలో మార్చి 9 నుంచి ఏప్రిల్ రెండోతేదీవరకూ జరుగుతాయి. ఫిబ్రవరి ఒకటవ తేదీ ఆదివారం వచ్చినప్పటికీ సాంప్రదాయం ప్రకారం అదేరోజు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొత్తసంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్‌కమిటీ బడ్జెట్‌ను ఒకటవ తేదీనే ప్రవేశపెట్టాలనినిర్ణయించింది. ఇక సమావేశాల్లో 29వ తేదీ ఆర్థికసర్వేను సభలోప్రవేశపెడతారు. ఈ ఏడాది కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ >>2



శుక్రవారం పిఠాపుర సంక్రాంతి మహోత్సవంలో నప్రసంగిస్తున్న డి.సిఎం పవన్. చిత్రంలో మంత్రి నారాయణ

## విష ప్రచారం చేస్తే

# ఏరిపారేస్తా

### పిఠాపుర సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభించిన డి.సిఎం పవన్

### నియోజకవర్గంలో రూ.211కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, జనవరి 9 ప్రభాతవార్త:** పిఠాపురం గడ్డపై సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా పీఠికాపురంలో అచ్చ తెలుగు సంస్కృతిని ఆవిష్కరించారు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. ఈ పండుగ ప్రారంభ కార్యక్రమంలో పిఠాపురం గురించి జరుగుతున్న, చేస్తున్న తప్పుడు ప్రచారాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందులలో సొంత బాబాయ్‌ని గొడ్డలితో వేటాడి చంపినా అది కొందరికి వార్తగా కనిపించదు కానీ పిఠాపురంలో చిన్న స్కూలు పిల్లలు కొట్టుకున్నా, ఆఖరికి ఇక్కడ ఒక కాకి ఈక పడినా సరే, కొందరు కావాలని భూతద్దంలో చూపిస్తూ నానా గోల చేస్తున్నారు అని మండిపడ్డారు.తన నియోజకవర్గంపై విషం చిమ్మే ప్రయత్నం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. పిఠాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా, దాన్ని కావాలని భూతద్దంలో చూపిస్తూ వైరల్ చేస్తున్నారని పవన్ కళ్యాణ్ అసహనం వ్యక్తం చేశారు.పిఠాపురం నియోజకవర్గానికి వచ్చి గొడవలు చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఇక్కడే కూర్చుని ఏరివేస్తాను అని కటువుగా స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో బూతులు తిట్టడం, అక్రమ కేసులు పెట్టడం వంటి సంస్కృతి ఉండేదని, మళ్ళీ అలాంటి వాటిని పిఠాపురంలో ప్రవేశపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులు అత్యంత కఠినంగా >>2

# పోలీసు శాఖకు కొత్త రూపు

### ఆధునిక సాంకేతిక హంగులతో ముందడుగు

### 8 జిల్లాల్లో 'రేస్' వాహనాలు ప్రారంభించిన డిజిపి హరీష్ గుప్తా



**విజయవాడ, జనవరి 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునిక సాంకేతికత ఆధారిత పోలిసింగ్ దిశ గా ఏపీ పోలీసు శాఖ మరో ముందడుగు వేసిందని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. శుక్రవారం ఆధునిక సాంకేతికత ఆధారిత పోలిసింగ్‌ను అమలు పరుస్తుంది. రిమోట్ ఏరియా కమ్యూనికేషన్ ఎన్హాన్స్‌మెంట్(రేస్) నూతన వాహనాలు. ఆధునిక కమ్యూనికేషన్ పరికరాలను రాష్ట్రంలోని 8 జిల్లాల కోసం శుక్రవారం డీజీపీ ప్రారంభించారు. అడవులు, కొండ ప్రాంతాలు, దూర.దుర్గమ ప్రాంతాలు, తీరప్రాంతాలు, ప్రకృతి విపత్తులకు లోనయ్యే ప్రాంతాల్లో వాణిజ్య మొబైల్ నెట్‌వర్క్ లు తరచూ విఫలమవుతున్న నేపథ్యంలో, పోలీసు శాఖకు నిరంతర, విశ్వసనీయ సమాచార వ్యవస్థను అందించడమే రేస్ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని డీజీపీ తెలిపారు. ఈ రేస్ వాహనం ఒక స్వతంత్ర, చలనం కలిగిన మొబైల్ కమ్యూనికేషన్ కేంద్రంగా పనిచేస్తూ, ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా కమ్యూనికేషన్ వ్యవస్థ అందుబాటులో ఉండేలా రూపొందించబడింది. రేస్‌ఫేజ్-1 2018-19 సంవత్సరంలో ఎంవోపిఎఫ్ బడ్జెట్ కింద రూ.2.13 కోట్ల వ్యయంతో 9 జిల్లాలకు ఫోర్ వీలర్స్-9, టూ వీలర్స్-20 వాహనాలను సమకూర్చమన్నారు. రేస్‌ఫేజ్-2లో 2025-26 సంవత్సరానికి ల్నీశినీ బడ్జెట్ కింద రూ.2 కోట్ల వ్యయంతో 8 జిల్లాలకు ఫోర్ వీలర్స్8, టూ వీలర్స్,16 రేస్ వాహనాలను సమకూర్చనట్లు తెలిపారు.. వాణిజ్య మొబైల్ నెట్ వర్క్ లపై ఆధారపడకుండా నిరంతర విశ్వసనీయ కమ్యూనికేషన్ అందుబాటులో ఉంటుందన్నారు. శాంతి భద్రతలు, బందోబస్తు విధులు, ఎన్నికలు, ఆందోళనలు, జాతరలుఉత్సవాల్లో తక్షణ కమాండ్ కంట్రోల్ ఉంటుందన్నారు. విపత్తులు, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన ఉంటుందన్నారు. పోలీసు, రెవెన్యూ, >>2



# టిటిడి బోర్డుకు జంగా కృష్ణమూర్తి గుడ్‌బై

### సిఎంకు సమస్య లేకుండా రాజీనామా చేశానని వెల్లడి

**విజయవాడ,జనవరి 9,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యత్వానికి జంగా కృష్ణమూర్తి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం తన రాజీనామా లేఖను సీఎం చంద్రబాబు నాయుడుకి పంపారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలంటూ ఆ లేఖలో సీఎంకు జంగా కృష్ణమూర్తి విజ్ఞప్తిచేశారు. ఈ పదవికి రాజీనామా చేయడానికి గల కారణాలను ఆ లేఖలో జంగా వివరించినట్లు తెలుస్తోంది. గతంలో తనకు కేటాయించిన బాలాజీనగర్‌లో ప్లాట్ నెంబర్ 2 నేటికీ ఖాళీగానే ఉందని, దీనిని తనకు కేటాయించాలంటూ ప్రభుత్వాన్ని కోరానని సమాచారం. దీనిని టీటీడీ బోర్డుకు ప్రభుత్వం పంపడంతో ఆమోదముద్ర పడినట్లు తెలుస్తోంది. అయితే గురువారం జరిగిన కేబినెట్ భేటీలో ఈ భూ కేటాయింపును రద్దు చేసినట్లు సమాచారం. దీంతో ఆయన టీటీడీ సభ్యత్వ పదవికి రాజీనామా చేశారనే ప్రచారం సాగుతోంది. 2024 ఎన్నికలకు >>2

# 'వైకుంఠ'దర్శనాల్లో సరికొత్త రికార్డు



### పది రోజుల్లో దాదాపు 8లక్షల మంది దర్శనం

### గతంకంటే భిన్నంగా, ప్రశాంతంగా నిర్వహణ

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు గతంకంటే పూర్తి భిన్నంగా అమలుచేసినా..అంతా సవ్యంగా ప్రశాంతంగా ముగిసింది. పదిరోజులపాటు సుమారు 7.83 లక్షలమంది భక్తులకు సంతృప్తికరంగా, చిన్నపాటి అసౌకర్యం కలగకుండా చక్కగా నిర్వహించడంలో అనుసరించిన వ్యూహం సామాన్యభక్తుల నుండి అభినందనలు అందుకున్నారు. టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడిఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతిజిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ తమతమ సిబ్బందితో చక్కగా ప్రణాళికాబద్ధంగా క్షేత్రస్థాయిలో బాధ్యతలు నిర్వర్తింపజేశారు.ఎవరూ ఊహించని రీతిలో ఈ ఏడాది పూర్తి ప్రశాంతంగా పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాలు చేయించడంలో అందరూ సమష్టి కృషితో,బాధ్యతగా సేవలందించడమేనని సామాన్యభక్తుల ఆనందం. గతంకంటే అదనంగా లక్షమందిభక్తులకు దర్శనాలు చేయించగలగడం విశేషం.ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి డిసెంబర్ 30, వైకుంఠ ద్వాదశి 31తోబాటు నూతన ఆంగ్ల >>2

## టెట్ ఫలితాలు విడుదల

**విజయవాడ.జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. టెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మంత్రి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో విజయాలు సాధించాలని శుభాకాంక్షలు చెప్పారు. 2025 డిసెంబర్ 10 నుంచి 21 వరకు జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2,71,692 మంది దరఖాస్తు చేసుకోగా 2,48,427 మంది హాజరైనట్లు ఏపీ టెట్ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి ముందుగా ప్రాథమిక కీ విడుదల చేశారు. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత తుది ఫలితాలు విడుదల >>2

10-1pg2exHMNWJQE 2_10-1pg2exHMNWJQE.qxd 10/Jan/26 12:06 AM Page 1






శుక్రవారం పీఠికాపురంలో గోమాతను పూజించి,చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న డిసిఎం పవన్

# విష ప్రచారం చేస్తే ఏరిపారేస్తా

>> వ్యవహరించాలని ఆదేశించారు. తన మాటలు మెత్తగా ఉన్నప్పటికీ, తాను ఈ విషయాలను చాలా గట్టిగా మరియు పర్సనల్‌గా తీసుకుంటానని పవన్ హెచ్చరించారు. అధికారం ఉన్నా లేకపోయినా ఆఖరి శ్వాస వరకు పిఠాపురం ప్రజల కోసం పనిచేస్తానని,తనను బలోపేతం చేస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ ఇంత కఠినంగా మాట్లాడటానికి కారణాలు ఉన్నాయి. ఇటీవల కొంత మంది వైసీపీ సానుభూతి పరులు యూట్యూబ్ చానళ్ల ముసుగులో అక్కడ కులాల కుంపట్లు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. సంబంధం లేని విషయాలకు కులాలు అంటిస్తున్నారు. స్కూలు పిల్లలు కొట్టుకున్నా అదే పనిచేస్తున్నారు. అందుకే పవన్ కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు పి.నారాయణ,నాదెండ్ల మనోహర్ కందుల దుర్గేష్,శాసనసభ్యులు పంతం నానాజీ, ప్రభుత్వ విప్ పి.హరి ప్రసాద్, ఎమ్మెల్సీ కర్రిపద్మశ్రీ,డీసీసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్,మాజీ ఎమ్మెల్యే ఎస్విఎస్ ఎన్ వి వర్మ,జిల్లా ఇంచార్జి కలెక్టర్ అపూర్వ భరత్,జిల్లా ఎస్పీ బిందు మాధవ్,డి ఆర్ వో జె.వెంకటరావు,పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 'వైకుంఠ'దర్శనాల్లో సరికొత్త రికార్డు

>> సంవత్సరం జనవరి 1న మూడురోజులు పూర్తిగా ఆన్‌లైన్‌లో జారీ చేసిన ఇడిప్ టోకెన్లు కలిగిన భక్తులనే వైకుంఠ దర్శనాలకు అను మతిం చడం పట్ల ప్రజాశ్రేణులతో కూడుకుంది. అప్పై భారీగా వచ్చిన రాజ్యాంగహోదాలోని ప్రముఖులకు వారి కుటుంబసభ్యులకు మాత్రమే లభ్యుదర్ల నంలో వైకుంఠద్వారం కల్పించారు. ఎక్కడకూడా సామాన్యభక్తులు అసౌకర్యం లేకుండా,ఇబ్బంది పడకుండా పూర్తిస్థాయిలో ప్రణాళికాబద్ధంగా పనిచేయడంలో అటు పాలకమండలి ఇటు టిటిడి అధికారులు, పోలీస్ అధికారులు సఫలీకృతులయ్యారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని డిసెంబర్ 30 మంగళవారం వేకువజామున ఒంటిగంటకు తెరచుకున్న తిరుమల ఆలయంలోని వైకుంఠ ద్వారం నిరవధికంగా పదిరోజులపాటు తెరచిఉంచి భక్తులకు మోక్షమార్గం దర్శనం చేయించారు. జనవరి 2వ తేదీ నుండి టోకెన్,టిక్కెట్‌లేని సర్వదర్శనం భక్తులతోబాటు ఆన్‌లైన్‌లో విడుదల చేసిన ఎస్ఇడి, శ్రీవాణి టిక్కెట్ కలిగిన భక్తులను వారంరోజులు పాటు అనుమతించారు. ప్రతిరోజూ సరాసరి 80వేలమంది భక్తులకు వైకుంఠద్వారంలో ప్రశాంత దర్శనం చేయించగలిగారు. గురువారం రాత్రి వరకు సరాసరి 7.83లక్షలమంది భక్తులకు దర్శనం చేయించగలిగారు. భక్తులకు ప్రశాంతంగా మూలవిరాట్టు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతోబాటు వైకుంఠద్వార దర్శనాలు భక్తులు సంతృప్తికరంగా చేసుకోవడం రికార్డు. వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతమైన సందర్భంగా శుక్రవారం అన్నమయ్య భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు.

**వారంరోజులు సాధారణ సర్వదర్శనమే :** ఈ ఏడాది తొలిమూడురోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఆన్‌లైన్ విధానంలో ఈ డిప్ ద్వారా సర్వదర్శనం టోకెన్లు విడుదల చేసి భక్తులను అనుమతించారు. జనవరి 2వతేదీ నుండి 8వతేదీ వరకు వారంరోజులు ఎటువంటి దర్శన టిక్కెట్లు, టోకెన్‌లు లేకుండా నేరుగాతిరుమలకు వచ్చినా సామాన్యభక్తులను యధావిధిగా సర్వదర్శనంలో అనుమతించి వైకుంఠద్వార దర్శనం చేయించారు. గత ఏడాది వరకు సామాన్యభక్తుల కోసం ఆఫ్‌లైన్‌లో అమలైన టోకెన్ల విధానం పూర్తిగా ఈఏడాది రద్దుచేశారు. పదిరోజులవైకుంఠద్వార దర్శనాల్లో 182గంటలు దర్శనసమయంలో 164 గంటలు దర్శనం సామాన్యభక్తులకు కేటాయిం చారు. తొలిమూడురోజుల్లో డిసెంబర్ 30వతేదీ 67,053మంది భక్తులు,31న 70,256మంది భక్తులు, జనవరి 1న 65,225మంది భక్తులకు ఇడిప్ టోకెన్ కలిగిన వారితోబాటు స్వయంగా వచ్చిన విఐపిలకు వైకుంఠద్వారదర్శనం చేయించారు. జనవరి 2న 83,032 మంది, 3న 88,662మంది,4న 85,179మంది, 5న 82,650మంది, 6న 82,022 మంది భక్తులు, 7వతేదీ 85,752మంది భక్తులకు దర్శనం చేయించారు. చివరగా 8వతేదీ 84వేలమంది వరకు భక్తులకు దర్శనాలు చేయించి రికార్డు నెలకొల్పారు.33 లక్షల మంది భక్తులకు ప్రసాద వితరణ,44 లక్షల లడ్డూల విక్రయం జరగగా కానుకల రూపంలో హుండీకి 41.14కోట్ల రూపాయలు వరకు ఆదాయం చేకూరింది. ఈ సమావేశంలో టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్,అదనపుఇఒ వెంకయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం అన్నమయ్య భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి

# ఏప్రిల్‌లో ఎపి నుంచి 4 రాజ్యసభ సీట్లు ఖాళీ

**విజయవాడ,జనవరి9.ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ నుంచి అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ సత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్, సానా సతీశ్ జూన్‌లో రిటైర్,. 2026లో ఖర్గే సహా రిటైర్ కానున్న 73 మంది రాజ్యసభ ఎంపీలు ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు ఎంపీలు పదవీ విరమణ చేయనున్నారు. ఈ మేరకు రాజ్యసభ సచివాలయం ఈ సంవత్సరం రిటైర్ కాబోయే రాజ్యసభ సభ్యుల జాబితాను విడుదల చేసింది. ఇందులో తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ ఏప్రిల్ 9న రిటైర్ కానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వైసీపీ ఎంపీలు అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్, టీడీపీ సభ్యుడు సానా సతీశ్‌కు జూన్‌లో రాజ్యసభ సభ్యత్వం ముగుస్తుంది. రాజ్యసభ నుంచి 2026లో మొత్తం 73 మంది రిటైర్ కానున్నారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, కేంద్రమంత్రులు హర్దీప్ సింగ్ పూరీ, కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్‌ల పదవీ కాలం ముగుస్తుంది. పెద్దల సభలో ఖర్గే ప్రతిపక్ష నేత కావడంతో ఆయనకు మరోసారి అవకాశం దక్కవచ్చు. మహారాష్ట్ర నుంచి నలుగురు, తమిళనాడు నుంచి ఆరుగురు, ఒడిశా నుంచి నలుగురు, పశ్చిమ బెంగాల్ నుంచి ఐదుగురు, అసోం నుంచి ముగ్గురు, బీహార్ నుంచి ఐదుగురు, ఛత్తీస్‌గఢ్ నుంచి ఇద్దరు, హర్యానా నుంచి ఇద్దరు, హిమాచల్ ప్రదేశ్ నుంచి ఒకరు, గుజరాత్ నుంచి నలుగురు, ఝార్ఖండ్ నుంచి ఇద్దరు, మధ్యప్రదేశ్ నుంచి ముగ్గురు, రాజస్థాన్ నుంచి ముగ్గురు, ఉత్తర ప్రదేశ్ నుంచి పదిమంది, కర్ణాటక నుంచి నలుగురు, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఒక్కరు చొప్పున రిటైర్ కానున్నారు.

# పోలీసు శాఖకు కొత్త రూపు

>> విపత్తు నిర్వహణ తదితర శాఖల మధ్య మెరుగైన సమన్వయం కలిగి ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ ఫీల్డ్ యూనిట్లకు సంపూర్ణ కమ్యూనికేషన్ మద్దతు ఉంటుందన్నారు. గతంలో కచ్చలూరు, పోలవరం జిల్లాల్లో జరిగిన బోటు ప్రమాదం వంటి కీలక ఘటనల్లో ముఖ్యంగా కమ్యూనికేషన్ సౌకర్యాలు లేని కొండ ప్రాంతాల్లో రేస్ వాహనాలు ప్రత్యేక కమ్యూనికేషన్ సాధనాలుగా పనిచేసి, రక్షణసహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించాయి. 8 జిల్లాలకు రేస్ వాహనాల ప్రారంభంతో రాష్ట్రంలో అంతిమ పరిధి వరకు (లాస్ట్ మైల్) కమ్యూనికేషన్, విపత్తు సిద్ధత, శాంతి భద్రతల నిర్వహణ మరింత బలోపేతం కానుంది. ఇది ప్రజా భద్రతకు, ఆధునిక సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌కు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ తీసుకుంటున్న మరో కీలక ముందడుగుగా ఇది నిలుస్తుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ (శాంతి భద్రతలు) ఎన్. మధుసూదన్ రెడ్డి, ఐజీపీ (టెక్నికల్ సర్వీసెస్) సి.హెచ్. శ్రీకాంత్, డీఐజీ (కమ్యూనికేషన్స్) ఎన్.ఎస్.జె. లక్ష్మి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బార్లపై విధిస్తున్న అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం రద్దు

## మద్యం ధరలు పెంపు



**విజయవాడ.జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్యం విధానంలో కీలక మార్పులు చేసింది. బార్లపై విధిస్తున్న అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం (ఏఆర్ఈటీ)ను రద్దు చేస్తూ, అదే సమయంలో కొన్ని రకాల మద్యం ధరలను పెంచింది.తాజా మంత్రిమండలి సమావేశంలో పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.ఈ నిర్ణయం ప్రకారం సామాన్యులు ఎక్కువగా వినియోగించే రూ.99 ఎంఆర్‌పీ (180ఎంఎల్) క్వార్టర్ బాటిళ్లు, బీర్లు, వైన్, రెడీ టూ డ్రింక్స్ (ఆర్‌టీడీ) ధరల్లో ఎలాంటి మార్పు ఉండదు. వీటిని మినహాయించి, మిగతా అన్ని సైజుల మద్యం బాటిళ్ల ఎంఆర్‌పీపై రూ.10 పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. మద్యం షాపులు, బార్ల మధ్య దిగుమతి ధరల్లో ఉన్న వ్యత్యాసాన్ని తొలగించి, ఒకే ధరకు మద్యం అమ్మేలా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏఆర్ఈటీని రద్దు చేయడం వల్ల ప్రభుత్వానికి సుమారు రూ.340 కోట్ల ఆదాయ నష్టం వాటిల్లుతుందని అంచనా. అయితే, మద్యం ధరలను పెంచడం ద్వారా ఈ నష్టాన్ని భర్తీ చేయడంతో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మార్పులన్నింటి ద్వారా ప్రభుత్వ ఖజానాకు అదనంగా రూ.506 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో పాటు మద్యం షాపుల లైసెన్సీలకు ఎమ్మార్పీపై మార్జిన్‌ను ఒక శాతం పెంచే ప్రతిపాదనకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధికి వెలుపల, 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న త్రీస్టార్ లేదా అంతకంటే ఎక్కువ స్థాయి హోటళ్లలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయాలతో రాష్ట్రంలో మద్యం అమ్మకాల విధానంలో సమూల మార్పులు చోటుచేసుకోనున్నాయి.

# కల్తీ నెయ్యి కేసులో విజయభాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ డిస్మిస్

**తిరుమల,జనవరి 9ప్రభాత వార్త ప్రతినిధి:** తిరుమల కల్తీ నెయ్యి కేసులో శుక్రవారం నెల్లూరు ఏసిబి కోర్టు లో ఏ 34విజయ భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ డిస్మిస్ అయింది.ఆయన పెట్టుకున్న బెయిల్ పిటిషన్ ను సి బి ఐ తరపున న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభ్యంతరం చెప్పడంతో న్యాయమూర్తి పిటిషన్ ను తోసి పుచ్చారు.

## ఎంఎస్‌ఎంఇల బలోపేతం దిశగా క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**సచివాలయం,జనవరి 9,ప్రభాతవార్త :** రాష్ట్రంలో సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలను అభివృద్ధి పర్చాలనే లక్ష్యంతో రూ.200కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన "ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కు గురువారం జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ఆమోదం లభించినట్లు రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ,సెర్ప్,ఎన్ఆర్ఐ ఎంపవర్‌మెంట్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా రాబోయే 5సంవత్సరాల్లో రాష్ట్రవ్యాప్తంగా 45కామన్ ఫెసిలిటీ సెంటర్లు స్థాపించబడతాయన్నారు.

# స్టీల్‌ప్లాంట్‌కు శ్రీకారం

>> అనుమతులు ఇస్తున్నాం. మూడోది రాష్ట్రంలో, కేంద్రంలో ఖినమోఖి (నాయుడు, మోదీ) నేతృత్వంలోని డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్" అని తెలిపారు. ఆర్సెలర్ మిట్టల్ అధినేత ఆదిత్య మిట్టల్‌తో ఒకేఒక్క జూమ్ కాల్ మాట్లాడి, వారి సమస్యను 24 గంటల్లో పరిష్కరించడం వల్లే దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను ఏపీకి తీసుకురాగలిగామని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు పనులు ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. పరిపాలనలో టెక్నాలజీని వినియోగిస్తూ విప్లవాత్మక మార్పులు తెస్తున్నామన్నారు. "మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 36 శాఖలకు చెందిన వెయ్యి రకాల సేవలను అందిస్తున్నాం. ఏఐ టెక్నాలజీతో మంగళగిరిలో స్కిల్ సెన్సస్ పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాం. త్వరలోనే భూ రికార్డులను కూడా బ్లాక్‌చైన్ టెక్నాలజీపైకి తీసుకొచ్చి, 24 గంటల్లో టైటిల్ మార్పు చేసేలా కసరత్తు చేస్తున్నాం" అని వివరించారు. ఐటీ పరిశ్రమలను ఆకర్షించేందుకు లిఫ్ట్ (ఎల్ఐఎఫ్‌టి) పాలసీని తీసుకొచ్చామని లోకేశ్ తెలిపారు. ఒక ఎకరాకు 500 ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు 99 పైసలకే భూమి కేటాయించేలా ఈ విధానాన్ని రూపొందించామని, కాగ్నిజెంట్ రాకతో పరిశ్రమల ప్రవాహం మొదలైందని చెప్పారు. పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను తానే స్వయంగా 26 వాట్సాప్ గ్రూపుల ద్వారా పర్యవేక్షిస్తున్నానని అన్నారు.

**సిఎం డ్రీమ్ ప్రాజెక్ట్ క్వాంటమ్ వ్యాలీ**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్వాంటమ్ వ్యాలీ అత్యంత ఇష్టమైన ప్రాజెక్ట్ అని లోకేశ్ అభివర్ణించారు. అమరావతిలో ఏర్పాటు కానున్న ఈ వ్యాలీ దేశానికే దిక్సూచిగా నిలుస్తుందన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఐఐటీ మద్రాస్ వంటి సంస్థలను ఏకతాటిపైకి తెచ్చి ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌ను అమలు చేసేందుకు యువ మంత్రుల బృందంతో కలిసికట్టుగా పనిచేస్తున్నామని, రాష్ట్రానికి భారీగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) ఆకర్షించడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు.

# 28 నుంచి పార్లమెంటు

>>పెడుతున్నారు. అంతకుముందు ప్రధాని మొరార్జీదేశాయి పదిసార్లు బడ్జెట్‌నుప్రవేశపెట్టారు. 1959నుంచి 1964వరకూ ఆ తర్వాత 1967 నుంచి 1969వరకూ మొరార్జీ బడ్జెట్‌ప్రవేశపెట్టారు. ఆర్థికమంత్రిగా పనిచేసిన పి.చిదంబరం కూడా బడ్జెట్‌ను తొమ్మిదిసార్లు ప్రవేశపెడితే ఆనాటి ఆర్థికమంత్రిప్రణబ్‌ముఖర్జీ ఎనిమిదిసార్లుప్రవేశపెట్టారు. 2017 నుంచి బడ్జెట్‌ను ఫిబ్రవరి ఒకటవ తేదీ ఉదయం 11 గంటలకే ప్రవేశపెడుతున్నారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ హయాంనుంచే ఈ విధానం అమలుకు వచ్చింది. కొత్తబడ్జెట్ ఏప్రిల్ ఒకటవ తేదీనుంచే అమలులోకి వచ్చేవిధంగా ఆయన నిర్ణయం తీసుకున్నారు. అప్పటినుంచి ఫిబ్రవరి 28వతేదీనే బడ్జెట్‌ప్రవేశపెట్టడంజరుగుతోంది. ఇదే సమయంలో ఎఐ ఇంపాక్ట్ సదస్సును కూడా నిర్వహిస్తున్నారు. వివిధ శాఖల గ్రాంట్ల డిమాండ్లను కూడా పార్లమెంటరీ స్థాయీ సంఘాలు ఈలోపు పరిశీలనచేస్తాయి.

# టిటిడి బోర్డుకు జంగా కృష్ణమూర్తి గుడ్‌బై

>> కొన్ని రోజుల ముందు వైసీపీకి జంగా కృష్ణమూర్తి రాజీనామా చేశారు. అనంతరం ఆయన టీడీపీలో చేరారు. ఈ ఎన్నికల్లో కూటమికి ఓటరు పట్టం కట్టాడు. దాంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం నామినేటెడ్ పోస్టుల భర్తీకి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. దాంతో టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడుని నియమించి.. పాలక మండలి సభ్యులుగా పలువురుని నియమించారు. ఆ జాబితాలో జంగా కృష్ణమూర్తికి స్థానం కల్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యత్వానికి తాను రాజీనామా చేశానని జంగా కృష్ణమూర్తి స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలో జంగా కృష్ణమూర్తి విలేకర్లతో మాట్లాడుతూ తన రాజీనామాపై వివరణ ఇచ్చారు. 2005లో తాను టీటీడీ సభ్యుడిగా ఉన్న సమయంలో తిరుమలలో గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం భూమి ఇవ్వాలని కోరినట్లు జంగా తెలిపారు. తన విజ్ఞప్తి మేరకు భూమిని ఇచ్చారని జంగా కృష్ణమూర్తి తెలిపారు. కానీ ఆ సమయంలో ఆర్థిక వెసులుబాటు లేక గెస్ట్ హౌస్ నిర్మించ లేకపోయానని తెలిపారు. మళ్లీ తనకు స్థలం కేటాయించాలని తాజాగా టీటీడీని కోరానని పేర్కొన్నారు. అందుకు టీటీడీ బోర్డు తీర్మానం చేసి ముఖ్యమంత్రికి పంపిందని చెప్పుకొచ్చారు. ఈ భూమిని తనకు కేటాయించాలా, వద్దా? అనేది ప్రభుత్వం నిర్ణయమన్నారు. ఈ తీర్మానంపై టీటీడీ బోర్డులో సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాశ్ ఒక్కరే వ్యతిరేకించారని పేర్కొన్నారు. తనకు స్థలం కేటాయించడం ద్వారా బోర్డు తప్పు చేసిందనే ఆలోచన రాకూడదనే తాను రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా జంగా కృష్ణమూర్తి ప్రకటించారు. టీటీడీ బోర్డుకు స్థలం కేటాయించడానికి హక్కు లేదా? అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తనకు కేటాయించి.. రద్దు చేసిన భూమిని తాను చైర్మన్‌గా ఉన్న ఓం శ్రీ నమో వెంకటేశ్వర గ్లోబల్ ట్రస్ట్‌కు మళ్లీ కేటాయించాలని టీటీడీని కోరానంటూ జంగా కృష్ణమూర్తి ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. తాను టీడీపీకి రాజీనామా చేయలేదని స్పష్టం చేసారు.ఈ క్రమంలో ఆయనను శనివారం ఉండవల్లి సీఎంక్యాంపు కార్యాలయానికి రావాలని రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ ఫోన్ చేసినట్లు కీలక సమాచారం.

# కోర్టు ఆదేశాలంటే నవ్వులాటలా?

>> చూపిస్తాంమని. ఒక అధికా రిని లోపలికి పంపితే అందరూ దార్లోకి వస్తా రని, చట్టం కంటే తాము ఎక్కువని అధికారులు భావిస్తున్నారు. వారిని ఎక్కడ నిలబెట్టాలో మాకు తెలుసు అని హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. తమ ఆదేశాలని పట్టించుకోని కమిషనర్ చర్యలు కోర్టు ధిక్కారం కిందకు వస్తాయని హెచ్చరించింది. వివరణ ఇస్తూ అఫిడవిట్ వేయాలని విచారణను ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. ఆక్యుపెన్సీ ధ్రువపత్రం జారీ చేసే విషయంలో హై కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు భిన్నంగా మున్సిపల్ కమిషనర్ ఉత్తర్వులిచ్చారని కృష్ణా జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు పేర్ని నాని హైకోర్టులో వ్యాజ్యం వేశారు.

తాము సమర్పించే డాక్యుమెంట్స్ పరిశీలించి సర్టిఫికెట్ జారీపై నిర్ణయం తీసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ పట్టించుకోలేదన్నారు. విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ పార్టీ కార్యాలయం విషయంలో అధికారులు కక్షతో వ్యవహరిస్తున్నారని అన్నారు. న్యాయస్థానాలు చెప్పినా పదే పదే వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చారని తెలిపారు. అంతిమంగా ధ్రువపత్రం నిరాకరణకు ఉత్తర్వులిచ్చారని వివరించారు. నిర్మాణ పనులు ఆపాలంటూ నోటీసులిచ్చారని అన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ కమిషనర్‌కు ఆంగ్లం రాదనుకోవాలా? కోర్టు ఉత్తర్వులు అర్థం కాలేదా? అని ప్రశ్నించారు. కోర్టు ఆదేశాలంటే నవ్వులాటగా ఉందా అని మండిపడ్డారు. కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేశారు.

# అద్దె బస్సు యజమానులతో చర్చలు సఫలం

>> 5 ప్రధాన డిమాండ్లను ఈనెల 20లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎండీ హామీ మేరకు ఈనెల 12 నుంచి తలపెట్టిన సమ్మె విరమించుకుంటున్నట్టు అద్దె బస్సుల యజమానులు తెలిపారు. సంక్రాంతి వేళ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో సమ్మె యోచన విరమించుకున్నట్టు చెప్పారు.



శుక్రవారం రాయవరంలో డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

# గొడవలకు నై..తెలుగుజాతికి జై

>> కట్టిన కాటన్ మహాశయుడ్ని ఇప్పటికీ ఆరాధిస్తున్నాం. మన దేశం కాకపోయినా మనకు మంచి చేసిన వారిని గుర్తుంచుకోవటం మన సంప్రదాయం. పోలవరాన్ని ఒక యజ్ఞంగా భావించి ప్రాజెక్టును పూర్తి చేస్తున్నామని, ఈ ప్రాజెక్టుతో ఈ ప్రాంతంలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చేయటమే నా లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**కొండపై కుట్రలు చేస్తారా:** తిరుమల కొండపై ప్రసాదాన్ని కల్తీ చేశారు. కల్తీ నెయ్యి వాడి భక్తుల మనోభావాలు దెబ్బతీశారు. కూటమి వచ్చాక మళ్లీ ఇప్పుడు ఎలాంటి కల్తీ లేకుండా ప్రసాదాన్ని పవిత్రంగా తయారు చేస్తున్నాం. వ్యవస్థలు సక్రమంగా నడుస్తుంటే మళ్లీ కొన్ని వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి డిక్లరేషన్ కూడా ఇవ్వని వ్యక్తులు మద్యం బాటిళ్లను తిరుమల కొండపై వేసి అపవాదు వేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కొందరు రాక్షసుల తరహాలో అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. తప్పుడు పనులు చేసి వాటిని ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నానిని సీఎం పేర్కొన్నారు. సుస్థిరమైన పాలన ఉంటేనే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ఐదేళ్లకు ఓ మారు ఒకర్ని మార్చేద్దామని అనుకుంటే నష్టమే జరుగుతుంది. రెవెన్యూ వివాదాలు పరిష్కరించడానికి రెండేళ్లు పట్టింది. పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేశారు. 2021లోనే పూర్తి కావాల్సిన పోలవరం ప్రాజెక్టు ఇప్పుడు 2027లో పూర్తి అవుతోంది. అమరావతిది కూడా అదే పరిస్థితి. ఇంగిత జ్ఞానం లేని వ్యక్తి రాజకీయాలు చేస్తున్నారు. పీపీపీ మెడికల్ కాలేజీలపై అందరినీ బెదిరిస్తున్నారు. రహదారులు పీపీపీల ద్వారానే వస్తున్నాయి. భోగాపురం ఎయిర్ పోర్టును మేం పూర్తి చేస్తుంటే అది నాదే అంటున్నారు. కూటమి ప్రభుత్వానికి పేరు వస్తుంటే భరించలేక ఆరోపణలు చేస్తున్నారని ముఖ్యమంత్రి విమర్శించారు.

# టెట్ ఫలితాలు విడుదల

>> చేసినట్లు కన్వీనర్ పేర్కొన్నారు. టెట్‌లో 97,560 మంది (39.27 శాతం) ఉత్తీర్ణులు సాధించారు. ఈ పరీక్షకు 31,886 మంది ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు హాజరుకాగా వారిలో 47.82 శాతం (15,239) మంది ఉపాధ్యాయులు ఉత్తీర్ణులయ్యారు. టెట్ పరీక్ష ఫలితాలను సంబంధిత వెబ్‌సైట్‌లోగాని, 9552300009 వాట్సప్ నెంబర్ ద్వారా కూడా తెలుసుకోవచ్చని టెట్ కన్వీనర్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాసేందుకు ప్రస్తుతం పని చేస్తున్న టీచర్లకూ అవకాశం కల్పించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 2011కు ముందు టెట్ లేకుండా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన టీచర్లకూ టెట్ రాసుకునే అవకాశం కల్పించారు.

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ పాస్ కావాలని సుప్రీంకోర్టు గత ఏడాది సెప్టెంబరు 1న తీర్పు వెలువరించింది. అప్పటి నుంచి 2 ఏళ్లలో ఉత్తీర్ణులు కావాలని స్పష్టం చేసింది. 5 ఏళ్లలో పదవీవిరమణ చేయబోయే వారికి అవసరం లేదని, అయితే వారు పదోన్నతి పొందాలంటే టెట్ పాసవ్వాలని సూచించింది.

సుప్రీంకోర్టు తీర్పుపై అప్పట్లో కొన్ని సంఘాలు రివ్యూ పిటిషన్లు వేశాయి. ఈ తీర్పు కోసం వేచి ఉండేవారికీ వెసులుబాటు కల్పిస్తారు. ఇంకా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, విభిన్న ప్రతిభావంతులకు డిగ్రీలో 40 మార్కులున్నా బీఈడీలో ప్రవేశం కల్పించారు.

ఈ సడలింపుతో బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు ఆ తర్వాత టెట్ రాయాలంటే 45 అర్హత మార్కులు అవసరమవుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ నిబంధనను సడలిస్తూ 40 ఉన్నా టెట్ రాసేందుకు అవకాశం కల్పించారు. ఈసారి 45 అర్హత మార్కులనే అనుసరించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది.

## వారం - వర్జ్యం

10-01-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,పూర్వాషాఢ కార్తె
సప్తమి ఉ.8.25
హస్త మ.3.42
వర్జ్యం : రా.12.33-2.19
దు.ఉ.6.39-8.12
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ముందుగా పడిన సమస్యలు ఒక్కొక్కటిగా ముందుకువస్తాయి. ఋణ బాధలు తొలగుతాయి.

**వృషభం :** మీ ప్రతిభాపాటవాలను కనబరచి పరిష్కారమార్గాలను వెనువెంటనే అవలంభించగలుగుతారు.

**మిథునం:** కీలకమైన వ్యవహారాలలో తీసుకునే నిర్ణయాలు, మదుపులు వంటి అంశాలను తాత్కాలికంగా వాయిదా వేయండి.

**కర్కాటకం:** ప్రముఖులను కలుసుకుని ముఖ్యమైన విషయాలపై సంప్రదింపులు జరుపుతారు. వస్తువు కొనుగోలు.

**సింహం:** శత్రువర్గం మరింత విజృంభించకుండా జాగ్రత్తలు తీసుకోగలుగుతారు. పనులు పూర్తిచేస్తారు.

**కన్య :** విద్యార్థులు అధిక శ్రద్ధను కనబరచవలసి ఉంటుంది. పరపతికి అధికంగా ఉంటుంది.

**తుల :** చిన్ననాటి మిత్రుల నుండి శుభవార్తలను అందుకుంటారు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** ఉద్యోగాలలో ఎదురైన ఒడిదుడుకులు తొలగి ఊరటచెందుతారు. వివాహయత్నాలు ముమ్మరం చేస్తారు.

**ధనుస్సు:** ప్రభుత్వపరమైన పనులు సానుకూల పడతాయి. అధిక ధనార్జనకు విదేశీయానమే మేలని భావిస్తారు.

**మకరం:** అనుకున్న పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు అవసరం.

**కుంభం:** కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది. కొన్ని మొండిబాకీలు వసూలవుతాయి. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం :** ఉద్యోగులకు కొంత వరకు అనుకూలంగా ఉంటుంది. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ పనులు సానుకూల పడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

10-01Pg3exHMNWJQEPRLK 3 GO_10-01Pg3exHMNWJQEPRLK.qxd 10/Jan/26 12:26 AM Page 1






రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందచేస్తున్న సిఎం చంద్రబాబు

# రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు

**రైతుల భూములకు భరోసా ఇచ్చేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు**
**రీసర్వేలో తప్పులుంటే అధికారులపై చర్యలు తీసుకుంటాం**
**టెక్నాలజీతో ట్యాంపరింగ్ ఫ్రీ డాక్యుమెంట్లు**
**భూములను లాక్కోలేరు... రికార్డులు తారుమారు చేయలేరు**
**పాసుపుస్తకాల పంపిణీ సభలో సిఎం చంద్రబాబు**

**మండపేట(తూర్పు గోదావరి జిల్లా), జనవరి 9 ప్రభాతవార్త బ్యూరో:** మీ భూమిమీ హక్కు. ఇదీ రైతులకు, భూ యజమానులకు ప్రభుత్వం ఇచ్చే భరోసా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రైతులకు వివాదాల్లేని క్లీన్ డాక్యుమెంట్లు ఇచ్చే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని... ఆ దిశగానే భూముల రీసర్వే చేపడుతున్నామని సిఎం వెల్లడించారు. మండపేట నియోజకవర్గం, రాయవరంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శుక్రవారం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన చంద్రబాబుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా రాయవరంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులతో సిఎం ముఖాముఖి మాట్లాడారు. క్యూఆర్ కోడ్, విశిష్ట సంఖ్య ఉన్న, మీ భూమి.. మీ హక్కు పేరిటి రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. క్యూఆర్ కోడ్ ద్వారా తక్షణం భూమి వివరాలు తెలుసుకునేలా పట్టాదారు పాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ ముద్రించిందని రైతులకు సిఎం వివరించారు. రైతులు, భూ యజమానుల ఆస్తులకు భద్రత కల్పించేలా కొత్త టెక్నాలజీతో ట్యాంపరింగ్ చేసేందుకు వీల్లేకుండా పట్టాదారు పాస్ పుస్తకం తయారు చేసినట్టు చెప్పారు. రీసర్వే పూర్తైన 6688 గ్రామాల్లోని భూములకు సంబంధించి 22.33 లక్షల పాస్ పుస్తకాలు ముద్రించగా... ప్రస్తుతం వాటిని పంపిణీ చేస్తున్నట్టు రైతులతో సిఎం చెప్పారు. రైతులు, భూ యజమానులకు తప్పుల్లేని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. అనంతరం మీ భూమి మీ హక్కు ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... "పూర్వీకుల నుంచి సంక్రమించిన, స్వార్జితమైన భూమితో రైతులకు ఓ అనుబంధం ఉంది. కరోనా సమయంలో అంతా సెలవు తీసుకున్నారు. కానీ అందరికీ అన్నం పెట్టే రైతన్నకు సెలవే లేదు. అలాంటి రైతులకు చెందిన భూ పత్రాల విషయంలో గత పాలకులు పాస్ పుస్తకాల జారీకి సంబంధించి అక్రమాలు చేశారు. గత పాలకుల్ని, ప్రభుత్వాన్ని హెచ్చరించాను. కానీ వారి అహంకారం నెత్తికెక్కి మీ ఆస్తులపై ఆయన ఫోటో వేసుకున్నారు. పూర్వీకులు ఆర్జించిన భూమిపై నాటి పాలకుని ఫోటో ఏమిటి.? సరిహద్దు రాళ్లపై గత పాలకుని ముద్రలేమిటి? ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అంటూ ఓ చట్టాన్ని తెచ్చి వాళ్లకు నచ్చిన వాళ్ల ఆధీనంలోకి తీసుకువచ్చేలా చేశారు. దీనిని గతంలోనే తీవ్రంగా వ్యతిరేకించాను. మీ భూముల వివరాలన్నీ గత పాలకుల అనుచరులు అమెరికాలో పెట్టుకున్నారు. కూటమి అధికారంలోకి రాకపోతే ప్రజల భూములన్నీ కాజేసేందుకు కుట్రపన్నారు. నిన్నా మొన్నా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తులు చాలా ప్రమాదకరమైన ఆలోచన చేశారు. రైతుల భుంలపై వేరేవాళ్ల ఫోటోలెందుకని ప్రశ్నించాను. ప్రభుత్వంలోకి వచ్చాం... రాజముద్ర వేసి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చాం. గత పాలకులు తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ రెండో సంతకమే పెట్టాను. భూమి అనేది రైతుకు ఆస్తి మాత్రమే కాదు ఓ విశ్వాసం, కుటుంబంతో కలిసిపోయిన సెంటిమెంట్. గతంలో భూమి ఇవ్వకపోతే దానిని 22 ఏ రికార్డుల్లో పెట్టేశారు. అందుకే ప్రజలు ఆలోచించి సమయం వచ్చినప్పుడు చూద్దామని బ్యాలెట్ ద్వారా తగిన బుద్ధి చెప్పారు. ఏపి ప్రాంతంలో ఉన్న రికార్డులు అన్నీ పక్కాగా ఉన్నాయి. తెలంగాణా ప్రాంతంలో ఎక్కువ భూవివాదాలే. మున్సబు, కరణాల వ్యవస్థను రద్దు చేసి ఎన్టీఆర్ రైతులకు, భూ యజమానులకు మేలు చేశారు. ఈ వ్యవస్థ రద్దైనప్పుడు తెలంగాణాలో పండుగ చేసుకున్నారు. గత పాలకుల తీరు కారణంగా ఎక్కడకు వెళ్లినా భూ వివాదాలకు సంబంధించిన పిటిషన్లే వస్తున్నాయి. ఈ వివాదాలను పరిష్కరించేందుకు సంకల్పించి మీ వద్దకు వచ్చాను." అని సిఎం చెప్పారు. "తహసీల్దారు కార్యాలయంలో కాదు... గ్రామసభలు నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించాను. ఎక్కడా మోసం జరక్కుండా, వివాదాలకు తావివ్వకుండా రాజముద్రతో మీ భూమి మీహక్కు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. పద్దతి ప్రకారం రీసర్వే చేయించి.. రికార్డులు అన్నీ అత్యంత సురక్షి తంగా ట్యాంపర్ చేయలేని విధంగా భద్రపరుస్తున్నాం. భూ రికార్డులు ట్యాంపర్ చేయకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజిని వినియోగిస్తున్నాం. జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకంపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు మీ రికార్డు వచ్చేస్తుంది. ప్రభుత్వం ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకంతో మీ ఆస్తిపై మీకు పూర్తి భరోసా వస్తుంది. సర్వే చేసిన రికార్డులను మరోమారు తనిఖీ చేసి రైతులు చెప్పిన వివరాలు కూడా నమోదు చేసుకుంటున్నాం. ఈకేవైసీ పూర్తి అయ్యాకే పాస్ పుస్తకం ముద్రించి జారీ చేస్తాం. ఎక్కడా అవినీతి లేకుండా, పెత్తనం లేకుండా మీ భూమి మీ హక్కు పట్టాదారు పాస్ పుస్తకాలను గ్రామ సభ ద్వారా ఇస్తున్నాం. ఈ పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేసే విషయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలి. క్షేత్రస్థాయి వరకూ రీసర్వే పూర్తైన గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ జరగాలి అన్నారు.

# తిరుమల సమాచారం

## 15నుండి శ్రీవారికి యధావిధిగా సుప్రభాతసేవ

**తిరుమల,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిరోజూ తెల్లవారుజామున 2.30గంటలకు దేవదేవుడిని నిద్రనుండి మేల్కొలిపేందుకు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే సుప్రభాతసేవ తిరిగి ఈనెల 15వతేదీ గురువారం నుండి పునఃప్రారంభంకానుంది. ధనుర్మాసం ఘడియలు 14వతేదీతో అర్ధరాత్రితో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో 15వతేదీ కనుమ పర్వదినంనుండి ఏడుకొండలస్వామికి "కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యాప్రవర్తితే"అనే నామం వినిపించనుంది. ప్రతి ఏడాది డిసెంబర్ 16వతేదీ నుండి ధనుర్మాసం ఆరంభంతో వెంకన్న ఆలయంలో సుప్రభాతసేవ రద్దయి ఆ స్థానంలో గోదాదేవి తిరుప్పావై పాశురాలు పారాయణం జరుగుతుంది. జనవరి 14వ తేదీతో ధనుర్మాసం ముగిస్తే యధాప్రకారం ఏడాదంతా సుప్రభాతసేవతోనే స్వామివారిని మేల్కొలుపుతారు. ఈ సేవకు తెల్లవారుజామున గృహస్థభక్తులను అనుమతినిస్తారు.

## శ్రీవారిమెట్టు దారిలో చిరుత కలకలం

**తిరుమల,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారిమెట్టు మార్గంలో 400వ మెట్టు సమీపంలో చిరుత సంచారం భక్తులలో కలకలం సృష్టించింది. శుక్రవారం ఉదయం మెట్టుమార్గంలో వెళుతున్న భక్తులు చిరుత కదలికలను గమనించి వెంటనే టిటిడి అధికారులకు సమాచారం అందించారు. భద్రత సిబ్బంది అక్కడికి చేరుకుని చిరుత సంచార ప్రాంతాన్ని అక్కడ పరిస్థితినే కాకుండా మొత్తం మార్గాన్ని జల్లెడపట్టారు. అయితే చిరుత కదలికలు లేవని నిర్ధారించుకుని భక్తులు అప్రమత్తంగా, ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్ళాలని అధికారులు సూచించారు.

## మొదటి ఘూట్‌లో గజరాజు కదలికలు



**తిరుమల,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** వేసవికి ముందే శేషాచలం అడవుల్లో గజరాజులు దారితప్పి నడకమార్గంలో మొదటి ఘూట్‌లో సంచరిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం తిరుమల నుండి తిరుపతికి దిగే ఘూట్‌లో అడవిలో నాలుగు ఏనుగులు కనిపించాయి. అడవిలో దారితప్పి రావడంతో ఆ సమయంలో వాహనదారులు అటుగా దిగుతుండటంలో భయపడ్డారు. చివరకు వాహనాల శబ్ధాలకు అవి మళ్ళీ అడవిలోకి వెళ్ళాయి. వాహనదారులు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీ వర్గాలు హెచ్చరించారు.

## ఎస్సీ కార్పొరేషన్ వాహనాల స్థితిపై కమిటీ

**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్సీ కార్పొరేషన్ జాతీయ సఫాయి కర్మచారి కార్పొరేషన్ నిధుల నుంచి 201819లో కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, పవర్ ఆటోల స్థితిని పరిశీలించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అప్పట్లో 42 హెచ్‌పీ ట్రాక్టర్లను డ్రైన్ల క్లీనింగ్ కోసం కొనుగోలు చేసి జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ల ఈడీలకు అప్పగించారు. వాటిని సరఫరా చేసేందుకు ఎన్నికల కమిషన్ అభ్యంతరం తెలపడంతో పలు వాహనాలను పంపిణీ చేయక అవి తుప్పుపట్టిపోయాయి. వాటిని ఏం చేయాలనే దానిపై పరిశీలించేందుకు ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్, ఎస్సీ గురుకులం సొసైటీ అడిషనల్ సెక్రటరీ సునీల్‌రాజ్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మి ్మ, ఆయా ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు, ఆయా జిల్లాల రవాణాశాఖ ప్రతినిధులను సభ్యు లుగా కమిటీ ఏర్పాటు

# ఐదో రోజునా ఆరని మంటలు

**కోనసీమ గ్యాస్‌లీక్‌పై సిఎం చంద్రబాబు ఏరియల్ సర్వే**



**రాజోలు,జనవరి9, (ప్రభాత వార్త)** కోనసీమ ఓఎన్జీసీ బావి వద్ద ఐదో రోజు మంటలు ఘటనాస్థలిని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు కోనసీమ జిల్లా, ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ బావి వద్ద ఐదో రోజు కూడా మంటలు కొనసాగుతుండటంతో ముఖ్య మంత్రి చంద్రబాబు శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. గ్యాస్ బావి నుంచి ఎగిసిపడుతున్న మంటలను, పరిసర ప్రాంతాల్లోని పరిస్థితిని ఆయన గగనతలం నుంచి పరిశీలించారు. అనంతరం మండపేట నియోజకవర్గంలోని రాయవరంలో ఆయన ఓఎన్జీసీ అధికారులు, కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎంపీ హరీశ్ బాలయోగి, ఎమ్మెల్యే వరప్రసాద్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సీఎం ఆరా తీశారు. మంటల వల్ల దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, బ్లోఅవుట్‌ను అదుపులోకి తెచ్చేందుకు ఆమోదించిన ప్రణాళిక ప్రకారం ముమ్మరంగా పనిచేస్తున్నామని ఓఎన్జీసీ ఒక ప్రకటనలో తెలిపింది. సంక్షోభ నిర్వహణ బృందం ఇప్పటికే బావి పరిసరాల్లోని శిథిలాలను చాలావరకు తొలగించి, బావి హెడ్ వద్దకు వెళ్లేందుకు మార్గం సుగమం చేసింది. బావిని క్యాపింగ్ చేసే దిశగా ఆపరేషన్ కొనసాగించేందుకు అడ్డంకిగా ఉన్న మాస్ట్, ఇతర పరికరాల భాగాలను తొలగించినట్లు పేర్కొంది.

బావి హెడ్ సమీపంలో సురక్షి తంగా పనిచేసేందుకు వీలుగా నిరంతరం నీటిని చల్లుతున్నామని వివరించింది. ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ సాధారణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారు. కాగా, సోమవారం మధ్యాహ్నం మరమ్మతు పనులు చేస్తుండగా ఈ బావి నుంచి అకస్మాత్తుగా ముడిచమురుతో కూడిన గ్యాస్ భారీగా ఎగిసిపడిన విషయం తెలిసిందే. దీంతో ఇరుసుమండ, పరిసర గ్రామాల్లో దట్టమైన పొగ, గ్యాస్ వ్యాపించి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

## అద్దె బస్సుల యాజమానుల సమస్యల పరిష్కారానికి చర్యలు :మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** అద్దె బస్సుల యాజమానుల సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని అద్దె బస్సుల అసోసియేషన్ ప్రతినిధులు గురువారం కలిశారు. స్త్రీ శక్తి పథకం వల్ల పెరిగిన ప్రయాణికుల రద్దీకి సరిపడినన్ని ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డనరీ, అల్ట్రా పల్లె వెలుగు, పల్లె వెలుగు అద్దె బస్సులు లేకపోవడంతో కొన్నిచోట్ల ఓవర్ లోడింగ్ పరిస్థితులు ఏర్పడుతున్నాయని వారు మంత్రికి తెలిపారు. అందువల్ల ప్రమాదాలు జరిగే అవకాశం, బస్సులో ప్రయాణికుల మధ్య వివాదాలు, సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుండటం, తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించినవేనని, వాటి అమలులో ఏర్పడే సమస్యలను సమీక్షి ంచి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. స్త్రీ శక్తి పథకంతో ప్రజా రవాణా వ్యవస్థపై ప్రభావం లేకుండా చూస్తామన్నారు. అద్దె బస్సుల యజమానుల సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.




జాతీయ రోడ్డు భద్రతా దినోత్సవాల దృశ్యం

## వాహనాలను నడిపేటప్పుడు డ్రైవర్లు వారి కుటుంబాలను జ్ఞాపకం తెచ్చుకోవాలి: ఆర్టీఒ ఎం. పద్మావతి

**విజయవాడ,జనవరి 9,ప్రభాతవార్తప్రతినిధి:** వాహనాలను నడిపేటప్పుడు డ్రైవర్లు వారి కుటుంబాలను జ్ఞాపకం తెచ్చుకోవాలని రోడ్డు రవాణా శాఖాధికారులు సూచించారు. వాహనాలను నడపడానికి సిద్ధమయ్యేటప్పటికే వాటి స్థితిని గమనించాలన్నారు. వేగ నియంత్రణ విషయంలో డ్రైవర్లు చాలా ఓర్పుతోను, సమయసూర్తితో వ్యవహరించాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ ఆర్‌టీఓ కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో ఎం. పద్మావతి గారు మాట్లాడుతూ, స్కూల్ బస్సులు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా ఉండాలి, అలాగే డ్రైవర్ మరియు అటెండర్ యూనిఫాం ధరించాలి అని తెలిపారు. అదేవిధంగా, అత్యవసర ద్వారం సక్రమంగా ఉండేలా చూసుకోవాలి అని అన్నారు. తదుపరి మోటార్ వాహన తనిఖీ అధికారి ఎం. పూర్ణిమ మాట్లాడుతూ, స్కూల్ బస్సులో ఎటువంటి పరిస్థితుల్లోనూ పరిమితిని మించి విద్యార్థులను ఎక్కించరాదని స్పష్టం చేశారు. డ్రైవర్‌కు కనీసం 5 సంవత్సరాల డ్రైవింగ్ అనుభవం ఉండాలి అని పేర్కొన్నారు.

# సూర్యజయంతికి సప్తగిరులు సిద్ధం

## -24నుండి టైమ్‌స్లాట్ టోకెన్లు నిలుపుదల



**తిరుమల,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఈనెల 25వతేదీ ఆదివారం సూర్యజయంతి(రథసప్తమి) వేడుకలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలదేవుడు భక్తులకు దర్శనమివ్వనున్నాడు. ఈ సందర్భంగా తిరుమల ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దుచేస్తుంది. భక్తులను వైకుంతమ్ 2 క్యాకాంప్లెక్స్‌ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులను సమాయత్తం చేస్తున్నారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటుచేస్తున్నారు. 25వతేదీ పూర్తిగా భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో కూల్‌పెయింటింగ్ ,ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. 25వతేదీ ఆదివారం అన్ని ఆర్జితసేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు దర్శనాలు,బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశారు. ఆ రోజు ఉదయం ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం ఉంటుంది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు. 24నుండి 26వరకు ఆఫ్‌లైన్‌లో సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు రద్దు చేశారు. తిరుమలకు అశేష సంఖ్యలో విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేశారు. 25వతేదీ ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలు ఆలయ మాఢవీధుల్లో స్వామివారు అధిరోహించి ఊరేగనున్నారు.

## మంత్రి నారా లోకేష్ 'ఉద్యోగాల సృష్టికర్త' - 'ది వీక్' ప్రత్యేక కథనం



**విజయవాడ.జనవరి 9,ప్రభాత వార్తప్రతినిధి:** ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పాలన దక్షత, దార్శనికత జాతీయ స్థాయిలో విస్తృత గుర్తింపు పొందుతున్నాయి. ప్రతిష్ఠాత్మక జాతీయ వార పత్రిక "ది వీక్"తమ కొత్త సంచికలో లోకేశ్ ఫొటోను కవర్ పేజీపై ప్రచురించి, ఏపీకి చీఫ్ జాబ్ క్రియేటర్ (ఉద్యోగాల సృష్టికర్త) అని అభివర్ణించింది. ఉద్యోగాలు, నైపుణ్యాలు, పెట్టుబడిదారుల విశ్వాసంపై లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారని, ఇది ఆర్థిక వృద్ధిని ప్రజల ఉపాధిగా మార్చాలనే ఆయన బలమైన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమలకు అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా మారుస్తున్నారని కొనియాడారు. పారిశ్రామిక వర్గాలు ప్రభుత్వంపై నమ్మకం ఉంచడం, రాష్ట్రం సరైన దిశలో పయనిస్తోందన్న విశ్వాసాన్ని బలపరుస్తోందని ఆమె పేర్కొన్నారు. కాగా, ది వీక్ మ్యాగజైన్ కూడా లోకేశ్ గురించి పలు ఆసక్తికర విషయాలను తన కవర్ పేజీపై హైలైట్ చేసింది. కేవలం మాటలు చెప్పడమే కాకుండా, చేతలతో వేగం చూపిస్తూ పెట్టుబడులను ఆకర్షించడమే లోకేశ్ లక్ష్యమని పేర్కొంది. స్టాన్‌ఫోర్డ్, కార్నెగీ మెలన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలలో ఆయన పొందిన ఉన్నత విద్య, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఊతమిస్తోందని తెలిపింది.

## 19 నుండి 31వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

**పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు**

**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఈ నెల19 నుండి 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల ఆరోగ్య రక్షణ, ఉత్పాదకత పెంపుదల, వ్యాధుల నియంత్రణ మరియు పశుపోషణ ఖర్చులను తగ్గించడం. పశు పోషణ పై అవగాహన కలిగించడానికి రాష్ట్రంలోని 13,257 గ్రామాలలో జన్మభూమి తరహాలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో భారీ అగ్నిప్రమాదం



**విజయవాడ,జనవరి 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కార్యాలయ భవనంలోని స్టోర్ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కార్యాలయం లోపలి నుంచి భారీగా పొగలు రావడం గమనించిన సిబ్బంది.. వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఫైర్ సిబ్బంది వేగంగా స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదంలో స్టోర్ రూమ్‌లో భద్రపరిచిన పలు ప్రభుత్వ రికార్డులు కాలిపోయినట్లు ప్రాథమిక సమాచారం. అయితే ఏ రకమైన రికార్డులు, ఎంత నష్టం జరిగిందనే వివరాలు అధికారికంగా వెల్లడికాలేదు. ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందా? లేక మరే ఇతర కారణాలున్నాయా? అనే విషయాలపై అధికారులు విచారణ చేపట్టారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## డాక్టర్ సుధాకర్ కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం, కుమారుడికి పదోన్నతి

**- మంత్రి పార్ధసారధి**

**విజయవాడ.జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** గత ప్రభుత్వ హయంలో కరోనా సమయంలో తీవ్ర మనస్థాపానికి గురై మృతి చెందిన ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ కుటుంబానికి రూ.కోటి ఆర్దిక సాయం చేయాలని నిర్ణయం తీసుకున్నటు మంత్రి కొలసుపార్దసారథి తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ... ఇది డాక్టర్ సుధాకర్ కుటుంబానికి కేవలం డబ్బు సహాయం మాత్రమే కాదని, ఆయన కుటుంబానికి ఆర్థిక భద్రత, ఉద్యోగ స్థిరత్వం కల్పించే నిర్ణయమని అన్నారు.. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నామన్నారు. వైసీపీహయాంలో వేధింపులకు గురై మరణించారన్నారు.

# నిర్బంధ చట్టాలకు వ్యతిరేకంగా 12న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

**- రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు**



వడ్డే శోభనాద్రీశ్వరరావు

**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ నిర్బంధ చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. అనకాపల్లి జిల్లాలో రైతు సంఘం నాయకుడు అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టడం ప్రజా సమస్యలపై చంద్రబాబు ప్రభుత్వం పనితీరుకు అద్దం పడుతుందన్నారు. అప్పలరాజుపై 19 కేసులు ప్రజా సమస్యలపై పనిచేసిన సమయంలో పెట్టినవేనన్నారు. అనకాపల్లిలో మిట్టల్ ఐరన్ కంపెనీ, బల్క్ డ్రగ్ కంపెనీకి రైతులు భూములు కట్టబెట్టడాన్ని తాను, అప్పలరాజు, పలు రైతు సంఘాలు వ్యతిరేకించాయని గుర్తు చేశారు. హోంమంత్రి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ఆమెకు ఎదురైన నిరసన సెగ తట్టుకోలేక, కార్పొరేట్‌లకు రైతుల భూములు కట్టబెట్టేందుకు, వారి మెప్పు పొందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు సంఘం నాయకుడు అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టారని విమర్శించారు. ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులపై రౌడి షీట్లు తెరిచారన్నారు.. ఈ కేసులతో పోరాటాలు, ఉద్యమాలు చేసే వారిని బెదిరించాలని ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా ఆందోళనల్లో భాగంగా మండల కేంద్రాల్లో నిరసన తెలియజేయాలన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై. కేశవరావు మాట్లాడుతూ.. విబి జి ఆర్ఎఎం జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ఛైర్మన్ కామన ప్రభాకరరావు మాట్లాడుతూ.. కార్పొరేట్ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు అనుకూల చట్టాలను కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తుందని తెలిపారు. రైతులను విస్మరించిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని చెప్పారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెవివి ప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిర్బంధానికి వ్యతిరేకంగా 12న అన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించాలని కోరారు. 14నచట్టాల జీవోలను భోగి మంటల్లో దగ్ధం.

వార్త

మధ్యవర్తి మాట, అడవిలోని బాట ఎంత వరకు తీసుకెళ్తాయో ఎవరికీ తెలియదు.

-రాఛెల్

# సూత్రధారులే మూలం

చట్టాలకు సామాన్యులు లోకువ. సమర్థులకు చట్టాలు లోకువ అంటారు. ఏ సందర్భంలో ఎవరిని ఉద్దేశించి అన్నారో కానీ మారిన కాలమాన పరిస్థితుల్లో ఇది అక్షరాల నిజం అనిపిస్తున్నది. ఆర్థిక, అంగ, అధికార రాజకీయ బలం ఉన్నవారు తప్పుచేస్తే చర్యల సంగతి అటుంచి వేలెత్తి చూపడానికి కూడా జంకే దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. మిగిలిన నేరాల విషయంలో ఎలా ఉన్నా మానవ జాతిని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల నియంత్రణలో అటు పాలకులు కానీ, ఇటు అధికారయంత్రాంగం కానీ సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారేమోననిపిస్తున్నది. దేశవ్యాప్తంగా ఎంతో పోలీసు సిబ్బందిఉంది. నిఘా వ్యవస్థలున్నాయి. ఏకంగా నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఉంది. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర విభాగాలు ఉన్నాయి. నిత్యం నిఘా పెడుతున్నారు. అప్పుడప్పుడు తనిఖీల్లో పట్టుబడుతూనే ఉన్నాయి. కేసులు పెడుతున్నారు. జైళ్లకు పంపుతున్నారు. అయినా ఇవి ఆగడం లేదు. నిరాటంకంగా మాదకద్రవ్యాలు సరఫరా అవుతున్నాయి. ఇటీవల కాలంలో చెన్నై, ముంబయి, బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ లాంటి నగరాల్లోని విమానాశ్రయాల్లో మాదకద్రవ్యాలు వేలాది కోట్ల రూపాయలు పట్టుబడ్డాయి. గతంలో కేరళ సమీపంలో అరేబియా సముద్రంలో నౌకాదళం స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ అంతర్జాతీయ మార్కెట్లో దాదాపు ఐదారువేల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అధికార వర్గాలే అంచనా వేశాయి. ఇవన్నీ ఏదో ఒక వ్యూహం ప్రకారం పట్టుకున్నవి కావు. అధికారులు చేస్తున్న తనిఖీల్లో పట్టుబడినవే. ఇక విమానాల్లో రహస్యంగా తీసుకువస్తున్న మత్తుపదార్థాలు తక్కువేమీ కాదు. రకరకాల మార్గాల్లో వీటిని తరలిస్తున్నారు. మొన్న ఆ మధ్య ఇద్దరు మహిళలు రహస్యంగా సూట్‌కేసుల్లో వైర్‌బండిళ్ల మాటున మత్తుపదార్థాలను తరలిస్తుండగా కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ఆహార సరఫరా ముసుగులో మత్తుపదార్థాలు పంపిణీ చేస్తున్న బాగోతం ఉత్తరభారతంలో తరచుగా బయటపడుతున్నది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో మత్తుపదార్థాల వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నట్లు అధికారులు కూడా అంగీకరిస్తున్నారు. ముంబాయి నగరం కొకైన్ కేంద్రంగా మారినట్లుకు మాదకద్రవ్యాల నియంత్రణ సంస్థే అంగీకరించక తప్పడంలేదు. ఇక గంజాయి సాగు దేశంలో అనేక రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో కూడా సాగు చేస్తున్నారు. అప్పుప్పుడు ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి గంజాయి పంటను ధ్వంసం చేస్తున్నా మళ్లీ రెండు, మూడు నెలల్లో యధావిధిగా సాగులోకి వస్తున్నాయి. అడవుల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇది సాగు చేసే స్మగ్లర్లు పట్టుబడగానే సూత్రధారులు అదృశ్యమైపోతున్నారు. కేవలం ఆ ప్రాంతంలో అమాయక రైతులు, రైతు కూలీలు ఇరుక్కుపోతున్నారు. అంతేకాదు అత్యంత విలువైన మాదకద్రవ్యాల రవాణాలో పట్టుబడుతున్నది పాత్రధారులే. వారి వెనుకఉండే సూత్రధారులను పట్టుకోలేకపోతున్నారు. స్పష్టంగా తెలిసినా కూడా సరైన సాక్ష్యాలు లేకపోవడం వల్ల వారి జోలికి వెళ్లలేకపోతున్నారు. వెళ్లినా న్యాయస్థానాల ముందురుజువు చేయకపోవడంతో చర్యలు చేపట్టలేకపోతున్నారు. మాదకద్రవ్యాలు అఫ్ఘానిస్థాన్ నుండి ఆఫ్రికా మీదుగా భారత్‌కు చేరుకొని వివిధ మార్గాలద్వారా దేశంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. మరోకపక్క మయన్మార్‌లో జరిగిన సైనిక తిరుగుబాటు నుంచి మణిపూర్, మిజోరం వరకు భారీగా మాదకద్రవ్యాలు ప్రవేశిస్తున్నాయి. కొన్ని మాదకద్రవ్యాల ముఠాలు ఈశాన్యభారతంలోని కొన్ని తీవ్రవాద బృందాలకు నిధులు అందిస్తున్నాయి. ఇది దేశ భద్రతకు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఆ మధ్య మయన్మార్ వలసదారుల నుంచి పద్దెనిమిది ఆయుధాలు డెబ్బైనాలుగు కోట్ల రూపాయల విలువైన అక్రమ రవాణా వస్తువులు, దాదాపు రెండువందల కోట్ల విలువైన మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. సరఫరా ముఠాల కదలికలపై నిఘావేసి నియంత్రించాల్సిన నార్కోటిక్ కంట్రోల్‌బ్యూరో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, పోలీసులు తదితర శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కూడా ఈ మత్తు పదార్థాల విస్తరణకు కారణం అవుతున్నది. తెలుగురాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ప్రస్తుతం అంతకంతకు పెరిగి సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తుపదార్థాల వాడకం, వినియోగం ఆందోళన కలిగిస్తున్నది. ఈ మహమ్మారి దేశవ్యాప్తంగా ఆ మాటకొస్తే ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. చాపకింద నీరులా ఈ స్మగ్లర్లు తనసామ్రాజ్యాన్ని పెంచుకుంటూపోతున్నారు. యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదకద్రవ్యాలు వేలాది టన్నులకుపైగా ప్రపంచవ్యాప్తంగా సరఫరా అవుతున్నట్లు అనధికార అంచనాలనుబట్టి తెలుస్తున్నది. లక్షలాది కోట్లరూపాయల వ్యాపారం జరుగుతున్నది. ఈ జాఢ్యం విస్తరించడం అత్యంత ప్రమాదకరం. మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపించాల్సిన తరుణమిది. ముఖ్యంగా మాదకద్రవ్యాల సరఫరాలో పట్టుబడుతున్న పాత్రధారులను కాకుండా సూత్రధారులను బయటకుతీసి న్యాయ స్థానాల ముందు తిరుగులేని సాక్ష్యాలతో రుజువు చేసి పటిష్టమైన చర్యలుచేపట్టాలి. వినియోగం ఉత్పత్తి, నిల్వ, వ్యాపారానికి పాల్పడడం అత్యంత తీవ్రమైన నేరాలుగా కొన్నిదేశాలు పరిగణిస్తున్నాయి. ఆయాదేశాలు మరణ శిక్షలు కూడా విధిస్తున్నాయి. పాలకులు అలాంటిశిక్షలవైపు దృష్టిసారించాలి. పాత్రధారులతోపాటు సూత్రధారులను పట్టుకుంటే తప్ప ఇది ఆగే పరిస్థితి కన్పించడం లేదు. ఏమాత్రం జాప్యం చేసినా యువతపై తీవ్ర ప్రభావం చూపి అరాచకం ప్రబలే ప్రమాదం ఉంది.

మనం ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.



సెయింట్ థెరిసా

మాట ఇవ్వడానికి తొందరపడొద్దు. ఇచ్చిన మాట నెరవేర్చడానికి వెనుకాడవద్దు.



లియో టాల్‌స్టాయ్

# మాదన్నమాకీ.. రాజన్న దేవుడా!

**నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఇటీవలనే కొలువుతీరారు. వారి ముందు అనేక సమస్యలున్నాయి. ఏళ్లతరబడి పేరుకుపోయాయి. ఫలితంగా ప్రగతికి మూలం కావాల్సిన పల్లెలు సమస్యల నిలయాలుగా ఉన్నాయి. గ్రామాభివృద్ధికి చేపడుతున్న పనులు పంచాయతీల పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఏదిఏమైనా రాజ్యాంగపరంగా పంచాయతీలకు ఇవ్వాల్సిన అధికారాలు వాటికి ఇవ్వడంలో జాప్యం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలనికేంద్రం ముందుగావుకేకలు పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వకపోవడం ఏమాత్రం సమంజసంకాదు.**

దామెర్ల సాయిబాబ

మొక్కులు, కానుకలు, దక్షిణతాంబూలాలు అన్ని సమర్పించుకున్న తర్వాత కూడా దైవం కోరిన వరాలు ఇవ్వకపోతే కోర్కెలు తీర్చకపోతేపోయావు, తాము సమర్పించుకున్న కానుకలు, దక్షిణలు తిరిగి ఇవ్వాలంటూ 'మాదన్న మాకీ రాజన్నదేవుడా' అంటూ భక్తులు వేములవాడలోని రాజరాజేశ్వర స్వామిని వేడుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. భక్తులు సమర్పించుకున్న కానుకలు చెల్లించడానికి ఆయన దగ్గర లక్ష్మీ ఉండదు కనుక ఏదో ఒక వరం ఇచ్చి పంపుతారనేది భక్తుల విశ్వాసం. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన స్థానిక సంస్థల ప్రతినిధుల పరిస్థితి అందుకు అద్దంపడుతున్నదేమోననిపిస్తున్నది. పంచాయతీలకు విధులు, నిధులు ఇస్తాం, చట్టాలు తెచ్చాం, తెస్తున్నాం, గ్రామ సమస్యలను గుర్తించి స్థానికంగా పరిష్కరించేందుకు అవసరమైన నిధులు, అధికారాలు ఇస్తున్నామని ఎంతో కాలంగా పాలకులు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తూనే ఉన్నారు. కానీ అయ్యా మాకేమి కొత్త చట్టాలు చేసి అదనంగా నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించిన 39 ప్రభుత్వ శాఖలను గ్రామస్థాయిలో తమకు అప్పగిస్తే అదే చాలు అని వారు ఎంతోకాలంగా వేడుకుంటూనే ఉన్నారు. దశాబ్దాలు గడచిపోతున్నా ఆవైపు అడుగులు వేయడానికి పాలకులు మనసు ఒప్పడం లేదు. పాలకుల మాటలు నమ్మి కొందరు ప్రజాప్రతినిధులు చివరకు తలతాకట్టుపెట్టి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి తమ తమ గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది రూపాయలు ఇలా అప్పుతెచ్చిన డబ్బుతోపాటు సొంత సొమ్మును కూడా వెచ్చించారు. అయితే ఆ డబ్బు తిరిగి రాబట్టుకోవడం కోసం వారుపడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. తెలంగాణ రాష్ట్రంలో వారి పదవీకాలం పూర్తయి దాదాపు రెండేళ్లు దాటిపోయింది. మాజీలు అయిపోయారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా ఎన్నికలు కూడా పూర్తి చేశారు. కొత్త సర్పంచులు పదవీబాధ్యతలు కూడా స్వీకరించారు. ఇక తాము పెట్టిన డబ్బు కోసం మాజీ సర్పంచులు పడుతున్న పడరాని పాట్లు పరిశీలిస్తే ఆవేదన కలగకతప్పదు. ఇప్పటికే కొందరు మాజీ సర్పంచులు అప్పుల వాళ్ల ముందు తలవంచుకోలేక మరొకపక్క ఆత్మగౌరవం చంపుకోలేక తలవంచుకొని బతకలేక వారిలో వారు కుమిలి కుమిలి చివరకు కొందరు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. మొన్న తెలంగాణ అసెంబ్లీని మాజీ సర్పంచులు ముట్టడికి ప్రయత్నించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామాభివృద్ధికి తాము అప్పు తెచ్చి వ్యయం చేసిన డబ్బును తిరిగి ఇవ్వమని, ఇప్పటికే ఏళ్లు జరిగిపోయాయని, వడ్డీలకు వడ్డీలు కట్టలేకనే సతమతమైపోతున్నామనేదే వారి ఆవేదన. నూతనంగా ఎన్నికైన సర్పంచులలో సందిగ్ధత కన్పిస్తున్నది. నిధులు లేవు. పోని ఎక్కడైనా సొంత పలుకుబడితో అప్పులు తెచ్చిపెడితే మాజీ సర్పంచుల పరిస్థితులు ప్రత్యక్షంగా చూస్తున్నారు. అలాని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోతే ప్రజలకు తాము చేసిన వాగ్దానాల పరిస్థితి ఏమిటి? ఎంతో ఉత్సాహంగా గ్రామాభివృద్ధికి అహర్నిశలు కృషి చేయాలని తపనతో ఎన్నికైన ఈ నూతన సర్పంచులలో కొందరి పరిస్థితి అయోమయం, అగమ్యగోచరంగా ఉంది. ఇక నిధుల సంగతి అలా వుంచితే అధికారాల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగాలేదు. చట్టంలో ఉంది కనుక ఇవ్వలేమని చెప్పలేరు. అలాని ఇవ్వరు. ఇప్పటివరకు రాజ్యాంగం కల్పించిన 29 అధికారాల్లో

### ఒక్క మాట

కేవలం పదమూడు మాత్రమే ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ పదమూడులో కూడా అధిక శాతం కాగితాలకే పరిమితం చేశారు. మరోపక్క విద్యాకమిటీలు అంటూ స్థానిక సంస్థలకు సమాంతరంగా వ్యవస్థలను ఏర్పాటు చేసి సర్పంచు పదవులను ఉత్సవ విగ్రహాలుగా తయారు చేశారు. స్థానిక సంస్థల ప్రతినిధుల ప్రమేయం లేకుండానే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, చివరకు లబ్ధిదారుల గుర్తింపులు కూడా జరిగిపోతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు ఆరంభం కాకపోయినా మూడు, నాలుగు దశాబ్దాలుగా ఒక వ్యూహం ప్రకారం స్థానిక సంస్థలను బలహీనపరిచే కార్యక్రమం జరుగుతున్నది. చివరకు చీపురు కట్టకొనడానికి కూడా స్వతంత్రంగా స్థానిక సంస్థలు వ్యవహరించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మరొకపక్క గ్రామ అవసరాలు పెరిగిపోయాయి. అందుకు తగ్గట్టుగా ఆదాయం పెరగడం లేదు. ఆస్తిపన్ను తప్ప పెద్దగా ఆదాయ వనరులు లేకుండాపోయాయి. ఇక గ్రామంలో ఏ అభివృద్ధి చేయాలన్నా, అటు కేంద్రప్రభుత్వంవైపో, ఇటు రాష్ట్ర ప్రభుత్వం వైపో చేయిచాపి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏ కోణం నుంచి చూసినా పంచాయతీ రాజ్ వ్యవస్థను అంతో ఇంతో నిర్వీర్యం చేయాలనిఅందరూ ప్రయత్నం చేసిన వారే. తమ అధికారులతో ప్రాబల్యానికి దెబ్బతగులుతుందనే భయమే ఇందుకు ప్రధాన కారణమనే చెప్పొచ్చు. ఈ పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారానే రాజకీయ ప్రవేశం చేసి ఉన్నతస్థాయికి చేరిన కొందరు నాయకులు కూడా పంచాయతీలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించడం అత్యంత బాధాకరం. దేశంలో కానీ, రాష్ట్రంలో కానీ ఎంతో సమర్థవంతులుగా పేరు తెచ్చుకున్న నాయకుల్లో అధిక శాతం పంచాయతీ రాజ్ వ్యవస్థ నుండి వచ్చినవారే. సర్పంచులు, సమితి అధ్యక్షులు జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేసినవారికి ప్రజాసమస్యలను ముఖ్యంగా గ్రామీణ సమస్యలపట్ల మంచి అవగాహన ఉంటుంది. ఏసమస్య వచ్చినా తమ తరుపున మాట్లాడటానికి తమ సర్పంచు ఉన్నాడనే ధైర్యం గ్రామప్రజల్లో అపారంగా ఉండేది. ఇలా ప్రజల హృదయాల్లో చోటు చేసుకున్నా గ్రామస్థాయి నాయకులు ఎందరో ఉన్నతస్థాయికి ఎదిగారు. అసలు భారత దేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉంది. చంద్రగుప్తుడికంటే ముందునుంచే గ్రామాలు, గ్రామవ్యవస్థలు అమలులో ఉన్నట్లు చరిత్ర చెబుతున్నది. అప్పుడుకూడా గ్రామసభలు ఉండేవి. వాటి నిర్ణయాలకు ఆనాటి రాజరికపు వ్యవస్థ ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేది. ప్రాచీన కాలం నుంచి గ్రామవ్యవస్థ ఏదోఒక రూపంలో మనదేశంలో కొనసాగుతూ వస్తూనే ఉంది. 1882లోఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్‌రిప్పన్ స్థానిక సంస్థలకు ఒక ప్రతిపత్తి కల్పించారు. స్వాతంత్ర్యానంతరం 1952లో మొదటి పంచవర్ష ప్రణాళికలోనే కేంద్రప్రభుత్వం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇలా ఎన్నో మార్పులు, చేర్పులు జరిగాయి. దేశవ్యాప్తంగా ఒకే తరహా పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులో ఉండాలనే ఉద్దేశ్యంతో 73వ రాజ్యాంగ సవరణబిల్లును పార్లమెంటు ఆమోదించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994మే 30వ తేదీనుండి ఈ శాసనం అమలులోకి వచ్చింది. ఈ చట్టప్రకారమే ఐదంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇలా ముఖ్యమంత్రులు మారినప్పుడు, అధికారంలో పార్టీలు మారినప్పుడు ఎవరికి తోచిన విధంగా వారు ఈ పంచాయతీరాజ్ వ్యవస్థను మార్పులు, చేర్పులతో ముంచెత్తారు. అయితే ఎన్నిమార్పులు చేసినా, మరెన్ని కూర్పులు చేసినా చట్టప్రకారం అధికారాలుకల్పించినా అధికార వికేంద్రీకరణలో మాత్రం మొదటినుంచి అధికారంలో ఉన్న పెద్దలు జాగ్రత్తలు పడుతూనేఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం పాత చట్టాన్ని రద్దుచేసి 2018ఏప్రిల్ నుంచి కొత్త చట్టాన్నితీసుకు వచ్చింది. ఆ చట్టప్రకారం కొన్ని అధికారాలతోపాటు ఆదాయం పెంచుకునే మార్గాలకు అవకాశం ఇచ్చింది. ఇప్పుడు నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఇటీవలనే కొలువుతీరారు. వారి ముందు అనేక సమస్యలున్నాయి. ఏళ్లతరబడి పేరుకుపోయాయి. ఫలితంగా ప్రగతికి మూలం కావాల్సిన పల్లెలు సమస్యల నిలయాలుగా ఉన్నాయి. గ్రామాభివృద్ధికి చేపడుతున్న పనులు పంచాయతీల పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఏదిఏమైనా రాజ్యాంగపరంగా పంచాయతీలకు ఇవ్వాల్సిన అధికారాలు వాటికి ఇవ్వడంలో జాప్యం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు గావుకేకలు పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వకపోవడం ఏమాత్రం సమంజసంకాదు. •

# సభలు మాట్లాడితేనే ప్రజాస్వామ్యానికి బలం


తిప్పర్తి శ్రీనివాస్

ప్రజాస్వామ్యం అనేది కేవలం ఓటు హక్కుతో పరిమితమయ్యే వ్యవస్థ కాదు. ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, సమస్యలు చర్చకు వచ్చి విధానాలుగా రూపాంతరం చెందే వేదికే నిజమైన ప్రజాస్వామ్యం. ఆ వేదికలే చట్టసభలు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, శాసనమండలులు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణం లాంటివి. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల ద్వారా పాలన నడిచే ఈ వ్యవస్థలో చట్టసభల పాత్ర అత్యంత కీలకమైనది. అందుకే చట్టసభలు ప్రజాస్వామ్యానికి ప్రతీకలు" అనడం అతిశయోక్తి కాదు. చట్టసభల ప్రధాన బాధ్యత చట్టాలను తయారు చేయడం. కానీ ఆ పని కేవలం చట్ట రచనతో ముగియదు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, పాలనపై పర్యవేక్షణ చేయడం, విధానాలపై చర్చ జరిపి లోపాలను ఎత్తిచూపడం వంటి కీలక పాత్రలను కూడా చట్టసభలు నిర్వర్తిస్తాయి. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని పరిమితం చేయడానికి, దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికి చట్టసభలే ప్రధాన ఆయుధం. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉందా లేదా అన్నది చట్టసభల చర్చల ద్వారానే వెలుగులోకి వస్తుంది. భారతదేశంలాంటి విభిన్న దేశంలో చట్టసభల ప్రాధాన్యం మరింత ఎక్కువ. భాషలు, సంస్కృతులు, మతాలు, ప్రాంతాలు భిన్నమైన ప్రజల అభిప్రాయాలు ఒక్క వేదికపై వ్యక్తమయ్యే అవకాశం చట్టసభల వల్లే సాధ్యమవుతోంది. గ్రామీణ ప్రాంతాల సమస్యల నుంచి పట్టణాల సవాళ్ల వరకు, రైతుల కష్టాల నుంచి యువత ఆశల వరకు అన్నింటినీ ప్రతినిధులు సభలోప్రస్తావించగలుగుతారు. ఈ విధంగా చట్టసభలు దేశానికిఅద్దంలా నిలుస్తాయి. అయితే ఇటీవలి కాలంలో చట్టసభల పనితీరుపై విమర్శలు కూడా పెరుగుతున్నాయి. సభలలో గందరగోళం, వాకౌట్లు, నినాదాలు, పరస్పర ఆరోపణలు ఎక్కువవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చర్చకు రావాల్సినకీలక అంశాలు పక్కకు నెట్టబడుతూ, సమయం వృథా అవుతోందన్న ఆవేదన ప్రజల్లో ఉంది. చట్టసభల స్థాయికి తగ్గట్టుగా సభ్యులు వ్యవహరించడం లేదన్న అభిప్రాయం బలపడుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి శుభసూచకం కాదు. ప్రజలు ఓటు వేసి ఎన్నుకున్న ప్రతినిధులు చట్టసభలలో తమ గొంతును వినిపించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. సభ అనేది రాజకీయ పోరాటానికి మాత్రమే కాదు, నిర్మాణాత్మకచర్చకు వేదిక కావాలి. విభేదాలు ఉండటం సహజమే కానీ, అవి విధ్వంసానికి కాకుండా విధానపరమైన చర్చలకు దారి తీయాలి. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని విమర్శించడమే కాదు, అవసరమైన సూచనలు చేయాలి. అధికార పక్షం విమర్శలను శత్రుత్వంగా కాకుండా ప్రజల గొంతుగా స్వీకరించాలి. అప్పుడే చట్టసభల గౌరవం నిలుస్తుంది. చట్టసభల గౌరవం అంటే కేవలం భవనం లేదా సంప్రదాయాలకే పరిమితం కాదు. సభ్యుల ప్రవర్తన, మాటతీరు, చర్చా స్థాయి, ప్రజా సమస్యలపై అవగాహన – ఇవన్నీ కలిసే ఆ గౌరవాన్ని నిర్ణయిస్తాయి. ప్రజల సమస్యలపై లోతైన అధ్యయనం చేసి సభలో మాట్లాడే ప్రతినిధులు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తారు. అలాంటివారు చట్టసభలను నిజమైన ప్రజాస్వామ్య ప్రతీకలుగా నిలబెడతారు. మీడియా పాత్ర కూడా ఈ సందర్భంలో కీలకం. చట్టసభలలో జరిగే చర్చలను ప్రజలకు చేరవేయడం, ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించడం మీడియా బాధ్యత. అదే సమయంలో కేవలం సంచలనాలకే ప్రాధాన్యం ఇవ్వకుండా, సారవంతమైన చర్చలను ప్రజల ముందుకు తీసుకురావాలి. అప్పుడు ప్రజల్లో కూడా చట్టసభలపై ఆసక్తి, గౌరవం పెరుగుతుంది. ప్రజాస్వామ్యంలోప్రజల పాత్ర కూడా తక్కువ కాదు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా, పాలనపై నిరంతరం దృష్టి పెట్టాలి. తమ ప్రతినిధులు చట్టసభలలోఎలా వ్యవహరిస్తున్నారో గమనించాలి. ప్రశ్నించాలి. అవసరమైతే ప్రజాభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేయాలి. ప్రజల చైతన్యమే చట్టసభలను సజీవంగా ఉంచుతుంది. చివరగా చెప్పాలంటే, చట్టసభలు ప్రజాస్వామ్యానికి కేవలం ప్రతీకలు మాత్రమే కాదు, దాని రక్షకులు కూడా. చట్టసభల గౌరవాన్ని కాపాడుకోవడం ప్రజా ప్రతినిధులబాధ్యత మాత్రమే కాదు, ప్రజల బాధ్యతకూడా. నిర్మాణాత్మక చర్చలు, పరస్పర గౌరవం, ప్రజాహితంపై దృష్టి చట్టసభలను నిజమైన ప్రజాస్వామ్య ప్రతీకలుగా నిలబెడతాయి. •

# వెనెజులాపై దాడి సామ్రాజ్యవాద సందేశమా?

బి.వీరభద్రం

అమెరికా ప్రత్యేక బలగాలు వెనిజులా రాజధాని కారకాస్ పైచేసిన సాహసోపేత దాడిలో అధ్యక్షుడు నికోలాస్ మదురో, భార్య సిలియా ఫ్లోర్స్ ఇద్దరినీ తీసుకెళ్ళి న్యూయార్క్ జైలులో బంధించడం ప్రపంచ రాజకీయాలను కుదిపేసింది. తొలుత వెనుజువెలాను తామే పాలిస్తామని ట్రంప్ ప్రకటించారు, తర్వాత వెనక్కి తగ్గారు. మూడు రోజుల తర్వాత కూడా ఈ మొత్తం ఘటన వెనక ఉన్న ట్రంప్ ప్రభుత్వ రాజకీయ లక్ష్యం ఏమిటో అర్థం కాలేదు. వెనుజువెలా 303 బిలియన్ బ్యారెల్ల చమురు నిల్వలు స్వాధీనం చేసుకోవడం, మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని అరికట్టడం, పెట్రో డాలర్ వ్యవస్థను కాపాడడం, మదురో ప్రభుత్వాన్ని అస్థిరపర్చి బొలివేరియన్ సోషలిజాన్ని కుప్పకూల్చడం కోసం వంటివాదనలు వినిపిస్తున్నాయి. మరికొందరు ఎప్స్టీన్ కేసు నుంచి దృష్టి మరల్చడానికి, 2026 నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికలకు ట్రంప్ రాజకీయ ఎత్తుగడ అనే వాదనలు కూడా చర్చల్లో ఉన్నాయి. ఎప్స్టీన్ కేసుఅంటే అమెరికా రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. ఇది రాజకీయంగా, న్యాయపరంగా, సామాజికంగా సంచలనం రేపిన ఒక లైంగిక దోపిడీ కేసు, బాలికల అక్రమ రవాణాపేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన చిన్నారి బాలికలు, యువతులకు ఉద్యోగం, మోడలింగ్, చదువు అవకాశాల పేరుతో ప్రలోభపెట్టి తన ఇళ్లకు తీసుకెళ్లేవాడన్న ఆరోపణల కేసు ఇది. ఎప్స్టీన్ అనే వ్యక్తికి అమెరికాలోని రెండు ప్రధాన రాజకీయ పార్టీల నేతలతో సంబంధాలున్నాయన్న వార్తలు, ఫొటోలు బయటకు రావడంతో డెమోక్రాట్లు, రిపబ్లికన్లు ఒకరినొకరు పరస్పరం ఆరోపించుకుంటున్నారు. ఎప్స్టీన్ కేసులోని ఫైల్స్‌ను పూర్తిగా బయట పెట్టే బిల్లుపై సంతకం చేయడం, ఆ ఫైల్స్ లో ఎవరి పేర్లు ఉన్నాయనేది అమెరికా రాజకీయాల్లో పెద్ద చర్చగా మారింది. ఈ క్రమంలోఎప్స్టీన్ జైలులో ఊచల మధ్యనే మరణించడంతో వాతావరణం మరింత వేడెక్కింది. ట్రంప్ ప్రభుత్వాధినేతలతో ఎప్స్టీన్‌కు సంబంధాలున్నాయి అనే ఆరోపణలకు మరింత బలం చేకూరింది. తద్వారా ట్రంప్ ప్రభుత్వంపై వస్తున్న విమర్శల దృష్ట్యా ప్రజలు, విపక్షాల దృష్టి మరల్చడానికి ట్రంప్ ఈ చర్యలకు దిగాడన్న ఆరోపణలున్నాయి. వెనెజువెలా చమురు క్షేత్రాలపై అజమాయిషీ కోసం ప్రయత్నం చేయడాన్ని ట్రంప్ సమర్థించుకున్నాడు. అమెరికన్ కంపెనీలే తమ పెట్టుబడులతో వెనెజువెలా చమురు రంగాన్ని నిర్మించాయని, సోషలిస్ట్ రాజ్యం జాతీయీకరణ చేసి చమురు కంపెనీలపై ఆధిపత్యం సాధించిందనీ, తిరిగి ప్రైవేట్ పరంచేసి వెనెజువెలా దేశ ప్రజలకు విద్యా, వైద్యం, ఉపాధి కల్పిస్తామనీ ట్రంప్ వాపోతున్నారు.



అయితే, చమురుపై ఆధిపత్యం కోసమే ఈ దుశ్చర్యకు దిగాడన్నది కొంతమేరకు నిజమైనా, నూటికి నూరు శాతం అదే కారణంగా చూపడానికి ఎటువంటి సహేతుకమైన ఆధారాలు లేవు. వెనుజువెలాకు ప్రపంచంలోనే అతిపెద్దచమురు నిల్వలు ఉన్నాయన్నది నిజం, కానీ వెనుజువెలా క్రూడ్‌లో వెనేడియం, నికెల్, ఐరన్, కాపర్ వంటి లోహాలు, సల్ఫర్ ఎక్కువగా ఉన్నటువంటి తక్కువ నాణ్యత గల చమురు. ప్రామాణికంగా 0.5 శాతం కన్నా ఎక్కువగా సల్ఫర్, ఇతర లోహాలు గల క్రూడ్‌ను సోర్‌క్రూడ్ అనీ, 0.5 శాతం కంటే తక్కువ సల్ఫర్, లోహాలు గల క్రూడ్‌ను స్వీట్ క్రూడ్ అని అంటారు. వెనిజులా క్రూడ్‌లో సల్ఫర్, ఇతర లోహాలసాంద్రత ఎక్కువగా ఉన్నందున పెట్రోల్, డీజిల్ వంటి ఉత్పత్తులుగా శుద్ధిచేయడం అంత సులువుకాదు, దీని సేకరణ, శుద్ధి చేయడం అమెరికా రిఫైనరీలకు పెద్ద సవాలు, ఖర్చుతో కూడినది. జామ్ నగర్ రిలయన్స్ క్రూడ్ రిఫైనరీల వంటి అత్యాధునిక రిఫైనరీలు (నెల్సన్ కాంప్లెక్సిటీ ఇండెక్స్ 20+ గలవి) మాత్రమే దీన్ని సమర్థవంతంగా శుద్ధిచేయగలవు. అమెరికాకు ఇప్పటికే 14 మిలియన్ బ్యారెల్ల డబ్ల్యూటీఐ(సల్ఫర్, లోహాల సాంద్రత తక్కువగా గల క్రూడ్), షేల్ ఆయిల్(రాతి పొరల నుండి సేకరించిన క్రూడ్) ఉత్పత్తి ఉంది. వెనుజువెలా చమురు పరిశ్రమలను తిరిగి పునరుద్ధరించడానికి సుమారు 30 బిలియన్ డాలర్లు అవసరం, పైగా 3 సంవత్సరాలు పడుతుంది. ఇప్పటికిప్పుడు వెనుజువెలా చమురు ఉత్పత్తి రెట్టింపైనా (900,000నుంచి 2మిలియన్ బ్యారెల్లు), ప్రపంచ మార్కెట్లో 13మాత్రమే తప్ప, దీని ప్రభావం పెద్దగా ఉండదు. వెనుజువెలా చమురు పరిశ్రమఉత్పత్తి పెరిగి, తక్కువ ధరకు ప్రపంచ మార్కెట్లో అమ్మాలని చూసినా, పెట్రోలియం ఎగుమతి చేసే పెట్రో ఆధారిత ఆర్థిక వ్యవస్థ గల అంతర్జాతీయ దేశాలు చమురు ధరలు తగ్గించి మార్కెట్ విస్తరణను అడ్డుంటాయి. ట్రంప్ చేసిన ఈ దాడి చమురు కోసమే కాదు, ఇదో రాజకీయ సందేశం, ట్రంప్ పాలనలో అంతర్జాతీయ చట్టాలు, దేశ సార్వభౌమత్వం పట్టించుకోకుండా దేశాధ్యక్షుడినే నిర్బంధించడంతో మరో మారు ట్రంప్ నియంతృత్వాన్ని, అమెరికా సామ్రాజ్యవాద పోకడలను ప్రపంచ దేశాలు తిట్టిపోస్తున్నాయి. ప్రపంచంలో వెనుజువెలా వంటి దేశాల పరిపాలనల్లో సమస్యలు ఉన్నా, ఇలాంటి హింసాత్మక చర్యలు ప్రపంచ శాంతిని దెబ్బతీస్తాయి. భారత్ వంటి దేశాలు చమురు ఆధారిత దేశాల (వెనుజువెలా, ఇరాన్, ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, అరబ్ ఎమిరేట్స్) ఆర్థిక వ్యవస్థలను కాపాడుకునేలా, సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా గట్టిగా నిలబడాలి. ఒక దేశం లేదా ప్రాంతం తన ఆర్థికవృద్ధి, పరిశ్రమలు, గృహాలు, రవాణా వ్యవస్థలకు అవసరమైన శక్తిని (చమురు, విద్యుత్, గ్యాస్) స్థిరంగా, సరసమైన ధరలపై పొందే దేశాలపై ఈ ఘటన తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. ట్రంప్ వ్యూహాత్మకంగా అది చమురు కోసమే చేసాడు అనేదానికంటే ఇదో రాజకీయ సందేశం, ఎత్తుగడ అన్న వాదనే బలమైనది. భారత్ దిగుమతి చేసుకుంటున్న ఎక్కువ మొత్తం క్రూడ్ రష్యాదే, అయితే చైనా, రష్యా, భారత్ క్రూడ్ కొనుగోలు, అమ్మకాలు యువాన్, రూబుల్, రూపాయలలో వ్యాపారం చేస్తున్నాయి, సౌదీ అరేబియా కూడా బ్రిక్స్ దేశాలతో చర్చలు జరుపుతుండటంతో, పెట్రోడాలర్ వ్యవస్థపై ప్రభావం పడి డాలర్ బలహీనమయ్యే పరిస్థితి ఏర్పడింది. •

# ప్రజావాక్కు



### చైనా మాంజా వాడొద్దు

సంక్రాతి పండుగ సీజన్ వచ్చిందంటే పిల్లలకు పతంగుల పండుగే. ఇదో సరదా. వాటికి కట్టే దారం చైనా తయారు చేసిన మంజాను గాజు రజనుతో తయారు చేస్తారు. ఇది అత్యంతప్రమాదకరం. ఈమంజాను వాడద్దనే ప్రభుత్వం చేసే ప్రచారానికి ఎవరూ ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఇంకా పండుగ ప్రారంభం కానేలేదు. మంజా తగిలి కొంతమంది కుత్తులకు తగిలి ఆసుపత్రుల పాలయ్యారు. అలాగే పిట్ట గోడలు లేని డాబాలు, అపార్టమెంట్ల మీద పతంగులను ఎగురవేసే సమయంలో బహు జాగ్రత్తలు తీసుకోవాలని చేసేహెచ్చరికలను పాటించాలి. పండుగలు సరదాగా ఆనందంగా గడపాలి కాని నిర్లక్ష్యం వలన విషాదాలు కాకూడదు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి

తెల్లరేషన్‌కార్డు వారికి బియ్యం ఒక్క రూపాయికి, మహిళలకు బస్సుప్రయాణం ఉచితం, కొంతమందికి 200 యూనిట్లు వరకు విద్యుత్ ఉచితం. కానీ బస్ స్టాండ్‌లలో పబ్లిక్ టాయిలెట్స్‌లు ఉపయోగిస్తే అందుకూ రూ. 5 చెల్లించాలి. విజయవాడ నగరం బస్టాండుకి ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణికులు వస్తుంటారు. రాష్ట్రంలోకెల్లా పేరున్న బస్టాండుగా ఉంది. ఆబస్టాండులో పనిచేసే స్టాఫ్ అంతా ప్రయాణికుల చార్జీలతోనే జీతాలు పొందుతున్నారు. స్టాఫ్‌కి టాయిలెట్లు ఉచితం. ప్రయాణికులు మాత్రం ఐదు రుపాయాలు చెల్లించాలి. పక్కరాష్ట్రం తెలంగాణలో బస్టాండులో పెద్దపెద్ద అక్షరాలతో ఉచిత టాయిలెట్ అని వ్రాసిఉంటుంది. ఇక్కడ కూడా ఉచిత టాయిలెట్లు ఏర్పాటుచెయ్యాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ఒంగోలు

### సోషల్ మీడియా ప్రభావం

సోషల్ మీడియా మన దైనందిన జీవితంలో కీలక పాత్ర పోషిస్తోంది. సమాచారం త్వరగా చేరవేయడంలో ఇది ఎంతో సహాయపడుతుంది. అయితే దాని దుష్ప్రభావాలు కూడా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నకిలీ వార్తలు వేగంగావ్యాప్తి చెందుతున్నాయి. అధిక వినియోగం వల్ల యువతలో ఏకాగ్రత లోపం, మానసిక ఒత్తిడి, నిద్రలేమి వంటిసమస్యలు పెరుగుతున్నాయి. సరైన అవగాహనతో సోషల్ మీడియాను ఉపయోగించాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### కోట్ల కొద్దీ ఓట్ల గల్లంతు సబబేనా?

ఎన్నికల సంఘం రాష్ట్రాల వారీగా ఓటర్ల జాబితాల్ని సవరించే కార్యక్రమం స్పెషల్‌ఇంటెన్సివ్ రివిజన్ పేరిట మొదలుబెట్టింది. ఇప్పుడు నడుస్తున్న రెండవదశలో ఒక్కఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే రెండున్నర కోట్ల మంది పేర్లు ముసాయిదాజాబితా నుంచి మాయమయ్యాయి. ఇంకోనెలరోజుల పాటువాటిపై పునః పరిశీలన, అప్పీల్ జరిగి అసలు జాబితా తయారౌతుంది. ఇంతవరకూ రివిజన్ జరిగిన 12 రాష్ట్రాల్లో రద్దయిన ఓట్లు కోట్లలో ఉన్నాయి. అందులో సంఖ్య పరంగా చూస్తే ఉత్తరప్రదేశ్ మొదటి స్థానం, శాతాల పరంగా అయితే 18శాతంతో రెండోస్థానం. దొంగ ఓట్లను, అనర్హుల ఓట్లను జాబితా నుంచి తొలగించడం మంచిదే కానీ ఈ స్థాయిలో తొలగింపుల్లో తప్పులు దొర్లవంటే నమ్మడం కష్టం. ముఖ్యంగా ఈ రివిజన్ ప్రక్రియకు కేటాయిస్తున్న టైమ్ తక్కువ. హడావిడిగా జరుగుతోంది. తొలగించబడిన అర్హులైన ఓటరు తన అర్హతను తానే నిరూపించుకుని ఓటు హక్కు పొందాల్సి ఉంటుంది. ఆ అవగాహన లేకపోయినా, సమయానికి అందుబాటులో లేకపోయినా ఆవ్యక్తి ఓటు హక్కు కోల్పోతాడు.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### అదనపు రైళ్లు నడపాలి

సంక్రాంతి పండుగ సెలవు రోజుల్లో హైదరాబాద్లో ఉన్న తెలుగురాష్ట్రాల వారు స్వంత ఊళ్ళకు వెళ్ళడం ఆనవాయితీగా మారింది. ఆ రోజుల్లో హైద్రాబాద్‌రహదార్లన్ని ఖాళీగా కనిపిస్తాయి. కాని రైళ్ళు, బస్సులు కిటికిటలాడిపోతాయి. ఎందులోను సీట్లు దొరక్క ప్రయివేటు ఆపరేటర్లను ఆశ్రయిస్తారు. ఇదే అదనుగా రేట్లను మూడు నాలుగు రెట్లు పెంచి వసూలు చేస్తున్నారు. కొంతమంది సామాన్యులు సొంత గ్రామాలకు వెళ్ళడం ధరలు భరించలేక మానుకుంటున్నారు. ప్రభుత్వం తగినన్ని అదనపు బస్సులు, రైళ్ల నడపాలి. అలాగే ఛార్జీలు తగ్గించాలి.

-డా. ఎన్.ఎస్. ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### ఉల్లికి పెరిగిన గిరాకీ

మనదేశంలో పండే ఉల్లికి చాలా గిరాకీఉంది. తూర్పు ఆసియా ప్రాంతం, మధ్య ఆసియా ప్రాంతం, ఆఫ్రికా ప్రాంతాలలో మన ఉల్లికి చాలా గిరాకీ ఉంది. దానికి తోడు ఉల్లి పైన ఎగుమతి సుంకాలు తగ్గించడం కూడా ఎగుమతులు పెరగడానికి కారణమైంది. నాణ్యమైన ఉల్లి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక ప్రాంతాలలో పండుతాయి. ఆసియాన్ క్వాడ్ కూటమిలో భారత్ కీలకపాత్రపోషిస్తుండడంఎగుమతులుపెరగడానికి కారణమైంది.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# గుంటూరు వార్త

## పెద్దకాకాని పరిధిలో కార్డన్ సెర్చ్

**గుంటూరుక్రైమ్,జనవరి9,ప్రభాతవార్త:** మాదకద్రవ్యాలు నిర్మూలనే లక్ష్యంగా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను హెచ్చరిస్తున్న విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పెదకాకాని పరిధిలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు.నార్త్ డిఎస్పి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పెద్దకాకాని సిఐ సత్యనారాయణ స్వామి తమ సిబ్బందితో మద్దిరాల కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్ అధికారులకు సమగ్రంగా తనిఖీ చేసి ఎవరెవరు నేరచరిత్ర కలిగిన వారు,గంజాయి సంబంధిత అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకొని వారిని విచారించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు డిఎస్పీ తెలిపారు.పెద్ద కాకాని పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి నిర్మూలనకు పటిష్ట ఏర్పాటు చేశామని సీఐ సత్యనారాయణ స్వామి తెలిపారు.గంజాయి అమ్మే వారిపై వినియోగించే వారిపై కూడా కేసులు



సిబ్బందికి విస్తు పోయే విధంగా తనిఖీల్లో పత్రాలు లేని 86 ద్విచక్ర వాహనాలు వెలుగు చూశాయి. అంతేకాకుండా నాలుగు ఆటోలు లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా ఇన్ని రోజులు అందరు కళ్ళు కప్పి వీరు రహదారులు వెంబడి ప్రయాణిస్తున్నారంటే ఎంత చాకచక్యంగా వ్యవహరి స్తున్నారో అర్థమవుతుందని పోలీస్ అధికారులు చెబుతున్నారు. డిఎస్పి మురళీకృష్ణ మాట్లాడుతూ కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ లో భాగంగా కాలనీని పూర్తిగా తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులను వాహనాలను నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నార్త్ డిఎస్పి మురళీకృష్ణ,పెద్దకాకాని సిఐ సత్యనారాయణ స్వామి,మంగళగిరి టౌన్ సిఐ వీరాస్వామి,రూరల్ సీఐ బ్రహ్మం,ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కోడి పందేలు చట్ట రీత్యా నేరం

### కలెక్టర్ : తమీమ్ అన్సారియా

**గుంటూరు వెస్ట్, జనవరి 9, ప్రభాతవార్త :** కోడి పందేలు చట్ట రీత్యా నేరమని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. కోడి పందేలు, ఎడ్ల పందేలు నిర్వహించే వారిపై జంతు హింస నిరోధక చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని వెల్లడించారు. జంతు హింస నిరోధక చట్టం ప్రకారం కోడి పందేలు, ఎడ్ల పందేలు నివారణ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ చట్టం ప్రకారం నిషేధం ఉందన్నారు. కోడి పందేలు జరిగే అవకాశాలు ఉన్న ప్రదేశాలను గమనించాలన్నారు. శనివారం అన్ని గ్రామాల్లో దండోరా వేయించాలని ఆదేశించారు. గత ఏడాది నమోదు అయిన కేసులు, చేపట్టిన చర్యలు అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయి కమిటీలను వెంటనే రెవెన్యూ, పోలీస్, పశు సంవర్ధక శాఖ, పంచాయతీరాజ్ శాఖ లతో ఏర్పాటు చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో పోస్టర్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని చెప్పారు. పందేలు నిర్వహించే వారిపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలన్నారు. చట్ట ప్రకారం చర్యలు చేపట్టి, బైండ్ ఓవర్ చేయాలని పేర్కొన్నారు. 28 పోలీస్ స్టేషన్ల పరిధిలో బృందాలు ఏర్పాటు చేశామని పోలీసు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్ లను విడుదల చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణల వలయంలో రేపల్లె

# పట్టణ రహదారులు

**-ఫుట్‌పాత్‌లపై వ్యాపారుల పాగా**

**-ప్రభుత్వ జాగాలో ప్రైవేటు వాహనాలు**

**-ప్రాణాలకు తెగించి రోడ్డుపైనే నడక**

**రేపల్లె-ప్రభాతవార్త**

పురపాలక సంఘంలోని రహదారులు ఇరుకుగా మారుతున్నాయి.ఇష్టారాజ్యంగా ప్రైవేటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మార్జిన్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. పాదచారులు వినియోగించు కునే మార్జిన్లపై వాహనాలను నిలుపుతున్న కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలను తప్పించుకోవడం ప్రజలకు ఇబ్బందిగా



ప్రమాదకరంగా మారింది.కొన్ని చోట్ల రహదారులు సజావుగా ఉన్నాయనుకుంటే ప్రైవేటు వాహనాల సమస్య ప్రజలను సతాయిసో_ంది.పట్టణంలో ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన కొన్ని బస్సులు,సరుకుల దిగుమతులు,ఎగుమతులకు సంబంధించిన వాహనాలు రహదారులపైనే నిలిచిపోతున్నాయి.రహదారి భద్రతా నిబంధనలను ఆక్రమణదారులు దృష్టిలో ఉంచుకుని వ్యవహరిస్తే ఎటువంటి సమస్యలు తలెత్తవనేది వాస్తవం.రేపల్లె పట్టణంలోని రహదారులు సమస్యాత్మకంగా మారుతున్నాయి. అక్రమ నిర్మాణాలు,దుకాణాలు రహదారుల హద్దుల్లోకి రావడంతో వాహనాలు వెళ్ళే స్థలం తగ్గిపోతోంది .ప్రాణాలకు తెగించి రహదారిపైనే పాదచారులు నడవాల్సి వస్తోంది.

రహదారుల విస్తీర్ణం తగ్గిపోవడం,అక్రమ పార్కింగ్ వలన ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడుతోంది.నీటి నిల్వ సమస్యలతో పాటు పర్యావరణ నష్టం వంటి పరిస్థితులకు రహదారి ఆక్రమణదారులే కారణమవుతున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.ప్రధాన, అంతర్గత రహదారులలో రహదారి భద్రత నిబంధనలు ఏమేరకు అమలవుతున్నాయో అధికారులకు తెలియందికాదు. రహదారి ప్రమాదాల కారణంగా బాధితకుటుంబాలకు ఆర్థికభారం ఏర్పడుతుంటే మౌలిక సదుపాయాల మరమ్మత్తుల ఖర్చుల భారం ప్రభుత్వంపైనే పడుతోంది.రేపల్లె పట్టణంలోని ప్రధాన రహదారులలో ఫుట్‌పాత్ ప్రదేశాలను వ్యాపారులు ఆక్రమించడంతో నడవడానికి స్థలం లేక వృద్ధులు,విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు.రేపల్లె పురపాలక సంఘ కార్యాలయం నుంచి నెహ్రూ విగ్రహం సెంటరు వరకు వచ్చే రహదారి ఇరుకుగానే ఉంటోంది. ఎక్కడ పడితే అక్కడ రహదారి వాహనాలు నిలిచిపోవడం,మార్జిన్లలో

వ్యాపారాలు, ట్రాఫిక్ సమస్య ప్రధాన కారణం.కొందరు టింబర్ డిపోల వ్యాపారులు రహదారి మార్జిన్లను వాడేసుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాలంటే ఆక్రమణదారులు తమ సొంత స్థలంగా భావించుకునే పరిస్థితులు రేపల్లె పట్టణంలో కనిపిస్తున్నాయి.ఇటీవల రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం ఆధునీకరణకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత ప్రసాద్ చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం రూ.25 లక్షల నిధులు ఖర్చు చేశారు.విద్యార్థులు సంతోషించారు. కృతజ్ఞతాభావంతో కొందరు విద్యార్థులు మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. అయితే ఈ కళాశాల నుండి రేపల్లె-నిజాంపట్నం ఆర్అండ్‌బి రహదారిలోకి చేరేందుకు అవసరమైన రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో విద్యార్థులు పెదవివిరుస్తున్నారు.

ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల,పాలిటెక్నిక్ కళాశాల,ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.సవ్యంగాలేని ఈ రహదారికి ఇరువైపులా ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సుల పార్కింగ్ స్థలంగా మారిపోవడం విమర్శలకు కారణమవు తోంది.క్రీడా మైదానంలో రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ జాగాలో మద్యం బాటిల్స్ దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ విద్యా సంస్థలు కొనసాగుతున్న ప్రదేశంలో పోలీసులు నిఘా ఉంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## ముగిసిన టై అండ్ డై శిక్షణా తరగతులు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి7, ప్రభాతవార్త:** ఏఎన్‌యులోని ఒకేసనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో వారం రోజులుగా సిఎస్ఆర్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత టై అండ్ డై శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావు పాల్గొని శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవడం అభినందనీయం అన్నారు. మహిళలు స్వయం ఉపాధితో



ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ బి.బబిత, సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. యం.వెంకటరమణ, బిఎఫ్ఏ కోర్సు కోఆర్డినేటర్ పి.దేవకాంత్, అధ్యాపకులు వీరయ్య, శిక్షకురాలు రమ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం : ఎమ్మెల్యే మాధవి

**గుంటూరు వెస్ట్, జనవరి 9,ప్రభాతవార్త:** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం "ప్రజా గ్రీవెన్స్" నిర్వహించి, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి, ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించవలసినదిగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం



ప్రతి నియోజకవర్గంలో ప్రజా గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.ఈ ప్రజా గ్రీవెన్స్‌కు అనేకమంది తమ సమస్యలతో వచ్చారని, ప్రతి ఒక్కరి సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కార దిశగా పనిచేస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. గ్రీవెన్స్ లో వచ్చిన అర్జీలలో ప్రధానంగా గత ప్రభుత్వం ఇళ్ల పట్టాల విషయంలో మోసం చేయడం వల్ల ఏర్పడిన సమస్యలే ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.ఇళ్ల పట్టాలు ఇచ్చినా భూమి ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి, టిడ్కో ఇల్లు రాకపోవడం, అద్దె ఇళ్లలో ఉండి అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బాధితులు తమ గోడును వినిపించారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వైసిపి నేతలు హడావిడిగా పట్టాలు ఇచ్చి, వాస్తవంగా ఇళ్లను చూపించకపోవడం వల్ల ప్రజలు నష్టపోయారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు.ఈ అంశంపై ఇప్పటికే ప్రభుత్వం గానీ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కసరత్తు చేస్తున్నారని, రానున్న రోజుల్లో బాధితులందరికీ తగిన పరిష్కారం అందించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.టిడ్కో ఇళ్ల విషయంలో అర్హులైనప్పటికీ సిబిల్ స్కోర్ లేదన్న కారణంతో తొలగించబడిన వారిని, అలాగే అనర్హులుగా తొలగించిన వారిని మళ్లీ జాబితా తయారు చేసి అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.గృహ నిర్మాణ సంస్థ అధికారులతో చర్చించగా, వన్ టైం సెటిల్మెంట్ లేదా వన్ టైం పేమెంట్ విధానంలో సమస్యలు పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.ప్రతి పేదవాడికి ఇల్లు ఉండాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తున్నారని, అందువల్ల ఇళ్ల సమస్య అత్యంత త్వరితగతిన పరిష్కారం అవుతుందన్న ఆశాభావాన్ని ఎమ్మెల్యే వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేగంగా అభివృద్ధి జరుగుతుందని, సంక్షేమాన్ని కూడా సమానంగా అమలు చేస్తోందని అన్నారు.ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేస్తూ, మళ్లీ మళ్లీ కూటమి ప్రభుత్వమే రావాలి, చంద్రబాబు నాయుడు గారే ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం ప్రజల్లో పెరుగుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.ప్రజా గ్రీవెన్స్ ద్వారా వచ్చే ప్రతి సమస్యపై నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ శాశ్వత పరిష్కారం దిశగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనే కూటమి లక్ష్యం

### గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు వెస్ట్, జనవరి 9,ప్రభాతవార్త:** మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే,, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. నగరంలోని ఆరవ డివిజన్ సోమువారి వీధిలో రూ.66 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి నగర



మేయర్ కోవెలమూడి నానితో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. తొలుత ఆయా ప్రాంతాలకు వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలకు ఘన స్వాగతం పలికారు. ఎన్నో ఏళ్ల నుంచి కనీసం రోడ్లకు కూడా నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఏర్పాటు చేసిన సరస్ మేళా అన్ని వర్గాలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన ఈ మేళా మహిళల ప్రగతికి బాటలు వేసే విధంగా ఉందని అన్నారు. మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న కళాకృతులు, వంటకాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.. మహిళలు వ్యాపార రంగంలో ముందడుగు వేయడానికి ఇలాంటి మేళాలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కేవలం మహిళలకు సంబంధించిన మేళా మాత్రమే కాదని, కుటుంబ సమేతంగా సందర్శించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని గత ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చేయకుండా 20 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లారని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి శకం ఆరంభమైందని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు 24 గంటలపాటు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏపీఐఐసి చైర్మన్ డేగల ప్రభాకర్, కార్పొరేటర్ పోతురాజు సమత, టిడిపి వార్డు ప్రెసిడెంట్ మండల శ్రీనివాస్, శనక్కాయమ రాజకుమారి, పోతురాజు చంద్రశేఖర్, ఫిరోజ్, సుబ్రహ్మణ్యం, బాజీ మాస్టర్, స్వర్ణ మస్తాన్ రెడ్డి, కొనకళ్ళ సత్యం, గౌతం తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం అక్రమ రవాణా కేసులో జైలుశిక్ష

**గుంటూరు క్రైమ్,జనవరి9,ప్రభాతవార్త:** పిడియస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఓ వ్యక్తికి న్యాయస్థానం మూడు నెలల జైలు,5000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితేతెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డిసెంబర్15వ తేదీ 2022 న కొలకలూరు నుండి నంది వెలుగు రోడ్డు వస్తున్న ఆటోను ఆపి పోలీసులు తనిఖీలు చేపట్టారు.ఫిరంగిపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఉయ్యాల తిరుపతయ్య తోపాటు కొలకలూరు గ్రామానికి చెందిన జాన్ పాల్, ఫిరంగిపురం గ్రామానికి చెందిన ఉయ్యాల రాజశేఖర్ వీరిని పోలీసులు ప్రశ్నించగా తడబడుతూ సమాధానం ఇచ్చారు.వాహనాన్ని తనిఖీ చేయగా ఒక్కో బస్తా 50 కేజీల చప్పున 60 బస్తల పిడియస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెనాలి పోలీసులు గుర్తించారు. అప్పటి ఎస్.ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.ప్రాసిక్యూషన్ తరుపున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరిశపోగు సునీల్ కుమార్ వాదనలు వినిపించారు. హెడ్ కానిస్టేబుల్ వాసా శ్రీనివాసరావు ఈ కేసులో సకారాలు అందించారు. తెనాలి ప్రధాన సివిల్ జడ్జి( జూనియర్ డివిజన్) పవన్ కుమార్ తిరపతయ్య పై నేరం రుజువు కావడంతో 5000 జరిమానా,మూడు నెలల జైలు శిక్ష విధించారు.పిడియస్ బియ్యం అక్రమ రవాణా పై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

## యువత క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యం

### గుంటూరు జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా

**మంగళగిరి, జనవరి 9, ప్రభాతవార్త :** మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్4 మ్యాచ్‌లు గత 20 రోజులుగా హోరాహోరీగా కొనసాగు తున్నాయి. 20వ రోజు శుక్రవారం క్రికెట్ పోటీలను తిలకించేందుకు గుంటూరు జడ్పీ చైర్మన్ హెనీ క్రిస్టీనా ప్రత్యేకంగా విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, స్టేడియం నిర్వాహకులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. క్రీడా ప్రాంగణంలో మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో రూపొందించిన గ్యాలరీని తిలకించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని కొద్దిసేపు క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూమంత్రి నారా లోకేష్ క్రీడాకారులను నిరంతరం ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఎంతో ఖర్చుతో కూడిన పోటీలను నెల పాటు నిర్వహించడం గొప్పవిషయమని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ క్రీడా కారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహద పడతాయన్నారు. పోటీలను చూస్తుంటే సంక్రాంతి ముందే వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో




కళ్ళం రాజశేఖర్ రెడ్డి, బెజ్జం రామకృష్ణ రావు, చెల్లూరి సత్య నారాయణ, గోలి సాయి కిరణ్, నరసింహారావు, మర్రిశ్రీను, కౌతరపు శ్రీనివాస రావు, పిన్నిబోయిన నరేంద్ర, బుడ్డా రవి, అడిగొప్పుల శ్రీను, మేకా గోపి పాల్గొన్నారు.

## పెదవడ్లపూడిలో రూ. 35 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**మంగళగిరి, జనవరి 9, ప్రభాతవార్త :** నగర పాలక సంస్థ నిధులతో శుక్రవారం పెద్దవడ్లపూడి గ్రామ పరిధిలో రూ. 35 లక్షల విలువైన డొంక రోడ్డుల అభివృద్ధి పనులకు మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ హాజరై శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం పెద్దవడ్లపూడి గ్రామంలోని ఏటీపీఎం హై స్కూల్ వద్ద గల భరియల్ గ్రౌండ్ డొంక రోడ్ నుండి కొండూరు లాకుల వరకు రూ. 17 లక్షల నగర పాలక సంస్థ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించగా, అదేవిధంగా గోపాలస్వామి మన్యం డొంక రోడ్ వద్ద రూ. 18 లక్షల వ్యయంతో ఇంటర్నల్ రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూమంత్రి నారా లోకేష్ నాయ కత్వంలో మంగళగిరి నియోజక వర్గంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నా యని, రోడ్లు, మౌలిక సదుపాయా ల అభివృద్ధితో



గ్రామస్తుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. చేపట్టిన పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయడం లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ రోడ్డు అభివృద్ధి పనులు పూర్తయితే రైతులు తమ పంటలను మార్కెట్ యార్డులకు సులభంగా తరలించుకోవచ్చని, రవాణా వ్యయాలు తగ్గి వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన గిట్టుబాటు ధరలు లభిస్తాయని జవ్వాది తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే రవాణా సమస్యలు తొలగిపోతాయని వారు ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నగరపాలక సంస్థ డి ఈ రమేష్, ఏ ఈ ప్రసన్న, గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పురపాలకసంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

**తెనాలి మున్సిపాలిటీ జనవరి9 (ప్రభాతవార్త):** పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జగ్గడిగుంటపాలెం టిడ్కో గృహాల వద్ద,ముందస్తు సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు.ఈ వేడుకలను మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక ప్రారంభించారు. మహిళలకు ముగ్గుల పోటీలు మ్యూజికల్ చైర్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక మాట్లాడు తూ, సంక్రాంతి పండుగ అంటేనే ముగ్గుల పండుగ అని,సంక్రాంతి చిన్న పెద్ద అందరూ సంతోషాలతో గడిపే పండుగ అని,పండుగకు బంధుమిత్రు లందరూ వచ్చి పిండివంటలతో, చిన్నపిల్లల ఆటపాటలతో,మహిళల ముగ్గులు పోటీలతో,సంక్రాంతి పండుగ సందడి తెచ్చే పండుగని, ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరికీ ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అత్తోట



నాగవేణి, కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ లావణ్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి, మెప్మా అధికారిణి విజయ కుమారి మరియు సిబ్బంది పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## మాకు భద్రత కల్పించండి

**- 120మంది విద్యార్థులు వేడుకోలు**

**- గౌతమి హాస్టల్లో విద్యార్థుల భద్రతకు ముప్పు-**

**నిర్మాణం పూర్తయిన కొత్త హాస్టల్ కేటాయించాలని డిమాండ్**

**- రిజిస్ట్రార్‌కు వినతిపత్రం**

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి9, ప్రభాతవార్త:** ఏఎన్‌యులోని గౌతమి బాలుర వసతిగృహాల ఉంటున్న తమ భద్రతకు ముప్పువాటిల్లే అవకాశం ఉందని సుమారు 120మంది హాస్టల్ విద్యార్థులు మూకుమ్మడిగా ఈనెల 5న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను తమ ఆవేదనను వ్యక్త పరుస్తూ వినతిపత్రంలో సంతకాలతో సమర్పించారు. ప్రస్తుతం ఉన్న హాస్టల్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, గోడలు పగిలిపోవడం, పైకప్పుల నుంచి నీరు కారడం, ఫ్లోరింగ్ దెబ్బతినడం వంటి ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని వాపోయారు. ఈ పరిస్థితులు విద్యార్థుల ప్రాణ భద్రతకు ముప్పుగా మారాయణి, అలాగే వారి ఆరోగ్యం, చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని విన్నవించారు. ఇప్పటికే అనేక చోట్ల పగుళ్ళు ఏర్పడటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశంఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన నూతన హాస్టల్‌లో వినియోగానికి ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దూరప్రాంతాల నుంచి చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులకు హాస్టల్ సదుపాయం అత్యవసరమని, మరింత ఆలస్యం జరుగకుండ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌ను కోరారు.

## 'ప్రత్తిపాటి' సమక్షంలో టీడీపీలో చేరిన వైకాపా నాయకురాలు

చిలకలూరిపేట, జనవరి 9, ప్రభాతవార్త: పట్టణానికి చెందిన వైసీపీ మహిళా నాయకురాలు, స్థానిక రామాలయం కమిటీ మాజీ మెంబర్ ఆలపాటి పద్మావతి కుటుంబంతో సహా శుక్రవారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీ గూటికి చేరిన అనంతరం ఆమె మాట్లాడారు. వైసీపీని నమ్ముకున్నవారికి నయవంచనే మిగులుతుందని, అందుకు తానే ఉదాహరణని, ప్రజలతో పాటు తమ కుటుంబానికి, తనను నమ్మిన కార్యకర్తలకు ఆ పార్టీ తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రం కోసం, ప్రజాసంక్షేమం కోసం చంద్రబాబు రేయింబవళ్లు కష్టపడుతుంటే జగన్ మాత్రం దుష్ప్రచారాన్నే నమ్ముకున్నాడని పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



## అబద్ధాలు... మోసాలు.. అవినీతే జగన్ నైజం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 9, ప్రభాతవార్త: అబద్ధాలు... మోసాలు.. అవినీతే జగన్ బతికిస్తున్న గాలి, నీరు, ఆహారమని, నిత్యం ప్రజల భావోద్వేగాలు, మనశ్శాంతితో ఆటలాడందే ఆయనకు పూటగడవదని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (ప్రజా దర్బార్) నిర్వహించి, వినతులు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజలు అందించే ప్రతి సమస్య పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నామని, ప్రతి శాఖతో నిత్యం సమన్వయం చేసుకుంటూ అర్జీల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, తమపరిధిలోని సమస్యల్ని రోజుల వ్యవధిలోనే చక్కదిద్దుతున్నామని ప్రత్తిపాటి పేర్కొన్నారు. రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవాలన్న దురాలోచనతోనే జగన్.. రైతుల్ని రెచ్చగొడుతున్నాడు జగన్ ఐదేళ్ల పాలనలో నరకాన్ని చవిచూసిన ప్రజలు మరలా ఎప్పటికీ ఆయన కుట్రరాజకీయాల్ని నమ్మరని, అవినీతి, దోపిడీకి అలవాటుపడిన జగన్ కు కూటమిప్రభుత్వ సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి ఎప్పటికీ మింగుడుపడదని ప్రత్తిపాటి తెలిపారు. విలేకరుల సమావేశం పేరుతో నిరాధార ఆరోపణలతో ప్రజా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే జగన్ ఎజెండాగా పెట్టుకున్నారని, సొంత మీడియాను అడ్డు పెట్టుకొని చేస్తున్న విషప్రచారానికి ఆయన ప్రజలకు సమాధానం చెప్పుకునే రోజు వస్తుందన్నారు. రాజధాని అమరావతి నిర్మాణాన్ని అడ్డుకోవాలన్న దురాలోచనతోనే జగన్ ల్యాండ్ పూలింగ్ కు అనుకూలంగా ఉన్న రైతుల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాడని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. నదీ గర్భానికి, నదీ ఎగువభాగానికి తేడా తెలియకుండా జగన్ విలేకరుల సమావేశంలో ఏదేదో మాట్లాడి, రాయలసీమకు అన్యాయం జరుగుతోందని చెబుతుంటే ప్రజలు తలలు పట్టుకుంటున్నారని ప్రత్తిపాటి ఎద్దేవాచేశారు. ఆయన ప్రవర్తన, భాషలో రాష్ట్రం అభివృద్ధి చెందకూడదన్న లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పోలవరం, అమరావతి నిర్మాణాలపై జగన్ చేస్తున్న విషప్రచారాన్ని ప్రజలు ఎప్పటికీ నమ్మరన్నారు. రాజధానికి చట్టబద్ధత కల్పించేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకూడదన్నదే జగన్ ప్రయత్నమని ప్రత్తిపాటి చెప్పారు. 2027 నాటికి అమరావతి, పోలవరం తొలిదశ పనులు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, మురకొండ మురకొండ మల్లిబాబు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## చైతన్య ఎలీట్ జాతీయస్థాయి రోబోటిక్స్ టెక్నాలజీ ఫెస్ట్ 'వింటర్ రోబోటిక్ లీగ్ 2026' ప్రారంభం

చిలకలూరిపేట, జనవరి 9, ప్రభాతవార్త: స్థానిక చిలకలూరిపేట లోని చైతన్య ఎలీట్ పాఠశాలలో జనవరి 9 10 తేదీలలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి, రోబోటిక్స్ టెక్నాలజీ ఫెస్ట్ "వింటర్ రోబోటిక్ లీగ్ 2026" ను స్థానిక చిలకలూరిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రివర్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఘనంగా ప్రారంభించారు. ఈ వింటర్ రోబోటిక్ లీగ్ లో భాగంగా విద్యార్థులు రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ప్రింటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలలో 100 కు పైగా ప్రాజెక్టులను ప్రదర్శించారు. చైతన్య ఎలీట్ పాఠశాల డైరెక్టర్ ఈదర వెంకట గిరీష్ బాబును ప్రత్యేకంగా ప్రశంసించారు. స్కై స్పేస్ సీఈవో ఇందుగు వేణు కుమార్ కు అభినందనలు తెలియజేశారు. చైతన్య ఎలీట్ పాఠశాల డైరెక్టర్ ఈదర వెంకట గిరీష్ బాబు, ప్రిన్సిపల్ డి.వి. లక్ష్మి, రామకృష్ణ, ఎఫ్ట్రానిక్స్ అధినేత దాసరి రామకృష్ణ ., చిలుమూరు శ్రీరామా రూరల్ విద్యా సంస్థల అధినేత తులసి విష్ణు ప్రసాద్, చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ కరిముల్లా , మున్సిపల్ చైర్మన్ రఫాని , మిమిక్రీ రమేష్, చిలకలూరిపేట ఎంఈఓ బి.సత్యనారాయణ సింగ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి వారిలో స్ఫూర్తిని నింపారు.



## సెల్ ఫోన్లకు దూరంగా ఉంటేనే, విద్యార్థుల్లో ఆలోచనాశక్తి, జ్ఞానం పెరుగుతాయి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 9, ప్రభాతవార్త: సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ, మానవసంబంధాలు పెంపొందించుకున్నప్పుడే విద్యార్థులు చదువుతో పాటు, సమాజంలోనూ రాణించగలరని.. అప్పుడే వారిలో ఆలోచనాశక్తి, జ్ఞానం వృద్ధి చెందుతాయని, సాంకేతికతను అవసరానికి మించి వినియోగించడం అనర్థదాయకమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. శుక్రవారం స్థానిక ఆక్స్ ఫర్డ్ ఐబీటీ పాఠశాలలో నిర్వహించిన రోబోటిక్స్ ఏఐ సాంకేతిక పరిజ్ఞాన అవగాహనా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. సైన్స్ ఎగ్జిబిషన్ లో ఉత్తమ ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల్ని ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రత్యేక పాఠశాలల్ని నైపుణ్య కేంద్రాలుగా మారుస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. మైనారిటీ విద్యార్థులకు ప్రత్యేకంగా ఉర్దూ అకాడమీ నుంచి కంప్యూటర్ పరిజ్ఞానం అందించటంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎల్లపుడు అవకాశాలు కల్పిస్తుంటారని అన్నారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫరూక్ షుబ్లీ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, జమాల్ భాషా, ఆక్స్ ఫర్డ్ ఐబీటీ స్కూల్ డైరెక్టర్లు హనీఫ్, డాక్టర్ నుమ్మ, పట్టణ సీఐ రమేష్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## మోడరన్ స్టెల్లార్‌లో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

చిలకలూరిపేట, జనవరి 9, ప్రభాతవార్త: మోడరన్ స్టెల్లార్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలలో భోగిమంటలు, భోగి పళ్ళు, బొమ్మలకొలువు ఏర్పాటు చేయటం జరిగింది. విద్యార్థులు తయారుచేసిన రంగవల్లులు,పూరిగుడిసె, హరిదాసులు, గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, కోడిపుంజులు మరియు భోగి కుండలు, ముగ్గుల పోటీలు అందరిని ఆకట్టుకున్నాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను గురించి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తెలియజేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి, సంక్రాంతి రోజున సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడం, కనుమ రోజున రైతులు తమ పశువులను అలంకరించి పూజించడం వంటి ప్రతి ఒక్క విశిష్టతను గురించి ప్రధానోపాధ్యాయులు గారు చక్కగా వివరించారు. పాఠశాల చైర్మన్ డా. చేబ్రోలు మహేష్, శ్రీమతి సుజాత, ప్రత్యూష , ప్రధానోపాధ్యాయులువిజయలక్ష్మి, ప్రసూన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పాఠశాలకు మధ్యాహ్న భోజనం ప్లేట్లు, గ్లాసులు అందజేత

చిలకలూరిపేట, జనవరి 9, ప్రభాతవార్త: శ్రీ మద్ది కమయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ పసుమర్రు లో ఈరోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో ఉపయోగపడే 100 స్టీల్ ప్లేట్లు మరియు 100 గ్లాసులను చిలకలూరిపేట పట్టణానికి చెందిన శంకర్ మెడికల్స్ యజమాని ఊటుకూరి శంకర్రావు , ఆయన సతీమణి సతీమణి (ప్రమీల దేవి) జ్ఞాపకార్థం పాఠశాలకు ఉచితంగా అందించారు. ఈ భోజన సామాగ్రిని శంకర్రావు అబ్బాయి తేరుకున్నా నాగ గుర్రప్ప మరియు కోడలు చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై హనుమంతరావు గారికి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, పాఠశాల ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ కోట సుదర్శన్ , పూర్వ విద్యార్థి సంఘ సభ్యులు గద్దె హరిబాబు మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.



## టిడ్కో గృహాల వద్ద నేటి నుంచి సంక్రాంతి ఆటల పోటీలు

చిలకలూరిపేట, జనవరి 9, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చిలకలూరిపేట నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు మరియు మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ గృహాలకు 52 ఎకరాల్లో టిడ్కో గృహాల దగ్గర సంక్రాంతి సంబరాలు ఈనెల 10, 11,12 తేదీల్లో ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు ఇవ్వటం జరుగుతుంది. 10 తారీకు పలు రకాల గేమ్లు ,11వ తారీకు పలు రకాల ఆటలు నిర్వహించి గెలుపొందిన వారికి 12 సోమవారము సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్యే బహుమతులు ఇవ్వటం జరుగుతుందన్నారు..



# పల్నాడు జిల్లా వార్త



## స్వదేశీ ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

నరసరావుపేట, జనవరి 9 ప్రభాతవార్త: : అరకు కాఫీ వంటి స్వదేశీ ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అన్నారు. నరసరావుపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్ శుక్రవారం జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడానికి ఇది మంచి అవకాశమని సూచించారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, అరకు కాఫీ బ్రాండ్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు నేరుగా వినియోగదారులకు తమ ఉత్పత్తులు అందించే విధానాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, తద్వారా మధ్యవర్తుల సమస్య తగ్గి రైతులకు న్యాయమైన ధర లభిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ, అరకు కాఫీ దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుందని అన్నారు. గిరిజన రైతుల కష్టఫలితంగా రూపొందే అరకు కాఫీ నాణ్యతలో అగ్రస్థానంలో నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి మధులత, డిఆర్డిఏ పీడీ ఝాన్సీరాణి, జనసేన నియోజకవర్గం ఇన్చార్జి సయ్యద్ జిలాని, టిడిపి నాయకులు గట్టుపల్లి సత్యనారాయణ, మన్నాను షరీఫ్, కూరపాటి శ్రీనివాసరావు పులిమిరామిరెడ్డి, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ రంగిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, జనవరి 9 ప్రభాతవార్త ::వ్యవసాయ రంగం సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు స్పష్టం చేశారు. నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరై రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతుకు భూమిపై హక్కును చట్టబద్ధంగా నిర్ధారించే ప్రధాన పత్రం పట్టాదారు పాస్ పుస్తకమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ రాజముద్రతో జారీ చేసిన పాస్ పుస్తకాలకు బ్యాంకులు, ఆర్థిక సంస్థల వద్ద పూర్తి స్థాయిలో చెల్లుబాటు ఉంటుందని, రైతులు వాటిని ఆధారంగా చేసుకొని రుణాలు పొందవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని పాలన సాగిస్తున్నారని తెలిపారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ఆధునిక వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, పంటల బీమా, సబ్సిడీలు వంటి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. వ్యవసాయం లాభసాటిగా మారాలంటే భూమి హక్కుల స్పష్టత ఎంతో కీలకమని, అందుకే రెవెన్యూ వ్యవస్థను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. రైతు భద్రతే కేంద్రంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు తాము ఎప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సయ్యద్ జిలాని, బిజెపి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి రంగశెట్టి రామకృష్ణ, టిడిపి నాయకులు మన్నాన్ షరీఫ్,గట్టుపల్లి సత్యనారాయణ, పులిమి రామిరెడ్డి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట టౌన్, జనవరి 9 ప్రభాతవార్త : స్థానిక కేరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల రంగోలి చిత్రాలు, పంటల ప్రతీకలు, పతంగులతో సుందరంగా అలంకరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను చాటుతూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు , డైరెక్టర్ కోమటనేని నాసరయ్య, ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్చార్జ్ కోట బాపూజీతో పాటు ఉపాధ్యాయులు చిన్నారుపై సంప్రదాయ పద్ధతిలో భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు పరిచయం చేస్తాయని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో ఆనందం, ఐక్యత, కుటుంబ విలువలు పెంపొందుతాయని నాతాని తెలిపారు. ఈ సంబరాల్లో స్కూల్ బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





**ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (ఐడీపీఎస్) లో**

**నరసరావుపేట, జనవరి 9 ప్రభాతవార్త :** స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (ఐడీపీఎస్) లో శుక్రవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ రావు తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ తెలుగు పండుగలలో అతి పెద్ద పండగయినా సంక్రాంతి పండుగను ప్రతి ఇంటా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరారు. విద్యార్థిని విద్యార్థులకు విద్యతోపాటు మన సంప్రదాయ పండుగల ప్రాముఖ్యత, విశిష్టత మరియు ఆచారాలను తెలియజేయడం సంతోషంగా ఉందన్నారు. తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులుచే ప్రదర్శించిన భోగి మంటలు, పల్లెలోగిళ్లు, పొంగళ్ళు, హరిదాసులు, గంగిరెద్దులు, కోడి పందాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లులకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. స్కూల్ డైరెక్టర్ నాగోల్ సబిత, ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.



## గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సమీక్ష

రొంపిచర్ల, జనవరి 9 ప్రభాతవార్త,::జనవరి 26వ తేదీన నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్ లో ఈనెల 26వ తేదీన నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల మాట్లాడుతూ, గణతంత్ర దినోత్స వ వేడుకల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు సకాలంలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వేడుకలను మినిట్ టూ మినిట్ నిర్వహించేలా చూడాలని, ఎలాంటి లోటుపాట్లు ఎదురు కాకుండా చూసుకోవాలన్నారు. వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అవార్డులు అందించే వారి కోసం సర్టిఫికెట్ ఫైనలైజ్ చేయాలన్నారు. వేడుకల్లో పాల్గొన్న వారికి తాగునీటి సరఫరా చేయాలని, స్నాక్స్ అందించాలని, శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పెరేడ్ కోసం ఎన్.సి.సి, స్కౌట్ విద్యార్థుల సహాయం తీసుకోవాలని అన్నారు. గణతంత్ర వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ కృష్ణారావు, డిఆర్ఓ మురళి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## డాక్టర్ జాన్ డేవిడ్ సేవలు ఆదర్శనీయం : జెస్సీ ఎస్ బర్నబాస్

చిలకలూరిపేట, జనవరి 9, ప్రభాతవార్త: కష్టాల్లో ఉన్న పేద వర్గాలను ఆదుకోవడం తో పాటు వారి పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలని లక్ష్యంతో విద్యా బుద్ధులు నేర్పించిన డాక్టర్ జాన్ డేవిడ్ ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఫార్ కార్నర్స్ డైరెక్టర్ డాక్టర్ జెస్సి యస్ బర్నబాస్ అన్నారు. పట్టణంలోని ఏఎంజి సమస్త ప్రాంగణంలో శుక్రవారం డాక్టర్ జాన్ డేవిడ్ వర్ధంతిని పురస్కరించుకొని వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. సభలో జెస్సి ఎస్ బర్నబాస్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేవుని పిలుపుమేరకే ఆయన ఏ ఎం జి, ఫార్ కార్నర్స్, వేద సంస్థలను స్థాపించడం ద్వారా ఉచిత విద్యతోపాటు వేలాదిమంది వ్యాధిగ్రస్తులకు వైద్యం అందించడంతోపాటు పాటు వారి కుటుంబాలకు బాసటగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా ఆయన సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం జాన్ డేవిడ్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ సత్యంబాబు , బోర్డు సభ్యులు మోజస్, ప్రసన్న, పీటర్ తదితరులు పాల్గొన్నారు



## సీఎం.ఆర్.ఎఫ్ సాయం.. ప్రజారోగ్యానికి వరం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 9, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం.ఆర్.ఎఫ్) సాయం.. తమ ఆరోగ్య రక్షణకు ప్రజలకు ప్రభుత్వం అందించిన గొప్ప వరమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ చేశారు. 52 మంది లబ్ధిదారులు..వారి కుటుంబసభ్యులకు రూ. 30 లక్షల విలువైన చెక్కుల్ని అందచేసిన అనంతరం ప్రత్తిపాటి మాట్లాడారు. కూటమిప్రభుత్వంలో ప్రజలెవరూ అనారోగ్య సమస్యలతో బాధపడకూడదనే సదుద్దేశంతోనే, ముఖ్య మంత్రి చంద్రబాబు సీఎం.ఆర్.ఎఫ్ సాయం అందచేస్తున్నారన్నారు. అర్హులైన వారికి సకాలంలో ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, బండారుపల్లి సత్యనారాయణ , జవ్వాజి మధన్ మోహన్, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, టీడీపీ నాయకులు ముద్దన నాగేశ్వరరావు, పోపూరి వెంకయ్య, పోపూరి రాఘవయ్య, వెంకట రత్తయ్య, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## తోటకూర ప్రభాకర్‌రావుకు ఘన నివాళి

చిలకలూరిపేట, జనవరి 9, ప్రభాతవార్త: స్థానిక నరసరావుపేట సెంటర్ లోని, రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట బిల్డింగ్ నందు డిఆర్ఎన్ ఎస్ సివియస్ కాలేజ్ రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ తోటకూర ప్రభాకర్ రావు ప్రధమ వర్ధంతి కార్యక్రమానికి హాజరై, వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నివాళులర్పించారు .అనంతరం ప్రభాకర్ రావు కుటుంబసభ్యులు, వారి జ్ఞాపకార్థం రోటరీ ఉచిత ఆరోగ్య కేంద్రానికి లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా రోటరీ క్లబ్ సభ్యులకు అందచేశారు



## మిట్టపల్లి కాలేజీలో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

యడ్లపాడు, జనవరి 9, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని మిట్టపల్లి కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలను కళాశాల సెక్రటరీ ఎంబివి సత్యనారాయణ బోగి మంటలను వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. కళాశాల విద్యార్ధిని, విద్యార్దులకు రంగవల్లి పోటీలు, క్రీడలు పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను గుర్తుచేసే గాలిపటాలను ఎగురవేసి కళాశాల ప్రాంగణంను పండుగ వాతావరణంతో నింపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపి కృష్ణ పాల్గొని పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం కిషోర్ కుమార్, ఎవో సిహెచ్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పివో జి రాజాకుమార్, పిడి పి వెంకటేష్, కళాశాల అధ్యాపక బృంధం తదితరులు పాల్గొన్నారు.





## క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 117మంది ఎంపిక

యడ్లపాడు, జనవరి 9, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని మిట్టపల్లి కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఎంపికలలో 117మంది విద్యార్ధిని, విద్యార్దులు ఎంపికైనారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపి కృష్ణ తెలిపారు. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం వారి సంయుక్త అధ్వర్యంలో బిటెక్ 4వ సంవత్సరం చదువుతున్న సిఎస్ఇ, ఎఐ, డిఎస్, ఐటి అండ్ ఇసిఇ విద్యార్దిని, విద్యార్దులకు రెనాల్ట్ గ్రూప్ కంపెనీ క్యాంపస్ ఎంపికలలో ఎంపికైనారు. వీరికి వార్షిక వేతనం సుమారు మూడు లక్షల వరకు ఉంటుందని కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు తెలుపుతున్నారు. కార్యక్రమంలో ఎవో సిహెచ్ శ్రీనివాసరావు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



## జనతా వారధి కార్యక్రమంపై బిజెపి నాయకుల సమీక్ష

యడ్లపాడు, జనవరి 9, ప్రభాతవార్త : ఎడ్లపాడు మండల బిజెపి పార్టీ కమిటీ సమావేశం లో భాగంగా రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న జనతా వారధి కార్యక్రమం గురించి చర్చించడం జరిగినది . ప్రజలకు అధికారులుకు మధ్య వారధి గా వ్యవహరించటం ప్రజా సమస్యలను సంబంధిత అధికారులవద్దకు తీసుకువెళ్లి సమస్యలకు పరిష్కారం చూపాలని పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల శివ నాగేశ్వరరావు జిల్లా కార్యవర్గ సభ్యులు వరికూటి నాగేశ్వరావు పాల్గొని కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమం మండల బిజెపి పార్టీ అధ్యక్షులు తులాబందుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకటేశ్వరరాజు, ఐలవరపు రామారావు, రావువారి సుబ్బారావు, నేలటూరి ఏసు రత్నం, బందెల శ్రీనివాసరావు, కామినేని సుధాకర్, చెక్క ఆంజనేయులు, బండి కోటయ్య, నక్క అనూష, వై హనుమంత రాయుడు, తులాబందుల ధనలక్ష్మి, నక్క శ్రీనివాసరావు, మద్దు చెన్నకేశవరావు మొదలగు పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.



## పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ జాప్యంపై ఆర్డీఓ ఆగ్రహం

యడ్లపాడు, జనవరి 9, ప్రభాతవార్త : ప్రభుత్వం నూతనంగా రైతులకు అందజేస్తున్న పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియ జాప్యం జరుగుతుందన్న విషయంపై డివిజనల్ అర్డివో మధులత శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. కారుచోల తదితర గ్రామాలలో పంపిణీ విధానాన్ని పరిశీలించి విఅర్‌వోలపై అగ్రహం వ్యక్త పరిచారు. మండలం మొత్తం 13319 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి కేవలం 4800పుస్తకాలు పంపిణీ ఏమిటనీ దీనిపై జిల్లా కలెక్టర్ అగ్రహం వ్యక్త పరిచారని, మరో రెండు రోజులలో పాస్ పుస్తల పంపిణీ పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని లేని పక్షంలో విఅర్‌వోలపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. అమెతోపాటు తహాశీల్దార్ విజయశ్రీ, డిప్యూటి తహాశీల్దార్ అనురాధ పాల్గొన్నారు.



## మహిళను అసభ్యంగా దూషించి, దాడి కేసులో వ్యక్తి అరెస్టు

యడ్లపాడు, జనవరి 9, ప్రభాతవార్త : మహిళను అసభ్యంగా దూషించిన దాడి చేసిన కేసులో వైకాపా నేతను పోలీసులు ఆరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... యడ్లపాడుకు చెందిన గుంజి అంకమ్మను అదే గ్రామానికి చెందిన వైకాపా నేత రాచమంటి చింతారావుకు ఆర్థికపరమైన వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చింతారావు, గోపి, కోటేశ్, కుమారి మరియు పవన్ అనే వ్యక్తులు ఈనెల 4న అంకమ్మ ఇంటికి వెళ్లి ఆమెను అసభ్యంగా దూషించి దాడి చేశారు బాధితురాలు ఈ నెల ఏడవ దేతిన పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు చింతారావును శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

## ధనుర్మాస ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి, జనవరి 9, ప్రభాతవార్త: ఈరోజు సత్తెనపల్లి పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో ధనుర్మాస పూజలలోని భాగంగా శ్రీవారిని (రాయి గరుడుడు) తమిళనాడులోని కుంభకోణం సమీపంలోని నాచ్చియార్ కోవిల్ (తిరునారాయణపురం) లోని ఒక పురాతన దేవాలయంలోని శిలా విగ్రహం; ఈ గరుడ విగ్రహం దాని బరువు మరియు చెమటలు పట్టడం వంటి రహస్యాలకు ప్రసిద్ధి చెందింది, ఇది భక్తుల నమ్మకాన్ని, అచంచలమైన సేవను సూచిస్తుంది, మరియు ఆలయ ఉత్సవాలలో స్వామివారిని మోస్తుంది. ముఖ్య అంశాలు: స్థలం: తమిళనాడులోని కుంభకోణం దగ్గర ఉన్న నాచ్చియార్ కోవిల్ (శ్రీనివాస పెరుమాళ్ ఆలయం). పురాణ కథ: ఒక శిల్పి చెక్కిన ఈ గరుడ విగ్రహానికి ప్రాణం పోయాలని ప్రయత్నించినప్పుడు, అది ఆకాశంలోకి ఎగిరింది; నిరాశతో శిల్పి రాయి విసరగా, అది తగిలి గరుడుడు కిందపడిపోయాడు, కానీ తన సృష్టి స్థలంలోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నాడు. రహస్యం: ఈ గరుడ విగ్రహం మొదట నలుగురితో కదలడం మొదలుపెట్టి, ప్రాకారాలు దాటేకొద్దీ బరువు పెరుగుతూ, చెమటలు పట్టడం విశేషం.



## 'వార్త' సంక్రాంతి ముగ్గుల పోటీలు

సత్తెనపల్లి టౌన్, జనవరి 9, ప్రభాతవార్త: జాతీయ తెలుగు దిన పత్రిక 'వార్త' ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు గాంధీ చౌక్ సెంటర్ వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు బహుమతులుగా టీవీ , ఐదు గ్రాముల వెండి నాణెం ,ఇతర బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

## పంట పొలాలకు వెళ్లే డొంక రోడ్ల నిర్మాణం చేపట్టండి: ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, జనవరి 9, ప్రభాతవార్త: గ్రామంలోని ప్రజలు పంటపొలాలకు వెళ్లేందుకు ఉన్నా డొంకరోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధికారులను ఆదేశించారు. 33వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ 100రోజులు 100 గ్రామాలు కార్యక్రమాన్ని పెదకూరపాడు మండలం కన్నెగండ్లలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. రాజ ముద్రతో రైతులకు కొత్తగా మంజూరైన పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్థులతో కలిసి భోజనం చేశారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు,విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెదకూరపాడు మండల అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య,ఏటుకూరి రత్నం, తహసిల్దార్ ధనలక్ష్మి ,ఎంపిడిఓ సాయి లీల,మండల,గ్రామ అధికారులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాదిపాడు-గింజుపల్లి-తాడువాయి ప్రాంతాల్లో ఫిట్నెస్ లేని పడవల ప్రయాణం

### జడ్పీ, పోలీస్ శాఖలకు నెలవారీ మామూళ్లు చెల్లిస్తున్నారన్న ఆరోపణలు



అచ్చంపేట, జనవరి 9 (ప్రభాతవార్త): నదీ పరివాహక ప్రాంతంలో పల్నాడు-కృష్ణా జిల్లాలను కలుపుతూ మాదిపాడు, గింజుపల్లి, తాడువాయి, చామర్రు, కోగంటి వారి పాలెం తదితర ప్రాంతాల్లో పడవలు, బల్లకట్టులు నిత్యం రద్దీగా ప్రయాణిస్తున్నాయి. ఎలాంటి సేఫ్టీ చర్యలు లేకుండా, ఓవర్లోడుతో ప్రయాణికులను తరలించడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జడ్పీ నిబంధనల ప్రకారం ప్రతి ఏడాది పడవలకు ఫిట్నెస్ సర్టిఫికెట్, సేఫ్టీ పరికరాలు, టికెట్ ధరల నియంత్రణ తప్పనిసరి. అయితే కొత్తగా కొనుగోలు చేసిన పడవలకు మాత్రమే ఫిట్నెస్ లభిస్తుండగా, పాత పడవలకు ఫిట్నెస్ పొందడం కష్టతరంగా మారిందని పడవ యజమానులు చెబుతున్నారు. మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో ఫిట్నెస్ పొందాలంటే లక్ష నుంచి రెండు-మూడు లక్షల వరకు ఖర్చు అవుతుందనే ప్రచారం ఉంది. గత నెలలో గింజుపల్లి పడవ మధ్య నదిలో ఇంజిన్ పనిచేయకపోవడంతో ప్రయాణికులతో కలిసి సుమారు కిలోమీటర్ మేర కొట్టుకుపోయిన సంఘటన కలకలం రేపింది. స్థానికుల సాయంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అచ్చంపేట ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు పోలీస్ సిబ్బందితో కలిసి ఫిట్నెస్ లేని పడవలను సీజ్ చేశారు. అయితే స్థానిక నేతల ప్రోత్సాహంతో మరుసటి రోజే సీజ్ చేసిన పడవలు మళ్లీ ఫిట్నెస్ లేకుండా, సారంగ సర్టిఫికెట్లు లేకుండానే తిరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అంశంపై క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మారలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రతి పడవ నుంచి జడ్పీకి నెలకు రూ.10,000, పోలీస్ శాఖకు మరో రూ.10,000 చొప్పున మామూళ్లు చెల్లిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు వివరణ:** ఫిట్నెస్ లేని పడవలను సీజ్ చేశాము. అవి మళ్లీ తిరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని సీఐకి ఫోన్ ద్వారా తెలియజేశాము. తగు చర్యలు తీసుకోవాలని కోరాము" అని ఆయన తెలిపారు.

## అంబరాన్ని తాకిన ముందస్తు సంక్రాంతి సంబరాలు





పెదకూరపాడు, జనవరి 9, ప్రభాతవార్త: మండల పరిధిలోని 75 తాళ్లూరు శ్రీ వివేకానంద విద్యానికేతన్ లో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులచే హరిదాసు వేషధారణ, విద్యార్థినులచే ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శిరీష గంగిరెద్దులకు హరిదాసులకు ధాన్యాలు వేశారు. భోగి మంటలు పొంగళ్ళు,గంగిరెద్దులు, కర్ర సాము, భోగి పళ్ళు కార్యక్రమాలు చేపట్టారు. ఎంతో సంబరంగా సంక్రాంతి వేడుకలు పాఠశాలలో నిర్వహించారు. వివిధ వేషధారణలో విద్యార్థులు అలరించారు. జడ్పీహెచ్ఎం రమణ పాల్గొన్నారు.

## 'కూటమి' ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట

### నియోజకవర్గంలో 7.264 కోట్లతో 27 నూతన ఆరోగ్య కేంద్రాలు మంజూరు : ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి, జనవరి 9, ప్రభాతవార్త: సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో శాసనసభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ చేసిన నిరంతర ప్రయత్నాలకు ఫలితంగా, నియోజకవర్గంలో రూ 7.264 కోట్ల వ్యయంతో 27 నూతన ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంజూరైన వాటి వివరాలు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు 25, బ్లాక్ ప్రజా ఆరోగ్య యూనిట్లు 2, మంజూరయ్యాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం కోసం పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితిని తొలగిస్తూ, ప్రతి గ్రామానికి సమీపంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే తమ లక్ష్యమని శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు.

## చిరు ధాన్యాల పోషక విలువలు, పంటసాగుపై అవగాహన



పిడుగురాళ్ల, జనవరి 9 ప్రభాతవార్త : పట్టణంలోని మార్కెట్యార్డులో శుక్రవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయ సహాయ సంచాలకుడు హనుమంతురావు ఆధ్వర్యాన చిరు ధాన్యాల పోషక విలువలు, పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. రబీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శాస్త్రవేత్తలు నగేష్, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రహణ మొర్రికి ఉచిత ప్లాస్టిక్ సర్జరీ శస్త్ర చికిత్స

పిడుగురాళ్ల, జనవరి 9 ప్రభాతవార్త : గ్రహణ మొర్రి, కాలిన గాయాలు, జన్యులోపంతో ఉన్న వారికి పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ గ్రీన్ ల్యాండ్స్ సేవా భారతి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మెర్సీ మిషన్ సహకారంతో ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నట్లు లయన్ విద్యాభూషన్ డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, తెలంగాణ పోలీసు అకాడమి డిప్యూటి డైరెక్టర్ మధుకర్‌స్వామి ఆధ్వర్యాన అమెరికాకు చెందిన వైద్యులు హైదరాబాద్‌లోని ఓల్డ్ మల్లేపలిలో గల సీతారాంబాగ్ డాక్టర్ ఈశ్వర్ చాంద్ చారిటబుల్ ట్రస్ట్‌లో చికిత్సలు చేస్తారన్నారు. ఈనెల 15వ తేదీలోగా పేరున్లనమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో స్క్రీనింగ్ పరీక్షలు హైదరాబాద్‌లో జరుగుతాయన్నారు. ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు శస్త్ర చికిత్సలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్ : 9440611107, 9848241640లను సంప్రదించాలన్నారు.

## టీటీడీ బోర్డు సభ్యత్వానికి జంగా రాజీనామా



పిడుగురాళ్ల, జనవరి 9 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా టీడీపీ నేత జంగా కృష్ణమూర్తి అనూహ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను టీటీడీకి పంపుతున్నట్లు మరో లేఖను విడుదల చేశారు. ఇందులో తన రాజీనామాకు గల కారణాలను ఆయన వివరించారు. దీంతో కూటమి ప్రభుత్వంలో తీవ్ర కలకలం రేగుతోంది. రెండు రోజులుగా ఒక పత్రికలో తనపై వచ్చిన తప్పుడు కథనాలకు మనస్థాపం చెంది టీటీడీ బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. గతంలో తనకు కేటాయించిన బాలాజీనగర్ ప్లాట్ నెం.2 ఇప్పటికీ ఖాళీగా ఉందని, దాన్ని తిరిగి కేటాయించాల్సిందిగా సీఎం చంద్రబాబును కోరినట్లు జంగా చెప్పారు. దీంతో చంద్రబాబు బోర్డుకు దీన్ని పంపారని, బోర్డు కూడా దీన్ని ఆమోదించి తీర్మాణం చేసినట్లు వెల్లడించారు. కానీ వాస్తవాన్ని అవాస్తవంగా ప్రచారం చేస్తు తనపై తప్పుడు కథనాలు రాస్తున్నారని జంగా ఆరోపించారు. కేబినేటి భేటిలో వాస్తవాలు తెలుసుకోకుండా బోర్డు నిర్ణయాన్ని రద్దు చేయాలని నిర్ణయించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. దీనిపైనే ఆయన మనస్తాపం చెంది పదవి వదులుకున్నట్లు పరోక్షంగా జంగా చెప్పుకొచ్చారు. శ్రీవారి సేవ చేసుకునే కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు, టీటీడీకి రుణపడి ఉంటానన్నారు. అలాగే స్వామి వారికి సేవ చేసుకునే అవకాశం కోల్పోతున్నందుకు శ్రీవారిని క్షమాపణలు కోరారు.

## చెన్నకేశవుడి సేవలో కన్నా, జూలకంటి!



మాచర్ల, జనవరి 9 ప్రభాతవార్త: పల్నాటి ప్రజల ఆరాధ్యదైవం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామిని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం సేవించారు. ముందుగా ఆలయ అధికారులు ఇరువురిని పూర్ణకుంభంతో స్వాగతం పలికి, గర్భాలయంలో కొలువుదీరిన స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేద పండితుల ఆశీర్వచనాలతో ఘనంగా సన్మానించారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో అట్టహాసంగా వంగవీటి రంగా విగ్రహావిష్కరణ





మాచర్ల, జనవరి 9 ప్రభాతవార్త: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం కాపు కేతనం ఎగసిపడింది. స్వర్గీయ వంగవీటి మోహనరంగా నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, విశిష్ట అతిథిగా వంగవీటి తనయులు రాధాకృష్ణ హాజరై విగ్రహావిష్కరణ చేశారు. కన్నా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పాలిట అమరజీవి వంగవీటి రంగా అని కొనియాడారు. ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ కార్మిక, కర్షకుల పాలిట ఉద్యమనేత వంగవీటి మోహనరంగా అని ప్రశంసించారు. వంగవీటి తనయుడు రాధాకృష్ణ మాట్లాడుతూ మూడేళ్ళ ఎమ్మెల్యేగా ఉండి, 33 సంవత్సరాలుగా అందరి గుండెల్లో నిలిచిన మహోన్నత శక్తి రంగా అని గుర్తు చేశారు. అట్టడుగు వర్గాల కోసం పాటుపడిన వ్యక్తికి ఒకే కులానికి ఆపాదించి చూడటం సరికాదన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి కాపు నేతలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## గీతాంజలి స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న పద్మశ్రీ బ్రహ్మానందం

వినుకొండ, జనవరి9, ప్రభాతవార్త: పట్టణంలోని గీతాంజలి రెసిడెన్షియల్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు స్థానిక కారంపూడి రోడ్డులోని గీతాంజలి గ్రౌండ్స్ నందు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్. రాయపాటి శైలజ, ప్రముఖ సినీ హాస్యనటుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత కె. బ్రహ్మానందం విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ మాట్లాడుతూ గీతాంజలి స్కూల్ 25ఏళ్ళ ప్రయాణంలో ఎన్నో ఎత్తు పల్లాలు చూసి ఈ స్థాయికి రావడం అభినందనీయమ శుభాకాంక్షలు చెప్పారు. బ్రహ్మానందం మాట్లాడుతూ గీతాంజలి స్కూల్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వెనుకబడిన పల్నాడు, వినుకొండ ప్రాంతంలో గీతాంజలి విద్యాసంస్థలు ఏర్పరచి





రాష్ట్రస్థాయి గుర్తింపు సాధించడంలో యాజమాన్యం, ఉపాధ్యాయుల కృషి, పట్టుదల ప్రస్ఫుటమవుతున్నాయని శ్లాఘించారు. పేదరికం నుండి వచ్చిన తాను చదువు పట్ల ఎప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని కష్టపడి ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు నిర్ధేశించుకొని జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం గీతాంజలి వ్యవస్థాపకులు యేండ్లూరి శేషగిరి రావు మాట్లాడుతూ స్కూల్ ప్రారంభించిన నాటి నుండి నేటి వరకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గీతాంజలి కరస్పాంటెండ్ కిషోర్, డిఈఓ పి. రామారావు, గీతాంజలి ప్రిన్సిపాల్ తేళ్ళ కృష్ణవేణి, నవీన విద్యా సంస్థల డైరెక్టర్ వై. చిన్నపరెడ్డి, చైతన్య విద్యా సంస్థల ఏజిఎం దుర్గా ప్రసాదు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల్లో కోలాటం కర్రలు అందజేత

అచ్చంపేట, జనవరి 9, ప్రభాతవార్త): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థినీలకు కోలాటం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే కొందరు విద్యార్థినీలకు కోలాటం కర్రలు అందుబాటులో లేకపోవడంతో, చెట్టు పుల్లలను కోలాటం కర్రలుగా ఉపయోగిస్తూ శిక్షణ పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్నేహహస్తాలు ఫౌండర్ ఎం.వి. రావు గారు స్పందించి, విద్యార్థినీలకు కోలాటం కర్రలను అందజేయడానికి ముందుకు వచ్చారు. స్నేహహస్తాలు సంస్థ ప్రతినిధి తాయి కరిముల్లా బాబు ద్వారా, జిల్లా పరిషత్ హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి చేతుల మీదుగా కోలాటం కర్రలను విద్యార్థినీలకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు, ఉపాధ్యాయులు స్నేహహస్తాలు సంస్థకు, ఫౌండర్ ఎం.వి. రావు గారికి కృతజ్ఞతలు తెలిపారు.



## బలమైన ఆహారంతోనే తల్లి బిడ్డ క్షేమం..

పెదకూరపాడు, జనవరి 9, ప్రభాతవార్త: గర్భిణీలకు బలమైన ఆహారం అందించడం ద్వారా పుట్టబోయే బిడ్డ తల్లి క్షేమంగా ఉంటారని 75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వలిగొండ రెడ్డి అన్నారు. శుక్రవారం మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహారాన్ని అందించారు. పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించారు. ప్రవాసాంధులు మాగులూరి భాను ప్రకాష్ తన కష్టార్జితంతో కొంత సమాజ సేవ చేద్దామనే ఉద్దేశంతో ఈ సేవ కార్యక్రమాలు చేపట్టారని పలువురు నాయకులు ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి సమాజ సేవకు పాటుపడాలని భాను ప్రకాష్ కాంక్షి ంచారు.

## చక్రధర్ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



మాచర్ల, జనవరి 9 ప్రభాతవార్త: స్థానిక చక్రధర్ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ కె.సాయిమార్కొండారెడ్డి తెలిపారు. సంస్కృతి సంప్రదాయాల్లో భాగమైన ముగ్గుల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ మహేశ్వరరెడ్డి, అధ్యాపకులు రాణి, విజయకుమారి, లక్ష్మీప్రసన్న, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



మాచర్ల, జనవరి 9 ప్రభాతవార్త: పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. సాగర్ రోడ్డులో క్వారీ ప్రహరీ గోడ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో త్వరలో ప్రతిపాదించబోతున్న నూతన మున్సిపల్ కాంప్లెక్సు స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం దేవళ్లమ్మ చెరువును పరిశీలించారు. మున్సిపల్ పార్కు, భారీ కల్యాణ మండపం నిర్మాణాలకు గల సాధ్యాసాధ్యాలను అధికారులతో చర్చించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో మాచర్ల తహశీల్దారు బి.కిరణ్‌కుమార్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాచర్ల పట్టణ అభివృద్ధిపై చెరగని ముద్ర వేయాలి: ఎమ్మెల్యే



మాచర్ల, జనవరి 9 ప్రభాతవార్త: మాచర్ల పట్టణ అభివృద్ధిపై చెరగని ముద్ర వేయాలని, చరిత్ర చెప్పుకునేలా ఉండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధికారులతో అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో పట్టణ పరిధిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్తు, జాతీయ రోడ్ల అథారిటీ, గుత్తేదారుల ప్రతినిధులతో ఎమ్మెల్యే జూలకంటి సమీక్షించారు. నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ, సైడ్ డ్రెయిన్లు, రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం, పార్కు సెంటర్ ఆధునికీకరణ, సెంట్రల్ లైటింగ్ పలు పనులపై తయారు చేసిన రోడ్డు మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులు ఎదుర్కొంటున్న అడ్డంకులను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాచర్ల పట్టణం నలుదిశలా అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, అధికారులు సమష్టి సమన్వయంతో సహకరించాలన్నారు. మొత్తం 4 కి.మీ. రోడ్డు నిర్మాణ పనుల్లో తలెత్తే సున్నితమైన సమస్యలను అధికారులు సమావేశాలు నిర్వహించి, ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ డి.వేణుబాబు, ఛైర్మన్ మదార్‌సాహెబ్, మాచర్ల టౌన్ సీఐ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల పాఠశాలకు ఫిజియోథెరపీ పరికరాలు అందజేత

మాచర్ల, జనవరి 9 ప్రభాతవార్త: పట్టణంలోని సూర్యకిరణ్ ప్రత్యేక పాఠశాలకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రూ.35 వేలు విలువ చేసే ఫిజియోథెరపీ పరికరాలను అందజేశారు. సీనియర్ రోటేరియన్, ప్రముఖ దంత వైద్యులు ఎస్.మురహరిరావు, జియాలజిస్టు ఇక్కుర్తి శంకర్, రోటరీ సభ్యుల సహకారంతో పరికరాలు అందజేసినట్లు వారు పేర్కొన్నారు. అవ్ అండ్ ఆఫ్ క్లబ్ సభ్యులు బాబునాయక్ ఆర్థికసహకారంతో నీటిని వేడి చేసునే గీజర్‌ను అందజేశారు. కార్యక్రమంలో రోటరీకన్లబ్ అధ్యక్ష కార్యదర్శులు తుమ్మల సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, రోటరీ జిల్లా 3150 డిసీజెస్ అండ్ ప్రివెన్షన్ ఛైర్మన్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఇక్కుర్తి శంకర్, ఎలక్ట్ ప్రెసిడెంట్ పఠాన్ నాగూర్‌వలి, ద్వారా ప్రిన్సిపల్, కరస్పాండెంట్ జనార్ధనికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



## వైసీపీ సీనియర్ నేత మురళీధరరెడ్డి జన్మదిన వేడుకలు

గురజాల, జనవరి 9 ప్రభాతవార్త : వైసీపీ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధరరెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం గురజాలలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశ్మారు. ఆనిగ్రేస్ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. వైసీపీ నేత నాసర్‌సైదా ,షేక్ వలి, నాగుల్ మేస్త్రి, లత్తు, పోలా సతీష్, కనకం ఆదినారాయణ దత్తు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ అధ్యక్షులకు శిక్షణా కార్యక్రమం

వినుకొండ, జనవరి9, ప్రభాతవార్త: గుంటూరు పట్టణం కేంద్ర సహకార బ్యాంకు నందు బాపట్ల జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాలకు నూతనంగా నియమితులైన సొసైటీ ప్రెసిడెంట్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర





సహకార యూనియన్ లిమిటెడ్ విజయవాడ వారి ఆధ్వర్యంలో జీడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అధ్యక్షతన ఒకరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సహకార శాఖఅధికారి శ్యాంసన్, జిడిసిసి బ్యాంక్ సీఈవో వి.వి.ఎస్.ఫణి కుమార్, బ్యాంకు ఇతర ఉన్నతాధికారులు, కోపరేటివ్ ట్రైనింగ్ కాలేజీ లెక్చరర్ వేదాంతరెడ్డి, బాపట్ల జిల్లా సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## యంగ్‌స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ

బొల్లాపల్లి, జనవరి9, ప్రభాతవార్త: యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ తరుపున మండలంలోని రామాపురం గ్రామంలోని పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు.



కార్యక్రమంలో దాత రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గాండ్ల నాగేంద్రుడు మాస్టర్ పాల్గొని బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదవారికి సాయం చేయడం ఎంతో తృప్తినిస్తుందని మానవ సేవయే మాధవ సేవ అని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వేడుకల్లో పాల్గొన్న బిఎస్ఆర్



వినుకొండ, జనవరి9, ప్రభాతవార్త: గుంటూరు చేబ్రోలు హనుమయ్య ప్రాంగణంలో ఈనాడు, ఈటీవీ సంస్థల 50,30 వసంతాల వేడుకలు కన్నుల పండగగా సాగింది. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యులు బోడేపూడి వెంకట సుబ్బారావు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ తమ బృందంతో గుంటూరు వాసులను అలరించారు. యువ హీరో అక్కినేని అఖిల్, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్స్ సందడి చేశారు. ఈ కార్యక్రమానికి గుంటూరులో అనేక మంది రాజకీయ, వ్యాపార ప్రముఖులు కుటుంబాలతో కలిసి హాజరయ్యారు.

## ఆస్తికోసం సొంత బంధువులను ముగ్గురుని హతమార్చిన ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

సత్తెనపల్లి, జనవరి 9, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో ఆస్తి కోసం సొంత బంధువులను ముగ్గురిని కిరాతకంగా హత్య చేసిన కేసులో సత్తెనపల్లి పట్టణానికి చెందిన ఇద్దరు నిందితులు షేక్ ఖాసిం, షేక్ జాకీర్ కు గుంటూరు జిల్లా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు తో పాటు 2,500 రూపాయలు జరిమానాను విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి పి. సాయి కళ్యాణ చక్రవర్తి గురువారం తీర్పు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి Cr.No.80/2023, SC.No.309/2025 కింద విచారణ జరిగింది. ఫిర్యాదుదారు మసీద్ అబ్దుల్ సత్తార్ (సత్తెనపల్లి టౌన్) ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆస్తి విషయంలో విభేదాలు తలెత్తడంతో నిందితులు తమ సొంత బంధువులైన షేక్ రహిమూన్ (63), షేక్ మాలిన్ బీ (32) లను కత్తితో పొడిచి హత్య చేసినట్లు విచారణలో తేలింది. అదేవిధంగా షేక్ రహిమాన్ అబ్దుల్ రహిమాన్ (36) ను డబ్బులు ఇస్తామని మోసం చేసి తీసుకెళ్లి నవారు వైరు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసులు కోర్టుకు తెలిపారు. ఈ ఘటన 2023 జూలై 5న చోటుచేసుకుంది. పోలీసుల సమర్థ దర్యాప్తు ఈ కేసును అప్పటి సత్తెనపల్లి రూరల్ ఎస్సై ఎ. బాలకృష్ణ నమోదు చేయగా, రూరల్ సీఐ బి. ఆదినారాయణ విచారణ పూర్తి చేశారు. అనంతరం సీఐ ఎం. హనుమంతరావు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సత్తెనపల్లి డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎం. హైమారావు, ఎస్సై ఎస్‌కే. అమీనుద్దీన్ కోర్టులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ తరఫున డీడీపీ మొహమ్మద్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించి కేసును విజయవంతంగా నిరూపించారు. ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా పనిచేసిన పోలీస్ అధికారులు, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని పల్నాడు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు అభినందించారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ



సత్తెనపల్లి, జనవరి 9, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణంలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ బార్ పేడరేషన్ పిలుపు లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు అన్ని న్యాయస్థానంలో పిలుపులో భాగంగా సత్తెనపల్లి లోని నాలుగు న్యాయస్థానంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం అందించాల్సిన స్టయిఫండ్ వెంటనే విడుదల చేయాలని,.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాద పరిరక్షణ చట్టం అమలు చేయాలని, ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జారీ చేసిన సర్క్యులర్ నెంబర్, 10 ని ఉపసంహారించుకోవాలని నినాదాలు చేశారు. న్యాయ దేవత విగ్రహం వద్ద పలువురు న్యాయవాదులు చేసిన అనంతరం అందరూ నినాదాలు చేస్తూ కాలినడకన ఆర్. డి. ఓ కార్యాలయం నకు చేరుకుని ఆర్. డి. ఓ రమాకాంత్ రెడ్డి కి వినతిపత్రం అందించారు.

## ప్రజాసమస్యల పరిష్కార వేదిలో అర్జీలు స్వీకారం

సత్తెనపల్లి, జనవరి 9, ప్రభాతవార్త: సత్తెనపల్లి నియోజకవర్గం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న శాసనసభ్యులు కన్నా కార్యాలయం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణకుప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు .

## సత్తెనపల్లి మున్సిపల్ చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించాలి

సత్తెనపల్లి, జనవరి 9, ప్రభాతవార్త: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పురపాలక సంఘం చైర్మన్ ఎస్సీ (దళిత) సామాజిక వర్గానికి కేటాయించాలని వివిధ రాజకీయ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కోరారు. శుక్రవారం ప్రజా దర్బార్ లో ఎమ్మెల్యే కి నాయకులు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సత్తెనపల్లి పురపాలక సంఘం ఏర్పడి నాలుగు దశాబ్దాలైనా నేటికీ మున్సిపల్ చైర్మన్ ఎస్సీ సామాజిక వర్గానికి అందని ద్రాక్షగా మారిందని పేర్కొన్నారు. నలభై ఏళ్లలో ఒక్కసారి బీసీ వర్గం వారు చైర్మన్ కాగా ఎస్సీలకు ఒక్కసారి కూడా అవకాశం రాలేదని చెప్పారు. అగ్రవర్ణాల్లో వారు ఇప్పటికే రెండు, మూడేసి సార్లు చైర్మన్లుగా చేశారని వివరించారు. జనాభా దామాషా ప్రకారంగా దళితులకు కూడా రెండు సార్లు చైర్మన్ అయ్యే అవకాశాలు ఉన్నప్పటికీ ఒక్కసారి కూడా రాలేదని వాపోయారు. ఇది ఆ సామాజిక వర్గాల పై వివక్షతో పాటుగా రాజ్యాంగ ఉల్లంఘన కిందే వస్తుందని ఒకసారి ఈ అంశాని పరిశీలించాలని సూచించారు. పురపాలక సంఘం రిజర్వేషన్లు తమ పరిధిలోకి రావని రాష్ట్ర పురపాలక సంఘం అడ్మినిస్ట్రేషన్ పరిధిలో ఉంటుంది..అయినా మీరు చెప్పిన అంశం పై పరిశీలిస్తామని ఎమ్మెల్యే కన్నా సానుకూలంగా స్పందించారు . కార్యక్రమంలో లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, బిఎస్ పీ నియోజకవర్గ ఇంచార్జి కుక్కమళ్ళ దేవానంద్, సిపిఐ పట్టణ కార్యదర్శి వల్లెం లక్ష్మీ చెన్నకేశవ, జనసేన 7 వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్, వైకాపా నాయకులు కోడిరెక్క దేవదాస్, పెద్దింటి నాగేశ్వరావు, డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిగం చిట్టిబాబు తదితరులున్నారు.



## పరివర్తన పాఠశాలలో విద్యార్థులకు వితరణ

సత్తెనపల్లి, జనవరి 9, ప్రభాతవార్త నవచైతన్య వివేకా సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163 వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని. నరసరావుపేట రోడ్డు లోపల పరివర్తన చెవిటి మూగ పిల్లల పాఠశాల యందు"పిల్లలకు మిఠాయిలు మరియు అన్న ప్రసాదం, చలికాలం కాబట్టి అక్కడ చదువుకునే చిన్నారులకు రగ్గులను పంపిణీ చేయడం జరిగింది..వ్యవస్థాపక అధ్యక్షులు నోముల వెంకట చలపతిరావు, సెక్రటరీ.వి. వి పాండురంగారావు.. బిజెపి సీనియర్ నాయకులు గడ్డం శంకర్రావు . మోహన్ ఫ్యాన్సీ కోటేశ్వరావు. చిన్నం ప్రసాద్.. ఆవుల కోటేశ్వరరావు .రాజకీయ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేహదారుఢ్యానికి క్రీడలు దోహదం: జూలకంటి గౌతమ్



మాచర్ల, జనవరి 9 ప్రభాతవార్త: దేహదారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే జూలకంటి తనయులు గౌతమ్ అన్నారు. దుర్గి మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలోని చిరుమామిళ్ల సుబ్బయ్య తాతయ్య గారి వార్షిక తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన స్టేట్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వాలీబాల్ టోర్నమెంటును పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు, గురజాల డీఎస్పీ జగదీష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని గ్రౌండ్‌లో కొంత సమయం వాలీబాల్ ఆడి ప్రోత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా, ప్రాంతల పట్ల స్నేహ భావ వాతావరణాన్ని నెలకొల్పడానికి సహకరిస్తాయని వివరించారు. సుబ్బయ్య తాతయ్య గారి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా టోర్నమెంటు ఏర్పాటు చేయడం పట్ల కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి




**నిజాంపట్నం, జనవరి 9, ప్రభాతవార్త:** డాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డిపిఎం ప్రమీల అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నిజాంపట్నం మండల సమాఖ్య కార్యాలయంలో నగరం, నిజాంపట్నం మండలాల సీడ్ క్యాపిటల్ లబ్దిదారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలద్రొక్కుకుంటే కుటుంబం ఆర్థికంగా బలంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వ్యాపారం చేసుకునే మహిళలకు ఏ రకములైన జీవనోపాదుల వ్యాపారం చేసుకోవచ్చో శిక్షణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్పి రవీంద్ర, ఎపిఎం మస్తాన్‌రావు, నగరం, నిజాంపట్నం మండలాల సిసిలు, తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్సీ ఆలపాటి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గులపోటీలు



**తెనాలి మున్సిపాలిటీ జనవరి9(ప్రభాతవార్త):** శాసన మండలి సభ్యులు, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని నియోజకవర్గ తెలుగు మహిళలు తెలిపారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా 13వ తేదీ ఉ.గం.7:00ల నుండి స్థానిక ఎన్వీఆర్ ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గ మహిళల ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని, మొదటి బహుమతిగా 5,116/ , రెండవ బహుమతిగా 3,116/ మూడవ బహుమతిగా 2,116/ అంతే గాక 5 కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని,ఇందుకు ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసుకునేవారు నేరుగా తెనాలి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో గానీ ఫోన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేవారు 9553855355,8555949974 అనే నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరుచూరి రమ్య,గుమ్మడి భావన,కొండా రమాదేవి,ఆచాయమ్మ,కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్లు శుభ్రంగా,సుందరంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

**బాపట్ల,జనవరి9,ప్రభాతవార్త:** ఆర్‌టిసి బస్టాండ్లు నందు ప్రయాణికులకు సీటింగు, వెయిటింగ్, త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్



హాల్ నందు ఏపీ పి ఆర్టీసీ ఆర్ యం విమల,డిపో మేనేజర్లతో బాపట్ల జిల్లాలోని ఆర్టీసీ అందిస్తున్న సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ టి సి బస్టాండ్లు నందు ప్రయాణికులకు సీటింగు, వెయిటింగ్, త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులపై ఉందన్నారు. బస్టాండ్ నందు ప్లాట్ ఫారములు, ప్రతి రోజు పినాయల్ తో శుభ్రపరచడం తో పాటుగా బస్టాండ్ లో ప్రాంతాలను పరిశుభ్రముగా ఉంచాలన్నారు. ప్రతి బస్టాండ్ నందు ఆర్ ఓ త్రాగు నీరు ప్లాంట్ ఏర్పాటు చేయాలని, బస్టాండ్ ఆవరణలో ఉన్న భవనాలకు మరియు కాంపౌండ్ వాల్ చెట్ల కు పెయింటింగ్స్ వేయించాలని, ప్రయాణకులకు బస్ టైమింగ్స్ వంటి పూర్తి సమాచారం తెలియపరిసే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనవసరమైన బ్యానర్స్ కట్ అవుట్లను తొలగించాలన్నారు. బస్టాండుల నందు మరుగుదొడ్ల మర్మతులు వెంటనే చేయాలని ఆదేశించారు. డ్రైవర్లు, కండక్టర్లు ఆర్ టి సి అధికారులు ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచు కోవలన్నారు. ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా నడుచుకొనే విదంగా మరియు డ్రైవర్లు రాష్ డ్రైవింగ్ చేయకుండా శిక్షణలు ఇవ్వాలన్నారు. ఆర్ టి సి సంస్థ ద్వారా ప్రజా సానుకూలత పెంచే విదంగా ఆర్ టి సి అధికారులు సిబ్బంది పని చేయాలన్నారు. ఆర్ టి సి పై ప్రయాణకులకు నమ్మకం కలిగే విధంగా ఆర్టీసీ అధికారులు పనిచేయాలని బాగా పని చేసిన అధికారుల కు అవార్డులు అందజేయడం జరుగుతుందన్నారు.

హైదరాబాద్, బెంగళూరు ముఖ్య పట్టణాలకు బాపట్ల జిల్లా కేంద్రం నుండి బస్సులు నడపాలని ఆర్ఎం ను ఆదేశించారు. బాపట్ల జిల్లా కేంద్రం నుండి హైదరాబాదుకు ఇంద్ర ఏసి బస్సులు 2 సర్వీసులు నడపాలని, అదేవిధంగా జిల్లా కేంద్రం నుండి రేపల్లెకు ఎక్స్‌ప్రెస్ బస్ నడపాలని, చీరాల బాపట్ల పొన్నూరు తెనాలి కి,బాపట్ల చీరాల,ఒంగోలు కు,బాపట్ల చుండూరు మోదుకురుకు బస్ నడపాలని ప్రజలు కోరుతున్నారనితెలిపారు. ఇంకొల్లు, బూధవాడ, అద్దంకికి బస్ నడపాలని,బాపట్ల నుండి పర్చూరు కు బస్సులు పెంచాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లా కేంద్రం నుండి వివిధ ప్రాంతాలకు ప్రత్యేకంగా 30 బస్సు సర్వేసులు నడపడం జరుగుతుందని రీజనల్ మేనేజర్ విమల జిల్లా కలెక్టర్ కు తెలియజేసారు. ఈ సమావేశంలో చీరాల,రేపల్లె డిపో మేనేజర్లు జె.శ్యామల,వెంకటరమణ, టీం మరియు ట్రాఫిక్ సుపెరువైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి సిబ్బంది పని తీరుతోనే వ్యవసాయ రంగ పురోభివృద్ధి

### జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల,జనవరి9,ప్రభాతవార్త:** క్షేత్రస్థాయి సిబ్బంది పని తీరుతోనే వ్యవసాయ రంగం, తద్వారా జిల్లా పురోభివృద్ధిలో పయనిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. జాతీయ ఆహార భద్రత, పోషకాహార లోపం నివారణ ప్రత్యేక కార్యక్రమాలపై మండల వ్యవసాయ అధికారులతో శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రైస్ మిల్లర్ల అసోసియేషన్ హాల్ లో సమావేశం నిర్వహించారు.అనంతరం మండల వ్యవసాయ అధికారులు రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్, వీఏవోలు రూపొందించిన క్యాలెండర్ లను కలెక్టర్ విడుదల చేశారు. యూరియా అధికంగా వినియోగించడంతో వచ్చే నష్టాలపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన గోడపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల్లో నాయకత్వ లక్షణాలు మరింత మెరుగుపడాలని కలెక్టర్ చెప్పారు. అవి తక్కువగా ఉండడంతోనే ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేక పోతున్నామన్నారు. ప్రభుత్వ అధికారులకు ఉన్న అధికారాలను కాగితాలకు




పరిమితం చేయడం కాదని సంక్షేమ ఫలాలు అట్టడుగున ఉన్న వారికి అందించడమే ముఖ్యమన్నారు. పట్టుదల, చిత్తశుద్ధితో పని చేస్తే జిల్లా ముందుకు వెళ్తుందన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు ఆధునికీకరణను సంతరించుకుంటూ అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. బాపట్ల జిల్లా 20 మండలాలైన తరువాత వ్యవసాయ శాఖతో తొలి సమావేశం నిర్వహించడం సంతోషదాయకం అన్నారు. రైతులకు అందించే సేవలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ, స్పందన తెలుసుకోవడానికి ఐవీఆర్ఎస్ విధానాన్ని ప్రవేశ పెట్టినట్లు వివరించారు. ప్రభుత్వం నిశితపరిశీలన చేస్తున్న విషయాలను అధికారులు గుర్తించుకోవాలన్నారు. ఏ గ్రామంలోనైనా ఆర్ఎస్ కె లలో సేవలు తక్కువగా ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.యూరియా సంక్షోభం నుంచి బాపట్ల జిల్లా బయటికి వచ్చినట్లు జిల్లా వ్యవసాయశాఖ ఇన్చార్జ్ అధికారి అన్నపూర్ణ తెలిపారు. సమస్య పునరావృతం కాకుండా సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ధనరాజ్, మండల వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు శాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప చేయాలి : ఎస్పీ

**బాపట్ల,జనవరి9,ప్రభాతవార్త:** పోలీస్ శాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప చేయాలని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమా మహేశ్వరరావు అన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన ఆల్ ఇండియా మాస్టర్స్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ - 2026లో మూడు పతకాలు సాధించి, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు ఎంపికైన బాపట్ల జిల్లా స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ నాగరాజును జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ నాగరాజు శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి, హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి క్రీడలలో గెలుపొందిన పతకాలు, సర్టిఫికెట్లను చూపించారు. జిల్లా ఎస్పీ అతడిని పతకాలతో సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లా పోలీస్ శాఖలో స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న



హెడ్ కానిస్టేబుల్ సిహెచ్.నాగరాజు తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 6, 7 తేదీలలో ఎయిమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా మాస్టర్స్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ - 2026 క్రీడా పోటీలలో అథ్లెటిక్స్ విభాగంలో 40 ప్లస్ కేటగిరీలో పోటీపడి, షాట్‌పుట్, డిస్కస్ త్రో లలో పసిడి పతకాలు, జావలిన్ త్రో లో రజత పతకం సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ఎంతో అభినందనీయమన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ క్రీడా పోటీలలో తన సత్తా చాటి, రానున్న 2026 ఏప్రిల్ నెలలో థాయిలాండ్ దేశంలో జరగనున్న వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడలకు అర్హత సాధించడం బాపట్ల జిల్లా పోలీస్ శాఖకు ఎంతో గర్వకారణమని కొనియాడారు. విధి నిర్వహణతో పాటు క్రీడలలో కూడా నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగుతూ జాతీయ స్థాయిలోనే కాక అంతర్జాతీయ స్థాయిలో జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువస్తుండడం ఇతర పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది క్రీడలలో పాల్గొంటూ ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. రానున్న 2026 ఏప్రిల్ నెలలో థాయిలాండ్‌లో జరగనున్న వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో కూడా సత్తా చాటి, దేశానికి, రాష్ట్రానికి, జిల్లా పోలీస్ శాఖకు మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి ఇన్స్పెక్టర్ జి.నారాయణ, హెడ్ కానిస్టేబుల్ సిహెచ్.నాగరాజు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువతకు స్వామి వివేకానంద ఆదర్శవంతం

**రేపల్లె, జనవరి 9, ప్రభాతవార్త:** ప్రపంచంలోనే యువతకు ఆదర్శవంతంగా స్వామి వివేకానంద నిలిచారని అనగాని భగవంతరావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ .శక్తివంతమైన సూక్తులను అధ్యయనం చేయాలని ఆయన సూచించారు.డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా




టి.సి.రవిచంద్ర కుమార్ చెప్పారు. శుక్రవారం స్థానిక ఎబిఆర్ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద 163వ జయంతి జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వామి వివేకానంద వ్యక్తిత్వాన్ని,రచనలను ఆదర్శవంతంగా తీసుకోవాలని తెలిపారు నివాళులర్పించారు. విద్యార్థులలో స్వామి వివేకానంద స్ఫూర్తిని నింపేందుకు యువతపై స్వామి వివేకానంద ప్రభావం అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి కె.బాలగురవయ్య, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 23న భావనారుషి కళ్యాణం

**రేపల్లె, జనవరి 9, ప్రభాతవార్త:** ఓల్డుటౌన్ పద్మశాలి వారి వీధిలో కొలువుతీరిన శ్రీ భద్రావతీ సమేత భావన రుషి స్వామి కళ్యాణ మహోత్సవం ఈ నెల 23వ తేదీ రాత్రి 9 గంటల 25 నిమిషాలకు జరుగుతుందని రేపల్లె పద్మశాలీయ బహుత్తమ సంఘం కార్యవర్గ సభ్యులు శుక్రవారం తెలియజేశారు.24వ తేదీ స్వామి వారి ఉత్సవ మూర్తుల రధోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.25వ తేదీ అన్న సంతర్పణ,26వ తేదీ వసంత సేవ,అమ్మవారికి సారె,పుష్పయాగ ఉత్సవం,పాన్పు సేవా కార్యక్రమాలు జరుగుతాయని సంఘం కార్యవర్గ సభ్యులు వివరించారు.అధిక సంఖ్యలో పద్మశాలీ సంఘీయులు,భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని స్వామి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తిచేశారు.

## చెరువులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

**నగరం, జనవరి 9, ప్రభాతవార్త:** చెరువులో కి ఆర్టీసీ బస్సు దూసుకు వెళ్లిన సంఘటన శుక్రవారం నగరం మండలం చిరకాలవారిపాలెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బాపట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సుమారు 35 మంది ప్రయాణికులు రేపల్లె ప్రయాణిస్తుండగా చిరకాల వారి పాలెం సమీపంలో స్టీరింగ్ సమస్య వల్ల చెరువులోకి వెళ్లడం జరిగింది స్థానికులు తెలిపారు.



## విద్యార్థినీ,విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి: ప్రిన్సిపల్ కె విజయలక్ష్మి

**చెరుకుపల్లి, జనవరి 9, ప్రభాతవార్త :** విద్యార్థినిలు చదువుతోపాటు దేశ ప్రతిష్టల గురించి కూడా అవగాహన కలిగి ఉండటం వారి యొక్క ఉత్తమ ఫలితాలకు దోహదపడుతుందని స్కూల్ ప్రిన్సిపాల్ కె విజయలక్ష్మి అన్నారు. కావూరు గురుకుల పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కూచిపూడి వెంకట రమ్య వీర్ గాధ 5.0 కేటగిరీ 2 విభాగంలో విజేతగా ఎంపిక అవడం పట్ల విద్యార్థినిని శుక్రవారం అభినందించారు. భారతదేశానికి చెందిన వీరత్వ పురస్కార గ్రహీతల ధైర్య సాహసాలు ,త్యాగాల గాధలు ద్వారా విద్యార్థిని ,విద్యార్థులు లో దేశభక్తిని పెంపొందించడం అన్నారు. గాలంట్రి అవార్డు గ్రహీత సుబేదార్ మేజర్ బాణాసింగ్ "సియాచిన్ సింహం"అనే కథనంపై రచించిన కవిత ద్వారా వెంకట రమ్య విజేతగా నిలిచిందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థిని రమ్యను పాఠశాల అధ్యాపక సిబ్బంది అభినందించారు.



## నేడు చెరుకుపల్లిలో విద్యుత్తు సరఫరా నిలిపివేత

**చెరుకుపల్లి ,జనవరి 9, ప్రభాతవార్త:** నేడు చెరుకుపల్లిలో విద్యుత్ సరఫరాలో మరమ్మత్తులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు చెరుకుపల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ తెలిపారు. వినయ విధేయల సేకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చేతి వృత్తిదారుల సంక్షేమానికి చర్యలు

**రేపల్లె, జనవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేతి వృత్తిదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పోరేషన్లు ఏర్పాటు చేసిందని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు చెప్పారు.శుక్రవారం



మున్సిపల్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమైక్య రాష్ట్ర సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగాంజనేయులు,చేతివృత్తిదారుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.బాలాజీ,చేతి వృత్తిదారుల సంఘాల నాయకులు కొడాలి సాంబశివరావు,కారుమూరు సుబ్బారావు,రైతు సంఘం నాయకుడు నల్లూరి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 11న ఉద్యమసారధి పరమేశ్వరరావు వర్థంతి

**రేపల్లె, జనవరి 9, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ ఉద్యమ సారధి కామ్రేడ్ నూతలపాటి పరమేశ్వర రావు 4వ వర్ధంతి సందర్భంగా ఎపిటిఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు ఈ నెల 11వ తేదీ గుంటూరులోని ఎసి కళాశాలలో జరుగుతుందని ఎపిటిఎఫ్ బాపట్ల జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పి.డి.సోషలిజం తెలిపారు.శుక్రవారం ఎపిటిఎఫ్ రేపల్లె జోనల్ కార్యాలయంలో విద్యా సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం, విద్యారంగం ప్రైవేటీకరణ,ఆర్థిక అసమానతలు అనే అంశాలపై జాతీయ సమాచార హక్కు కమిషన్ మాజీ కమిషనర్ ఎం.శ్రీధర్.డి. పాపారావులు ప్రసంగిస్తారని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్,ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు సిహెచ్.మంజుల,కె.భానుమూర్తి,పి.పాండురంగ వరప్రసాదరావు,మాజీ ఎమ్మెల్సీ పి.రఘువర్మ, రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ పాల్గొని ప్రసంగిస్తారని ఆయన వివరించారు. ఈ సమావేశంలోఎపిటిఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు,అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఎం.హరి ప్రసాద్, జి.రవి,టి.శ్రీనివాసరావు,జిపిఎస్‌వి ప్రసాద్ రావు,ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఏకీకృత కుటుంబ సర్వే తో ప్రజలకు ఎంతో మేలు

### డిప్యూటీ ఎంపిడివో పల్నాటి శ్రీరాములు

**బాపట్ల,జనవరి9,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏకీకృత కుటుంబ సర్వే వలన పేదలకు ఎంతో మేలు జరుగుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు సక్రమంగా అందించాలనే లక్ష్యంతో జరుగుతున్న ఈ సర్వే ద్వారా ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు ఇవ్వడం జరుగుతుందని స్వర్ణ గ్రామ ఉద్యోగులు సర్వేను వేగవంతం గా,పారదర్శకంగా నిర్వహించాలని బాపట్ల మండలం స్వర్ణ గ్రామ డిప్యూటీ ఎంపిడివో పల్నాటి శ్రీరాములు చెప్పారు. శుక్రవారం జమ్ముల పాలెం, నరసాయపాలెం స్వర్ణ గ్రామ సిబ్బంది తో శ్రీరాములు సమీక్ష సమావేశం నిర్వహించారు.అనంతరం సిబ్బంది తో కలిసి గ్రామస్థులకు కుటుంబ సర్వే ప్రయోజనాలు, మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ గురించి అవగాహన కల్పించారు.డిప్యూటీ ఎంపిడివో తో పాటు చెరువు జమ్ముల పాలెం, నరసాయపాలెం పంచాయతీ కార్యదర్శులు చిరంజీవి, దొరబాబు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కారించాలంటూ, న్యాయవాదులు విధులు బహిష్కరణ

**తెనాలి టౌన్ జనవరి9(ప్రభాతవార్త):** అపరిష్కృతంగా ఉన్న తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ, శుక్రవారం తెనాలి బార్ అసోసియేషన్ కు చెందిన న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. రాష్ట్ర బార్ ఫెడరేషన్



పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్ లతోపాటు తెనాలి బార్ అసోసియేషన్ కూడా తమ సమస్యలపై నిరసన తెలుపుతూ, శుక్రవారం విధులు బహిష్కరిస్తున్నా మని,బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ద్వారా తెలియపరచిన సర్క్యులర్ నెంబర్ 10/25 ను రద్దు చేయాలని,జూనియర్‌న్యాయవాదులకు న్యాయ మిత్ర స్టైఫండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో మంజూరు చేయాలని,అలాగే పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మరియు న్యాయమిత్ర స్టైఫండ్ ను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అంతేకాకుండా ప్రధానంగా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని,తెనాలి బార్ అసోసియేషన్ తరపున తెనాలి సబ్ కలెక్టర్ కి మెమరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు భేతాళ ప్రభాకర్, ఉపాధ్యక్షులు అన్నం పిన్నారావు, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, అసోసియేషన్ సభ్యులు, జగజీవన్,పుణ్యవతి,అబ్రహం లింకన్ మరియు సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు,దాసరి శ్రీధర్, గుమ్మడి రవిరాజు,మామిడాల శ్రీనివాసరావు, విజయభాస్కర్, ఇతర న్యాయవాద మిత్రులు పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగం

**నిజాంపట్నం, జనవరి 9, ప్రభాతవార్త:** స్టడీ మెటీరియల్ 10వ తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య



అన్నారు. శుక్రవారం నిజాంపట్నం జడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ పుస్తకం కొరకు జిల్లా పరిషత్ ఛైర్మన్ హెన్రీ క్రిస్టినా జడ్‌పి నిధుల నుంచి రూ.64లక్షలు కేటాయించిందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లాపరిషత్ , పురపాలక, ప్రభుత్వ, ఆదర్శ, సంక్షేమ, కస్తూరిబా, ఎయిడెడ్ పాఠశాలల్లో చదవే 32,276 మంది విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు ఉపయోగపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ, టిడిపి నాయకులు ఖాదర్ బాబు, నర్రా సునీల్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

**తెనాలి మున్సిపాలిటీ జనవరి9(ప్రభాతవార్త):** 11కెవి విద్యుత్ లైన్లలో మరమ్మత్తులు మరియు విద్యుత్ లైన్ లకు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించే పనుల నిమిత్తం శనివారం తెనాలి పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని,ఏపీ సిపిడిసిఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, కావున వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించవలసిందిగా మనవి చేస్తున్నామన్నారు.

## వడ్డే ఓబన్న ఫైబర్ విగ్రహం తయారీలో కళారత్న "కాటూరి"

**తెనాలి టౌన్ జనవరి9(ప్రభాతవార్త):** తిరుపతి పట్టణంలో ప్రతిష్టించేందుకు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాధ్యక్షుడు వడ్డే ఓబన్న ఫైబర్ విగ్రహం పట్టణంలోని సూర్య శిల్పశాలలో రూపుదిద్దుకుంటోంది.7అడుగులు,9అంగుళాల ఎత్తులో రూపొందిన ఈ ఫైబర్ గ్లాస్ విగ్రహాన్ని,జనవరి 11వ తేదీన వడ్డే ఓబన్న 219వ జయంతి సందర్భంగా, ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే జయంతి వేడుకలలో పెడెస్టల్‌పై ప్రతిష్టించనున్నారు.అలాగే ఇదే విగ్రహాన్ని కాంస్యంలో రూపొందించి,సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం గువ్వలగుంటపల్లిలోను, అలాగే అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీ వద్ద త్వరలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.ఈ రెండు కాంస్య విగ్రహాలు కూడా తమ సూర్య శిల్పశాలలోనే రూపుదిద్దుకున్నాయని విగ్రహాల తయారీ శిల్పులు ఆంధ్ర శ్రీ, కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర (ఎం.ఎఫ్.ఏ ) మీడియాకు వెల్లడించారు.తిరుపతిలో ప్రతిష్టించనున్న ఈ విగ్రహాన్ని శుక్రవారం తరలించనున్నట్లు శిల్పులు తెలిపారు.



## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**నగరం, జనవరి 9, ప్రభాతవార్త:** నేడు విద్యుత్ కు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ మీరా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం 33/11కెవి నగరం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి అల్లపర్రు ఫీడర్ పిఎంఐ మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు చలమా అగ్రహారం, బెల్లం వారి పాలెం ఏలేటి వారి పాలెం, ఆక్వా సర్వీస్, నగరం పంచాయతీ విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## నేడు వరగాని,పెదనందిపాడు పరిధిలో విద్యుత్తు సరఫరా నిలిపివేత

**పెదనందిపాడు జనవరి 9 (ప్రభాతవార్త)** పెదనందిపాడు వరగాని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో గల అన్ని గ్రామాలలో నేడు శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2. గంటల వరకూ విద్యుత్ లైన్ల మరమ్మత్తులు మరియు మైంటెనెన్సు నిమిత్తము విద్యుత్ సరఫరా నిలిపివేయ పడుతుందని. విద్యుత్ శాఖ పొన్నూరు డి ఈ ఈ వెంకటేశ్వరరావు. పెదనందిపాడు ఏఈ మురళీకృష్ణ లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా సర్వేకల్ క్యాన్సర్ వ్యాక్సిన్

**తెనాలి టౌన్ జనవరి9(ప్రభాతవార్త):** రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంటపురం ఆధ్వర్యంలో సర్వేకల్ క్యాన్సర్ నివారణ కోసం హెచ్.పి.వి వ్యాక్సిన్ రెండు డోసులు ఉచితముగా వేయటం జరుగుతుంది.9 సంవత్సరంల నుండి 15 సంవత్సరములు లోపు ఆడపిల్లలకి రెండు డోసులు ఉచితంగా వేయబడును. 15 నుంచి 26 సంవత్సరంలోపు మహిళలకు మూడు డోసులు వెయ్యాలి, కావున ఒక డోసు వారు సొంతంగా వేయించుకోగలిగితే మిగతా రెండు డోసులు రోటరీ క్లబ్ ఉచితముగా వేయటం జరుగుతుంది. కావున పిల్లలు వారి తల్లిదండ్రులు దానిమీద అన్న అపోహలను విడనాడి పిల్లలకు వ్యాక్సిన్ వేయించి వారి జీవిత కాలాన్ని పొడిగించవలసిందిగా తెలియజేయడం జరిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం ప్రతి ఎనిమిది నిమిషములకు ఒక మహిళ ఈ సర్వేకల్ క్యాన్సర్ వల్ల దుర్మరణం పాలు అవుతున్నట్లు తెలుస్తుంది. కావున అపోహలో ఉన్న వారు మీ యొక్క ఫ్యామిలీ డాక్టర్ని అడిగి రోటరీ క్లబ్ ఆఫీస్ టూ టౌన్



పోలీస్ స్టేషన్ రోడ్ బెస్ట్ దయాగ్నస్టిక్స్ పైన ఉన్న కార్యాలయంలో అప్లికేషన్ పూర్తిచేసి వ్యాక్సిన్ వేపించుకోగలరు. అట్లానే బస్టాండింగ్ అవుట్ గేటు ఎదురుగా గల ఈ కన్వెన్షన్ ఆఫీసులో కూడా మీకు అప్లికేషన్లు అందుబాటులో ఉంటాయి. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు క్లబ్ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు ఫోన్ నెంబర్ 6281219577 అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్ ఫోన్ నెంబర్ 9849277787 సంప్రదించగలరు.అపోహలు వద్దు వ్యాక్సిన్ ముద్దు అని రోటరీ సభ్యులు తెలియజేశారు.ఈ సమావేశంలో గుమ్మడి సరోజ్ బాబు (ప్రసాద్),మల్లాది అర్జున్,ఆలపాటి కిరణ్ చౌదరి పాల్గొన్నారు.

10-1Pg5 9_10-1Pg5.qxd 09/Jan/26 10:27 PM Page 1





# ఇరాన్‌లో ఖమేనీ వ్యతిరేక నిరసనలు ఉధృతం

### పెహ్లవీ ప్రవాసంనుంచి రావాలని నిరసనకారుల నినాదాలు

### ఇంటర్నెట్ సేవలు బంద్ చేసిన సర్కార్

**టెహ్రాన్, జనవరి 9:** ఇరాన్ ప్రభుత్వంపై ఆ దేశ ప్రజలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పడిపోతున్న ఆర్థిక వ్యవస్థ, ఆకాశాన్ని తాకుతున్న ధరలు, నిరుద్యోగంతో విసిగిపోయిన ప్రజలు సర్వోన్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ నాయకత్వంలోని ఇస్లామిక్ పాలనకు వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చారు. గత మూడు సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా టెహ్రాన్ వీధులు నిరసనకారులతో కిక్కిరిసిపోయాయి. నిరసనలు ఉధృతం కావడంతో అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఆందోళనకారులు ఒకరితో ఒకరు కనెక్ట్ కాకుండా ఉండేందుకు దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేసింది. అంతర్జాతీయ టెలిఫోన్ కాల్స్, ల్యాండ్‌లైన్ సేవలు కూడా పనిచేయడం లేదు. గతంలో ఇలా ఇంటర్నెట్ ఆపివేసిన ప్రతిసారీ ప్రభుత్వం భారీ స్థాయిలో హింసాత్మక అణచివేతకు పాల్పడిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ప్రవాసంలో ఉన్న యువరాజు రెజా పహ్లవి ఇచ్చిన పిలుపుతో నిరసనలు మరింత ఊపందుకున్నాయి. టెహ్రాన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రజలు'పహ్లవి తిరిగి రావాలి ఇస్లామిక్ రిపబ్లిక్ నశించాలిఅంటూ నినాదాలు చేశారు. 1979 విప్లవానికి ముందున్న రాచరికాన్ని గుర్తు చేసుకుంటూ ప్రజలు నినదించడం ప్రభుత్వంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతకు అద్దం పడుతోంది. ఇప్పటివరకు జరిగిన హింసలో 42 మంది మరణించగా, 2,270 మందికి పైగా నిరసనకారులను భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. శాంతియుత నిరసనకారులను చంపితే ఊరుకోబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. నిరసనకారులను చంపితే ఇరాన్ నరకాన్ని చూడాల్సి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై ఇరాన్ స్పందిస్తూ విదేశీ శక్తుల ప్రోద్బలంతోనే ఈ అల్లర్లు జరుగుతున్నాయని, శత్రువులకు సహకరించే వారిపై కనికరం చూపేది లేదని ఆ దేశ ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. మరోవైపు, డ్రోన్ల సహాయంతో నిరసనకారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరిస్తోంది.

## ముందు మీ దేశంపై దృష్టి పెట్టండి

### ట్రంప్ తీరుపై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

**టెహ్రాన్, జనవరి 9:** ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చోటుచేసుకుంటున్న అల్లర్లపై ఆ దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ స్పందించారు. తమ దేశంలో ఆందోళనకారులను హెచ్చరించిన ఆయన.. విదేశీ శక్తుల చేతుల్లో కిరాయి సైనికుల్లా వ్యవహరించే వారిని సహించే ప్రసక్తే లేదన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఉద్దేశిస్తూ.. ఇతర దేశాలకు చెప్పే ముందు సొంత దేశంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇతర దేశాధ్యక్షుడిని సంతోష పెట్టేందుకు సొంత వీధులను నాశనం చేసుకుంటున్నారంటూ ఆందోళనకారులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రవాసంలో తలదాచుకున్న యువరాజు రెజా పహ్లవీ (గతంలో అమెరికా మద్దతుతో దేశాన్ని పాలించిన 'షా' వారసుడు) ఇచ్చిన పిలుపు మేరకు ఇరాన్‌లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. గురువారం మొదలైన ఈ నిరసనలు శుక్రవారం ఉదయం వరకు కొనసాగాయి. ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను ప్రభుత్వం నిలిపివేసినప్పటికీ ఆందోళనకారులు పెద్ద ఎత్తున పాల్గొనడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే స్పందించిన సుప్రీం లీడర్.. యువత ఐకతాభావంతో ఉండాలని, దేశం ఐకమత్యంగా ఉన్నప్పుడే ఎలాంటి శత్రువునైనా ఎదుర్కోవచ్చన్నారు.


## క్రిమినల్ సిండికేట్‌లా లాలూ కుటుంబం: ఢిల్లీ కోర్టు



**న్యూఢిల్లీ, జనవరి 9:** భూ కుంభకోణం కేసుపై విచారణ జరిపిన ఢిల్లీ కోర్టు ఆర్జేడీ నాయకుడు లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఐఆర్‌సిటిసి ఐఆర్‌సిటిసి కుంభకోణంలో లాలూ కుటుంబం క్రిమినల్ సిండికేట్‌లా వ్యవహరించిందని పేర్కొంది. ఈ కేసులో తమను నిర్దోషులుగా విడుదల చేయాలంటూ లాలూ కుటుంబం చేసిన పిటిషన్ ఆమోదయోగ్యం కాదని వెల్లడించింది. సిబిఐ అధికారులు దాఖలు చేసిన ఛార్జిషీట్లు, సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం లాలూ కుటుంబసభ్యులను, సహాయకులను కుట్రదారులుగా పేర్కొంది. లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య, బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి, కుమారులు తేజస్వి యాదవ్, తేజ్ ప్రతాప్ యాదవ్, కుమార్తె మిసా భారతితో సహా ఆయన కుటుంబ సభ్యులు ఉద్యోగానికి బదులుగా భూమిని స్వాధీనం చేసుకున్నట్లు బలమైన ఆధారాలు ఉన్నాయని ఢిల్లీ కోర్టు పేర్కొంది. ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌తో పాటు ఇతరులపై ఢిల్లీ కోర్టు అవినీతి నిరోధక చట్టం కింద అభియోగాలు నమోదు చేసింది. 2004-2009లో లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగాల కేటాయింపులో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి.

ఆ సమయంలో భారతీయ రైల్వేలోని వివిధ జోన్లలో అనేక మందిని గ్రూప్ డి పోస్టుల్లో నియమించారు. దీనికి బదులుగా వారి భూములను లాలూ ప్రసాద్ కుటుంబసభ్యులతో పాటు ఓ ప్రైవేట్ కంపెనీకి బదిలీ చేశారని సిబిఐ ఆరోపించింది. దీంతో మోసం, కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద ట్రయల్ కోర్టు లాలూ కుటుంబంపై అభియోగాలు మోపింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ లాలూ ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు.

## గుజరాత్‌ను 12సార్లు వణికించిన భూప్రకంపనలు



**అహ్మదాబాద్, జనవరి 9:** గుజరాత్ రాజ్‌కోట్‌ను వరుస భూకంపాలు వణికించాయి. కేవలం 24 గంటల వ్యవధిలోనే పదికిపైగా సార్లు భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత స్వల్ప స్థాయిలోనే నమోదైంది. వరుస ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సౌరాష్ట్ర ప్రాంతంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకూ దాదాపు 12 సార్లు భూమి కంపించింది. భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 2.6 నుంచి 3.8 మధ్య నమోదైంది. రాజ్‌కోట్ జిల్లాలోని మూడు తాలూకాల్లో ఈ ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు గాంధీనగర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్మోలాజికల్ రీసెర్చ్ తెలిపింది.

ఉప్లేటా, ధోరాజీ, జెట్‌పూర్ తాలూకాల్లో ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు పేర్కొంది. ఉప్లేటాకు తూర్పు ఈశాన్య దిశలో 27 నుంచి 30 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడించింది.

# ట్రేడ్ డీల్‌పై ఎడతెగని 'వార్'



- పరస్పర ప్రయోజనాలుండాలి: భారత్ - ట్రంప్‌కు మోడీ ఫోన్ చేస్తే ఓకే: యుఎస్ - గత యేడాది 8సార్లు ఫోన్ సంభాషణ - భారత్ విదేశాంగ శాఖ ఘాటుగా స్పందన - వెనిజులా చమురు భారత్‌కు సరఫరా - ట్రంప్ సర్కార్ తాజా యోచన - అందుకే రష్యా చమురుపై ఆంక్షలు - 500శాతం సుంకాల హెచ్చరికలు

**న్యూఢిల్లీ/వాషింగ్టన్, జనవరి 9:** భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించి మాటల యుద్ధం మొదలైంది. భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేయకపోవడంతోనే వాణిజ్య ఒప్పందం ఆలస్యానికి ప్రధాన కారణమని యుఎస్ వాణిజ్య శాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్ ఆరోపించారు. లుట్నిక్ ఆరోపణలను భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఖండించారు. గతేడాది మోడీ-ట్రంప్ 8 సార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారని ఆధారాలతో సహా బయటపెట్టారు. ఆ సంభాషణల్లో వాణిజ్య ఒప్పందంలోని పలు అంశాలు చర్చకు వచ్చాయని తెలిపారు. ద్వైపాక్షిక భాగస్వామ్యం బలోపేతంపైనా వారు చర్చించారన్నారు. ఇరు దేశాధినేతల మధ్య పరస్పర గౌరవంతో కూడిన స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని కూడా చెప్పారు. పరస్పర ప్రయోజనకరంగా ఉండే వాణిజ్య ఒప్పందాన్ని అమెరికాతో కుదుర్చుకునేందుకు భారత్ సిద్ధమని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పునరుద్ఘాటించారు. దీనిపై గతేడాది ఫిబ్రవరి 13 నుంచి ఇరుదేశాలు చర్చలు జరుపుతున్నాయని, కొన్నిసార్లు ఒప్పందం ఖరారు దశ దాకా చేరామని ఆయన తెలిపారు. ఈ చర్చలకు తప్పుడు వ్యాఖ్యానాన్ని జోడిస్తూ దుష్ప్రచారం జరిగిందన్నారు. శుక్రవారం రోజు ఢిల్లీలో భారత విదేశాంగ శాఖ వారాంతపు మీడియా సమావేశంలో ఈ వివరాలను రణధీర్ జైస్వాల్ చెప్పారు. సమతూకంగా, పరస్పర ప్రయోజనకరంగా ఉండే వాణిజ్య ఒప్పందం కోసం గత ఏడాది కాలంగా వివిధ విడతల్లో అమెరికా, భారత్ సంప్రదింపులు జరుపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దీర్ఘకాలిక అనుబంధాన్ని కలిగిన భారత్, అమెరికా ఆర్థిక వ్యవస్థల మధ్య వీలైనంత త్వరగా ట్రేడ్ డీల్ జరగాలని కోరుకుంటున్నట్లు రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా అదనపు ఆంక్షలు విధించే బిల్లుపై తమకు అవగాహన ఉందని, ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపారు.

### మోడీ మౌనం వల్లే వాణిజ్య ఒప్పందం ఆలస్యం: లుట్నిక్

భారత్-అమెరికా ట్రేడ్ డీల్ చర్చల వేళ అగ్రరాజ్య వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కార్యరూపం దాల్చకపోవడానికి విధానపరమైన అడ్డంకులు కారణం కాదన్నారు. తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్రమోడీ నేరుగా మాట్లాడేందుకు నిరాకరించడమే కారణమని వెల్లడించారు. 'మామూలుగా అయితే ఒప్పందం కొలిక్కి వచ్చింది. స్పష్టంగా చెప్పాలంటే.. ఇది ఆయన (ట్రంప్) ఒప్పందం. దానికి ముగింపు రావాలంటే.. ట్రంప్‌కు మోడీ కాల్ చేయాల్సి ఉంది. అయితే ఇది భారత ప్రభుత్వానికి రుచించలేదు. మోడీ చివరకు ఫోన్ చేయలేదు. మేము ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, వియత్నాంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నాం. భారత్‌తో వాటికంటే ముందే ఒప్పందం జరుగుతుందని ఊహించాం. అలా జరగకపోవడంతో ఇంతకుముందు అంగీకరించిన వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా వెనక్కి తీసుకుంది. దానిపై ఇప్పుడు మేం ఆలోచించడం లేదు. బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం చర్చలు కొలిక్కి వస్తోన్న సమయంలో ఆ దేశ ప్రధాని కీర్‌స్టార్మర్ ట్రంప్‌నకు కాల్ చేశారు.

ఆ రోజే డీల్ ముగింపునకు వచ్చింది. తర్వాతి రోజు మీడియా సమావేశంలో దాని గురించి ఇరువురు నేతలు ప్రకటించారు' అంటూ భారత్, బ్రిటన్ మధ్య పోలిక తెచ్చారు.

మోడీ ఫోన్ చేయడానికి నిరాకరించినప్పటికీ.. ఇంకా ఫోన్ చేయడానికి అవకాశం ఉందని లుట్నిక్ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

### భారత్‌కు వెనిజులా చమురు!

రష్యా నుంచి చమురు కొనుగోలు తగ్గించుకోవాలని భారత్‌పై అమెరికా ఒత్తిడి తీసుకువస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌కు వెనిజులా చమురు విక్రయించడానికి ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది. అమెరికా నియంత్రణలో ఉన్న కొత్త చట్టం కింద భారత్‌కు చమురును విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వైట్‌హౌస్ అధికార వర్గాలు వెల్లడించాయి. వెనిజులా నుంచి అమెరికాకు 30-50 మిలియన్ బ్యారెళ్ల చమురును అప్పగించనున్న నేపథ్యంలో దానిని ప్రపంచ దేశాలకు విక్రయించాలని అమెరికా యోచిస్తోందని.. అందులోభాగంగా భారత్‌కు కూడా చమురును అమ్మడానికి సిద్ధంగా ఉందని తెలిపాయి. వెనిజులా చమురుపై యుఎస్ రిఫైనరీలే కాకుండా ప్రపంచ దేశాలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయని పేర్కొన్నాయి. వెనిజులాలోని తాత్కాలిక అధికారులు అధిక నాణ్యత గత 30-50 మిలియన్ బ్యారెళ్ల చమురును యుఎస్‌కు అప్పగించనున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ వార్తలు రావడం గమనార్హం. వెనిజులా నుంచి సేకరించిన చమురును మార్కెట్ ధరకే విక్రయిస్తామని.. ఆ డబ్బు తమ నియంత్రణలోనే ఉంటుందని ఆయన తెలిపారు. ఆ డబ్బును వెనిజులా, అమెరికా ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగిస్తామన్నారు. ఈ ప్రణాళికను తక్షణమే అమలు చేయాలని ఇంధన కార్యదర్శి క్రిస్ రైట్‌కు తాను ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చమురు నిల్వలను నౌకల ద్వారా రవాణా చేసి.. నేరుగా అమెరికా ఓడరేవులలో దించనున్నట్లు వెల్లడించారు.

# 'ఐప్యాక్' ఆఫీస్‌లో ఇడి సోదాలు - సిఎం మమత మెగా ర్యాలీ

**కోల్‌కతా, జనవరి 9:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ శుక్రవారం భారీ స్థాయిలో ఆందోళనను చేపట్టారు. ఆమె నాయకత్వంలో జరిగిన ఈ మెగా ర్యాలీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోల్‌కతాలో ఐప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ సహా ఆ సంస్థ కార్యాలయాలపై నిన్న ఇడి దాడులను నిరసిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా కార్యాలయం బయట తృణమూల్ ఎంపిలు ఇప్పటికే నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ ప్రాంతంలో ఉన్న ఐ ప్యాక్ కార్యాలయంలో ఢిల్లీ లోని నాలుగుచోట్ల ఇడి సోదాలు చేసింది. కొన్ని హవాలా లావాదేవీలు, నగదు వ్యవహారాలు ప్రతీక్ జైన్ ద్వారా జరిగినట్లు నిర్దిష్ట ఆధారాలు ఉన్నాయని ఇడి చెబుతోంది. బొగ్గు స్మగ్లింగ్ రాకెట్‌తో సంబంధం ఉన్న ఒక హవాలా ఆపరేటర్ ద్వారా ఐప్యాక్‌కు చెందిన ఇండియన్ పిఎసి కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.కోట్లలో లావాదేవీలు జరిగాయని ఇడి వర్గాలు వెల్లడించాయి. సోదాల గురించి తెలిసిన వెంటనే జైన్ నివాసానికి మమత హుటాహుటిన చేరుకున్నారు. రాజకీయ దురుద్దేశంతోనే ఈ సోదాలు జరిగాయని, ఇవి రాజ్యాంగ విరుద్ధమని దీదీ మండిపడ్డారు. మా పార్టీ పత్రాలను, హార్డ్‌డిస్క్‌లను ఇడి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల సమాచారం కూడా ఉంది. అందుకే వాటిని నేను వెనక్కి తెచ్చేశాను అని మమత తెలిపారు. అయితే చట్టపరమైన దర్యాప్తును మమత అడ్డుకున్నారని, ఆమెతో కలిసి రాష్ట్ర పోలీసులు కీలక ఆధారాలను బలవంతంగా తీసుకుపోయారని ఢిల్లీలోని ఇడి కార్యాలయం ఆరోపించింది. ఈ పరిణామాలపై ఇరు వర్గాలు కోర్టును ఆశ్రయించాయి. ఈ వ్యవహారంలో తక్షణ విచారణ చేపట్టాలని కోల్‌కతా హైకోర్టును ఇడి కోరింది. అయితే దీనిపై న్యాయస్థానం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. చట్టబద్ధమైన పాలనకు బెంగాల్ అతీతమని మమత చూపించే ప్రయత్నం చేస్తున్నారని బిజెపి విమర్శించింది.



ప్రతి ఎన్నిక ముందు ఆమె ఇలాంటి డ్రామాలే చేస్తుంటారని ఎద్దేవా చేసింది. ఈ ర్యాలీని ముందే ఊహించామని పేర్కొంది.

## అమిత్‌షా ఆఫీసు ముందు టిఎంసి ఎంపిల ధర్నా



**న్యూఢిల్లీ, జనవరి 9:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా కార్యాలయం ఎదుట తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు నిరసనకు దిగారు. మహువా మొయిత్రా, శతాబ్ది రాయ్, కీర్తి ఆజాద్, డెరెక్ ఓబ్రియన్ తదితరులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిర్వహించిన సోదాలకు వ్యతిరేకంగా ఈ నిరసన చేపట్టారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈడీని ఆయుధంగా మారుస్తోందని తృణమూల్ నేతలు ఈ సందర్భంగా ఆరోపించారు. బెంగాల్‌లో ఓటమిని జీర్ణించుకోలేకే బీజేపీ ఇటువంటి సోదాలు చేయిస్తోందని విమర్శించారు. అమిత్ షా ఆదేశాల మేరకే ఈడీ పనిచేస్తోందని నినాదాలు చేశారు. నిరసన ఉద్ధృతంగా మారడంతో పోలీసులు ఎంపీలను అక్కడి నుంచి బలవంతంగా తరలించారు. తాము పూర్తిగా శాంతియుతంగా ఆందోళన చేపట్టామని, అయినా పోలీసుల తీరు దురుసుగా ఉందని మహువా మొయిత్రా, డెరెక్ ఓబ్రియన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసనలకు కూడా చోటు లేకుండా చేస్తున్నారని వారు అన్నారు. ఈ పరిణామాలపై తృణమూల్ నేత అభిషేక్ బెనర్జీ ఎక్స్ వేదికగా స్పందించారు. నేరగాళ్లకు రివార్డులు, అత్యాచార నిందితులకు బెయిల్ ఇస్తూ, నిరసన వ్యక్తం చేసిన వారిని జైలుకు పంపే విధానం బీజేపీ పాలనలో కొనసాగుతోందని విమర్శించారు. దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుతూ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలను బెంగాల్ ప్రజలు అంగీకరించరని, బీజేపీని ఓడించేందుకు తాము శక్తిమేర కృషి చేస్తామని ఆయన అన్నారు.

## వాతావరణ మార్పులతో వేడెక్కుతున్న మహాసముద్రాలు

**న్యూయార్కు, జనవరి 9:** వాతావరణ కాలుష్యంలో సంభవిస్తున్న పెను మార్పుల కారణంగా ప్రపంచదేశాల చుట్టూ ఉన్న మహాసముద్రాలు గత ఏడాది రికార్డు స్థాయిలో వేడెక్కాయి. ఆధునిక పద్ధతుల్లో రికార్డులను నమోదు చేయడం ప్రారంభించినప్పటి నుంచి ఇదే అత్యధికమని శుక్రవారం విడుదలైన ఒక అంతర్జాతీయ అధ్యయనం వెల్లడించింది. అడ్వాన్సెస్ ఇన్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఈ నివేదిక, సముద్ర గర్భంలో పెరిగిన ఉష్ణం పెను ప్రమాదాలకు సంకేతమని హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా 31 పరిశోధనా సంస్థలకు చెందిన 50 మందికి పైగా శాస్త్రవేత్తలు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. వారి విశ్లేషణ ప్రకారం గతేడాది సముద్రాలు గ్రహించిన ఉష్ణం ఏకంగా 23 జెట్టా జౌల్స్‌గా నమోదైంది. 2023 వరకు 37 ఏళ్ల పాటు ప్రపంచం వినియోగించిన విద్యుచ్ఛక్తితో సమానం. సముద్ర ఉపరితలం నుంచి 2,000 మీటర్ల లోతు వరకు ఉష్ణోగ్రతలు చరిత్రలో ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరాయని పరిశోధకులు నిర్ధారించారు. ముఖ్యంగా అట్లాంటిక్, నార్త్ పసిఫిక్, దక్షిణ మహాసముద్ర ప్రాంతాల్లో ఈ వేడి అత్యంత వేగంగా పెరిగింది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత 2025లో మూడో అత్యధికంగా నమోదైంది. ఈ అధిక ఉష్ణోగ్రతలు భూమిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సముద్రపు నీరు ఎక్కువగా ఆవిరై, వాతావరణంలో తేమ పెరగడానికి ఇది కారణమవుతోంది. దీని ఫలితంగా ఆగ్నేయాసియా, మెక్సికోలలో భారీ వరదలు, మధ్యప్రాచ్యంలో తీవ్ర కరవు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయని శాస్త్రవేత్తలు తెలిపారు. సముద్రాలు ఇలా వేడెక్కడం వల్ల నీరు వ్యాకోచించి సముద్ర మట్టాలు పెరుగుతాయని, తుపానులు మరింత బలపడతాయని వారు హెచ్చరించారు. భూమిపై వేడి తగ్గేంత వరకు సముద్ర ఉష్ణోగ్రతలు ఇలాగే రికార్డులు సృష్టిస్తూనే ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# సంక్షిప్తంగా..

## ఊగిసలాడుతోన్న విదేశాంగ విధానం : ఖర్గే



**న్యూఢిల్లీ, జనవరి 9:** ప్రధాని నరేంద్రమోడీ సర్కారు విదేశాంగ విధానం ఊగిసలాడుతోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. విదేశాంగ విధానంలో స్థిరత్వం లేకపోవడం వల్ల దేశ ప్రజలు మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోందని ఆయన మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం చైనా కంపెనీలు బిడ్స్ దాఖలు చేయకుండా ఐదేళ్ల క్రితం అమలులోకి తెచ్చిన పరిమితులను తొలగించాలనే కేంద్రం యోచనను ఖర్గే తప్పుపట్టారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ వేదికగా ఓ ట్వీట్ చేశారు. 'దేశాన్ని తలవంచనివ్వను' అని ప్రధాని మోడీ చెప్పగా, ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా కనిపిస్తోందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. రెండు తాజా ఉదాహరణలను చూస్తే, చైనా కంపెనీలకు భారత ప్రభుత్వ కాంట్రాక్టుల కేటాయింపుపై ఐదేళ్లుగా ఉన్న నిషేధాన్ని ఎత్తివేసే యత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## శబరిమల ఆలయ ప్రధాన పూజారి అరెస్టు



**తిరువనంతపురం, జనవరి 9:** శబరిమల బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. శబరిమల తంత్రి కందరారు రాజీవరును సిట్ అధికారులు అరెస్టు చేశారు. అధికారిక వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో సిట్ అధికారుల బృందం ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్‌పొట్టితో రాజీవరుకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన సిట్ అధికారులు బంగారు తాపడాల చోరీ కేసులో ఆయన పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలడంతో అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఉన్ని కృష్ణన్ పొట్టిని శబరిమలకు తీసుకువచ్చింది కూడా తంత్రి కందరారు రాజీవరేనని ఇతర నిందితులు తమ వాంగ్మూలంలో పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు.

## బ్రిటన్ బయలుదేరిన విమానాలు దారిమళ్లింపు

**న్యూఢిల్లీ, జనవరి 9:** బ్రిటన్ బయలుదేరిన రెండు ఎయిర్ ఇండియా విమానాలు దారి మళ్లాయి. ప్రతికూల వాతావరణం కారణంగా బ్రిటన్‌లోని వేర్వేరు ఎయిర్‌పోర్టుల్లో అవి ల్యాండ్ అయ్యాయి. ఎయిర్ ఇండియా సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. గతేడాది డిసెంబరు 8న ముంబై నుంచి లండన్‌లోని హీత్రూకు ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. ప్రతికూల వాతావరణం కారణంగా హీత్రూ ఎయిర్‌పోర్ట్‌పై ఆ విమానం చక్కర్లు కొట్టింది. చివరకు ఆ విమానం దారి మళ్లింది. లండన్‌లోని గాట్విక్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. అదే రోజున పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌కు మరో ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా బర్మింగ్‌హామ్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ కాలేకపోయింది. గాలిలో రౌండ్లు కొట్టిన ఆ విమానాన్ని చివరకు లండన్‌లోని హీత్రూకు మళ్లించారు. ఆ ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఆ రెండు విమానాలు గమ్యస్థానాలు మారినట్లు ఎయిర్ ఇండియా పేర్కొంది.

## పశ్చిమ బెంగాల్ గవర్నర్‌కు బెదిరింపులు



**కోల్‌కతా, జనవరి 9:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రైడ్స్‌పై హై డ్రామా తర్వాత పశ్చిమ బెంగాల్ గవర్నవర్ సీవీ ఆనంద బోస్‌కు బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. ఆయనను పేల్చివేస్తామని అందులో బెదిరించారు. దీంతో గవర్నర్ కార్యాలయం, అధికారిక నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. గవర్నర్ బోస్‌కు వచ్చిన బెదిరింపు ఈమెయిల్ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలోని హోం మంత్రిత్వ శాఖకు సమాచారం అందించారు. బొగ్గు అక్రమ రవాణా కేసుకు సంబంధించి అధికార టీఎంసీ రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐ ప్యాక్ కార్యాలయంపై ఈడీ అధికారులు గురువారం రైడ్ చేశారు. దీంతో టీఎంసీ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. సీఎం మమతా బెనర్జీ వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఆమె పార్టీకి సంబంధించిన కీలక ఫైల్‌ను తీసుకెళ్లారు. తమ రాజకీయ వ్యూహాలను కొల్లగొట్టేందుకు బీజేపీ ప్రయత్నించినట్లు మమతా బెనర్జీ ఆరోపించారు.

## నెహ్రూ అంటే ఎంతో గౌరవం..ఆయన విధానాలు పూర్తిగా ఏకీభవించలేను:కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్

**తిరువనంతపురం, జనవరి 9:** భారత తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలంగా నాటారని చెప్పిన కాంగ్రెస్ సీనియర్‌నేత శశిథరూర్ ఆయన విధానాలని గుడ్డిగా సమర్థించనని వ్యాఖ్యానించారు. కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. నెహ్రూ తీసుకున్న నిర్ణయాలు ప్రశంసలకు అర్హమైనవని పేర్కొన్నారు. 1962లో చైనా విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయాల్లో తప్పులు ఉన్నాయన్నారు. దాని సాకుగా బీజేపీ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఆయన పేరును దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. దేశంలోని సమస్యలన్నింటికీ ఆయనను మాత్రమే నిందించడం అన్యాయమని పేర్కొన్నారు. సమస్య ఏదైనా.. ప్రతిదానికీ నెహ్రూ పైనే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. నేను నెహ్రూ అభిమానిని. ఆయన్ని ఆరాధిస్తాను. ఆయన పట్ల నాకు చాలా గౌరవం ఉంది. అలా అని ఆయన నమ్మకాలు, విధానాలన్నింటినీ నేను వంద శాతం సమర్థించను. నెహ్రూ తీసుకున్న నిర్ణయాలు ప్రశంసలకు అర్హమైనవే. ముఖ్యంగా భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని చాలా దృఢంగా నెలకొల్పారు. అలా అని వారు మోదీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రజాస్వామ్య వ్యతిరేకులని నేను అనను. వారు ఖచ్చితంగా నెహ్రూ వ్యతిరేకులు. తమకు అను కూలంగా ఆయన పేరును దుర్వినియోగం చేస్తున్నారు.

# తెదేపా కార్యాలయంలో గ్రీవెన్స్

**తెనాలి మున్సిపాలిటీ జనవరి9(ప్రభాతవార్త):** శాసనమండలి సభ్యులు, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సూచనల మేరకు, శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో,పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మహమ్మద్ కుదూస్,రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షులు కుద్దూస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం,ప్రతి శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించే ప్రజాదర్బార్ గ్రీవెన్స్ కార్యక్రమం, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అనివార్య కారణాలవల్ల రాలేకపోయినందున స్థానిక పార్టీ నాయకులే అర్జీలు స్వీకరిస్తున్నామని ఈరోజు కార్యక్రమంలో 12 అర్జీలు వచ్చినట్లు ఆయన



తెలిపారు. ప్రధానంగా చెంచుపేటలోని ఓ అపార్ట్మెంట్లో సుమారు 15 సంవత్సరముల నుండి సెల్లార్ గా ఉన్న ప్రాంతాన్ని వ్యాపార సముదాయంగా మార్చటం గురించి అలాగే పెదరావూరులోని ఒక వృద్ధురాలు తన కుమారులు ఆస్తిని అమ్ముకొనివ్వట్లేదని అమ్ముకుంటానికి అడ్డుపడుతున్నారని అలాగే కొలకలూరు గ్రామం నుండి ఇంజనీరింగ్ చదివి ఉన్నత విద్యకై హైదరాబాద్ వెళ్లి అనారోగ్య కారణంగా చికిత్స తీసుకునే క్రమంలో అక్కడి వైద్యులు చేసిన పొరపాటు వల్ల తమ బిడ్డ ప్రాణం కోల్పోయాడని హైదరాబాదులో కేసు పెట్టి నా కూడా అక్కడి పోలీసులు పట్టించుకోవటం లేదని కావున మాయందు దయవుంచి మా బిడ్డ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేకూర్చాలని కోరుతూ వచ్చిన వినతిపత్రం అలాగే పలువురు ఇంటి స్థలాల గురించి రేషన్ కార్డుల గురించి పెన్షన్ల పంపిణీ గురించి పలు అర్జీలు వచ్చినట్లు వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కుద్దూస్ తెలిపారు అంతేకాకుండా ప్రతి శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఎవరైనా సమస్యలతో బాధపడేవారు అర్జీలు సమర్పించి పార్టీ కార్యాలయంలో సమస్యలు తెలిపి తే కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

# ఏఐ- క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఎంబిఏ హెచ్‌ఏలో నేషనల్ వర్క్‌షాప్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి7, (ప్రభాతవార్త):** ఏఎన్‌యులోని ఎంబిఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీలలో ఎన్‌హెచ్ 6వ ఎడిషన్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అండ్ క్వాంటమ్ కంప్యూటింగ్ ఎరా అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య బట్టు నాగరాజు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు ఆవిష్కరించారు. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథులుగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండి, చీఫ్ కార్డియాలజిస్ట్ డా.పోతినేని రమేష్, ప్రత్యేక అతిథులుగా డిప్యూటీ ఎండి డా.రాయపాటి మమత, ఎయిమ్స్ డీన్ ప్రొఫెసర్ దేసు రామమోహన్‌లు హాజరుకానున్నారు. అనంతరం వీసి, రిజిస్ట్రార్‌లు విద్యార్థులతో విద్యా విషయక అంశాలపై చర్చించారు. వారు



మాట్లాడుతూ విభాగం దినదినాభివృద్ధి చెందుతోందని, విభాగం నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థుల ఉన్నతికి దోహదపడతాయని పేర్కొన్నారు. హెల్త్‌కేర్ క్వాలిటీ ప్రొఫెషనల్స్ దినోత్సవం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.శ్రీనివాసరావు, జి.డేవిడ్‌రాజు, డాక్టర్ చుండి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రియదర్శినిలో అంగరంగ వైభవంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 9, ప్రభాతవార్త:** మండలంలోని కుర్నూతుల ఐదో మైలు వద్దనున్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కళాశాల చైర్మన్ చందు రామారావు, సెక్రటరీ చందు విజయలక్ష్మి, వైస్ చైర్మన్ చందు రోహిత్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ..ముందుగా అందరికీ ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు





తెలియజేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గురించి భావితరాలకు తెలియజేయడం ఎంతో అవసరం ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ కుల,మతాలకు అతీతంగా ఉండాలని సూచించారు. ప్రతి సంవత్సరం మా కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. అలాగే భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే రంగవల్లి పోటీలు , హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. వివిధ అంశాల్లో గెలుపొందిన వారికి బహుమతులు కూడా అందజేస్తామని తెలియజేశారు. ఈ సంబరాలతో తెలుగు సంప్రదాయాన్ని భావితరాలకు అందించ గలుగుతామని ఇటువంటి వాటిని మనం ఎన్నటికీ మరువకూడదని వివరించారు. బొంగరాల ఆటలు గాలిపటాలు ఎగురవేయడం తడాట వంటివి తెలుగు సాంప్రదాయాన్ని పునరుజీవింపజేశాయని పేర్కొన్నారు. గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే వేషధారణలతో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు, భోగిమంటలు, సోది వేడుకలు, హరిదాసుల కీర్తనలు, బసవన్నలనుత్యాలు, విద్యార్థి నీలా కోలాటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో కళాశాల యాజమాన్యం, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డివివిఎస్ ఫణి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.కిరణ్ కుమార్, డైరెక్టర్ సిహెచ్. రవికుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. బాబురావు, వివిధ శాఖల హెచ్ఓడిలు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలకు పోషకాహారం పంపిణీ

**అమరావతి జనవరి 9 ప్రభాతవార్త.** పెదకూరపాడు దూర ప్రాంతాల నుండి వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే గర్భిణీలు ఇబ్బంది పడకూడదనే పాల్గొనేందుకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. అమరావతి సామాజిక ఆరోగ్య కేంద్రం(సిహెచ్సి) గైనకాలజిస్ట్ డాక్టర్ మన్యం వీరాంజ



మంచి ఉద్దేశంతో గర్భిణీలకు పోషకారాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలిచిన జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు(ఎంఎస్ఎంఈ డిసి) రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గుడిపూడి చిన్నరాజు అన్నారు.ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, మండల కేంద్రమైన అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎం ఎస్ ఎం ఇ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గుడిపూడి చిన్నరాజు సహకారంతో వివిధ గ్రామాల నుండి ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణీలకు శుక్రవారం పోషకాహారాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ చినరాజు మాట్లాడుతూ గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తూ ఆదర్శంగా నిలిచిన జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో నేయులు మాట్లాడుతూ గర్భిణీలు తీసుకోవాల్సిన పోషకాహారాన్ని జన చైతన్య సమితి ప్రతినిధులు అందిస్తున్నారని గర్భిణీలు కూడా అలాంటి పోషకాహారం ఇంటి వద్ద కూడా తీసుకొని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వలన్నారు. ఈకార్యక్రమంలో జనచైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ వివిధ గ్రామాల నుండి వచ్చేటువంటి గర్భిణీలు ఆకలితో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రతి నెల 9వ తేదీ పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్నమన్నారు.ఈ కార్యక్రమంలో బుచ్చయ్య పాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు,ఆడవాళ్ళ ఆకుల సంఘం కోఆర్డినేటర్ తుండు లక్ష్మణ్, జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు, కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ ప్రతినిధులు చెన్నంశెట్టి బాజి,మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సుమేధలో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

**గుంటూరు విద్య జనవరి 8 ప్రభాతవార్త :** గుంటూరు ఏటి అగ్రహారం లోని సుమేధ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత న్యూ ఇండియా



ఇన్సూరెన్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ కంభంపాటి గోపాలకృష్ణ హాజరయ్యారు. భోగిమంటలను కర్పూరహారతతో వెలిగించి పిల్లలందరికీ భోగి పళ్ళు పోసి ఆరంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వివిధ బొమ్మలను ఏర్పాటు చేశారు. రకరకాల ముగ్గులు వేసి పాఠశాల ఆవరణానికి సంక్రాంతి శోభను తెచ్చారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల తోరణాలతో అలంకరించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి అంటే తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతీక అన్నారు. పండగ విశిష్టతను ప్రతి ఒక్కరు తెలుసుకోవడంతోపాటు వాటిని ఆచరించాలని తెలిపారు. విద్యార్థులు ఆటపాటలతో సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులకు మిఠాయిలను పంచిపెట్టారు. కీ చైన్లను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంబాబు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆశాంతం సంక్రాంతి శోభతో నిండిపోయింది.

# పిఏయస్ కళాశాలలో సీఈసీ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

**పెదనందిపాడు జనవరి 9 (ప్రభాతవార్త):** పెదనందిపాడు పి ఏ ఎస్ కళాశాలలో ఇంటర్ సీ.ఈ.సీ విద్యార్థుల కోసం ప్రత్యేక వీడ్కోలు వేడుక (ఫేర్వెల్ ఫంక్షన్) శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల పొలిటికల్



సైన్స్ విభాగం హెచ్.ఓ.డి శ్రీ కే. శ్రీనివాసమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వీర రాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ కె. ప్రతాప్ కుమార్, ఎన్.సి.సి ఆఫీసర్ డాక్టర్ పి. శ్రీనివాస్ తో పాటు అధ్యాపక బృందం జె.శరత్ కుమార్, డి.శ్రీనివాసరావు, సి.హెచ్ సాయి స్వాతి, టీ.గీతా లక్ష్మి,ఏ. శ్రీనివాసరావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వీర రాఘవయ్య మాట్లాడుతూ విద్యార్థులు టైమ్ విలువను తెలుసుకుని సమయాన్ని వృధా చేయకుండా కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి అన్నారు. విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండి, మంచిని అవలంబిస్తూ జీవితంలో ముందుకు సాగాలి అని తద్వారా తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించినారు. ప్రస్తుతం మనం ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఆధునిక భారతావనిలో జీవిస్తున్నాము అని ప్రతి ఒక్కరూ తమ దైనొందిన జీవితంలో కొత్త విషయాలను తెలుసుకుంటూ ముందుకు సాగాలి అని తద్వారా తమ జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకొనవచ్చునని సూచించారు. డాక్టర్ పి శ్రీనివాస్ మరియు అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులు వారి భవిష్యత్ జీవితంలో విజయాలు సాధించాలని కోరుతూ వారికి తమ శుభాశీస్సులు అందజేశారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ తమ కళాశాల జీవితంలోని అనుభవాలు, గురువులపట్ల కృతజ్ఞతలు హృదయపూర్వకంగా వ్యక్తం చేశారు. స్నేహం, జ్ఞాపకాలు పంచుకున్న ఈ మధుర క్షణాలు చిరస్మరణీయంగా నిలిచిపోయాయి. కళాశాల పరిసరాలు విద్యార్థుల చిరునగవులతో, ఉత్సాహంతో నిండిపోయింది. ది పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ తరపున పాలకవర్గ సభ్యులు ఇంటర్మీడియట్ సీఈసీ విద్యార్థులందరికీ వారి విద్యా ప్రయాణంలో విజయాలు సాధించి ఈ కళాశాలకు మంచి పేరు తేవాలని ఆశిస్తూ విద్యార్థులకు తమ శుభాకాంక్షలు అందజేశారు.

# వివాలో వైభవంగా సంక్రాంతి సంబరాలు

**గుంటూరు విద్య జనవరి 9 ప్రభాతవార్త:** తెలుగుదనం ఉట్టిపడేలా గ్రామీణ నేపథ్యం ప్రతిభంబించేలా వివా ది స్కూల్ నందు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు, గొబ్బెమ్మలు, గడ్డివాములు, దాన్యపు బస్తాలతో వివా పాఠశాల ప్రాంగణం సంక్రాంతి శోభ



సంతరించుకుంది వినావివిఐటియూ సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణప్రియ, ప్రొఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్, ప్రత్యూష దంపతులు భోగి మంటలతో ఈకార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులను భోగిపండ్లతో ఆశీర్వదించారు. సాంప్రదాయ వస్త్రధారణతో అలరించిన చిన్నారులు, పల్లెసంబరాలలో భాగమైన గోపూజ, పొంగళ్ళు, పతంగులు, ఊయలలు, జోడెద్దులబండి, కోడిపందాలతో సందడి చేసారు. సంక్రాంతి ప్రాముఖ్యము తెలియపరుస్తూ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హరిదాసు కీర్తనలు, సోదెమ్మ, బసవన్న, పిట్టలదొర వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల సాంప్రదాయ నృత్యాలు, గీతాలాపనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయిఈ కార్యక్రమంలో వివా డైరెక్టర్ ఎల్టి. కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డౌనా సి, హెచ్ సరళ. వివా గుంటూరు క్యాంపస్ హెడ్ మమిళ్లపల్లి వేదవాణి, ఐబి సంధానకర్త మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాసర కాన్సెప్ట్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

**గుంటూరు విద్య జనవరి 9 ప్రభాతవార్త:** గుంటూరు నల్లపాడు బాసర కాన్సెప్ట్ స్కూల్ నందు సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా



నిర్వహించారు. బాసర విద్యాసంస్థల చైర్మన్ సాదినేని మురళీమోహన్ రావు మాట్లాడుతూ సంక్రాంతి సాంప్రదాయాలు ఈతరం విద్యార్థిని విద్యార్థులకు కళ్ళకి కట్టినట్టుగా నిర్వహించామన్నారు. స్కూల్ ఆవరణలో భోగి మంటలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దు ఆటల విన్యాసాలు, తెలుగింటి వస్త్రధారణలు, రంగురంగుల రంగవల్లులు, కోడిపందాల కార్యక్రమాలు నిర్వహించి. భోగిమంటల చుట్టు పాటలు పాడుతూ డాన్సులు వేస్తూ ఆనందోత్సాహాలతో సంబరాలు జరిగాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సాదినేని రాదా, ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి మరి ఉపాధ్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

# 128 పశువులకు వైద్య పరీక్షలు

**రేపల్లె, జనవరి 9, ప్రభాతవార్త:** మండలంలోని లంకెవానిదిబ్బ గ్రామంలో శుక్రవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర యంలో శ్రీ సాయి సేవా ట్రస్ట్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.128 పశువులకు వైద్య పరీక్షలు చేశారు.ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది,పశు యజమానులు పాల్గొన్నారు.

# వణుకూరు సుబ్బారెడ్డి పెదకర్మ కార్యక్రమంలో పాల్గొన్న బలసాని

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 9, ప్రభాతవార్త :** రెడ్డి జనాభ్యుదయ మండలి కోశాధికారి, శ్రీ బాలాజీ మణికంఠ అయ్యప్ప సేవ సమితి అధ్యక్షుడు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త, గ్రామ వైసిపీ పార్టీ సీనియర్ నాయకులు




వణుకూరి సాంబిరెడ్డి మృతి చెందడం కుటుంబ సభ్యులకు, పార్టీకి తీరని లోటుని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండలం, కొత్తమల్లాయపాలెం గ్రామంలో సాంబిరెడ్డి పెద్దకర్మ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో బలసాని పాల్గొని సాంబిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంబిరెడ్డి పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. నిబద్ధత, విశ్వసనీయత, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే మంచి వ్యక్తిత్వం గలవాడని అన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. జగన్ ప్రభుత్వంలోని వైసిపి పార్టీ సాంబిరెడ్డి కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులతో కొంతసేపు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రతిపాడు మండలం వైసిపి నేతలు, కొత్త మల్లాయపాలెం గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సాంబిరెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

# వైకాపా కార్యకర్త నబీన్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

## -వైకాపా నాయకులు డిమాండ్

**పొన్నూరు, జనవరి 9,ప్రభాతవార్త:** వైకాపా కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని వైకాపా నాయకులు పిలుపునిచ్చారు. వైకాపా కార్యకర్త నబీన్‌పై టిడిపి సోషల్‌డియా అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్(జాంపండు) కిడ్నాప్, హత్యాయత్నం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. షేక్ నబీన్ వైకాపా నాయకులతో స్టేషన్‌కు కలిసి వచ్చి అర్బన్ సిఐ లావూరి వీరానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వైకాపా కార్యకర్తన షేక్ నబీన్‌పై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. నబీన్‌పై టిడిపి నాయకులు, కార్యకర్తలు అతిదారుణంగా దాడికి పాల్పడ్డారన్నారు. రాడ్లతో, కర్రలతో కొట్టి గాయపరిచారన్నారు. ఇటికంపాడు రోడ్డు నుంచి జెండా చెట్టు వరకు తీసుకొచ్చి అతి కిరాతకంగా కొట్టారన్నారు. నబీన్‌పై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయడంతోపాటు అరెస్టు



చేయని పక్షంలో ఉద్యమిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కమీషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి ఎందేటి వెంకటసుబ్బయ్య, మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, షేక్ నాజర్, షేక్ మౌలాలి, పీర్‌సాహెబ్, కాలింత రమేష్, పలగాని రమేష్, ఆకుల రామమోహన్, దేవరకొండ గోపి తదితరులున్నారు.

# ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**గుంటూరు విద్య జనవరి 9 ప్రభాతవార్త:** గాంధీనగర్ మున్సిపల్ పాఠశాలలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు :మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమికోన్నత పాఠశాల గాంధీ నగర్ నందు సంక్రాంతి సంబరాలు నిర్వహించి నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. నరసింహా రావు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు అందరూ సాంప్రదాయ దుస్తులను ధరించి, పండగ శోభను కలగజేశారు. విద్యార్థి, విద్యార్థులు భరత నాట్యం,



కృష్ణుడి వేషధారణ, హరిదాసు వేషధారణ మరియు అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో ఉల్లాసంగా ఉత్సాహంగా, పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెచ్ఎం వాణి, సీనియర్ ఉపాధ్యాయులు చెంచయ్య, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు లక్ష్మి,సయ్యద్ ఫర్హతుల్లా, జాస్మిన్, స్వాతి, శివ పార్వతి, నాగలక్ష్మి, మనోజ్ కుమార్, అర్హతుల్లా, తులసి, వెన్నెల, షాకీరా మొదలగు వారు పాల్గొన్నారు

# ప్రకృతితో మమేకమైన సమగ్రమైన జీవనశైలి ఆయుర్వేదం

**గుంటూరు కల్చరల్,జనవరి 9,ప్రభాతవార్త :** ఆయుర్వేదం కేవలం చికిత్సా విధానం కాదని అది ప్రకృతితో మమేకమైన ఒక సమగ్ర జీవనశైలి అని అవగాహన ఆరోగ్యసభ ఆధ్వర్యంలో ఆయుర్వేదంపై జరిగిన సభలో ఆయుర్వేద ప్రచారకులు మాట్లాడుతూ అన్నారు.సభలో





ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం పూర్తిగా ప్రకృతి సిద్దమైంది,సామాన్యుడికి అందుబాటులో ఉండేలా తక్కువ ఖర్చుతో కూడుకున్న వైద్యమన్నారు.ప్రముఖ ఆయుర్వేద ప్రచారకులు వి.వి.రావ్ మాట్లాడుతూ అనాదిగా రుషులు,మునులు అందించిన అద్భుత మైన ఆరోగ్య జ్ఞానసంపదను ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న మన పరంపర వైద్యులు, అనువంశికవైద్యులే నేటి ఆయుర్వేద వైద్యులన్నారు.సభలో ఆయుర్వేద అభిమానులు బసవగుప్తా,సాయిరామ్,జనార్ధనరావు,తదితరులు ప్రసంగించారు.

# ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

**భట్టిప్రోలు(రేపల్లె), జనవరి 9, ప్రభాతవార్త:** మండలంలోని గ్రామ సంఘాల సభ్యులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని ఎపిఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ చెప్పారు.శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో మండల సమాఖ్య కార్యనిర్వాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 40 గ్రామ సంఘాలలో ప్రతి నెలా విధిగా సమావేశాలు నిర్వహించాలన్నారు.అర్హత కలిగిన వారికి బ్యాంకులు,ప్రాజెక్టు ద్వారా మంజూరు చేసే రుణాలపై సభ్యులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.మండలానికి 500 పాడిగేదెలు, 200 మందికి పెరటి కోళ్ళు ఇప్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో దోవా ఝాన్సీరాణి,మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులు, యానిమేటర్లు,సిసి,ఎఫ్‌పిఓబిఓడి సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా అన్నాబత్తుని సత్యన్నారాయణ వర్థంతి

**తెనాలి మున్సిపాలిటీ జనవరి9 (ప్రభాతవార్త):** మాజీమంత్రి,ఏఎస్ఎన్ విద్యాసంస్థల అధినేత, దివంగత అన్నాబత్తుని సత్యనారాయణ 34వ వర్ధంతిని,శుక్రవారం ఆయన తనయుడు మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో, పట్టణంలోని ఏ. ఎస్.ఎన్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీమంత్రి అంబటి రాంబాబు,వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్ బాబు పాల్గొన్నారు. ముందుగా అన్నాబత్తుని సత్యనారాయణ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు కుటుంబంలో పుట్టి మున్సిపల్ కౌన్సిలర్‌గా అనంతరం మున్సిపల్ చైర్మన్ గా ప్రజాసేవలో ముందు ఉంటూ అనంతర కాలంలో తెనాలి శాసనసభ్యునిగా,రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రిగా,విలువలు కలిగిన రాజకీయ నాయకుడు అన్నాబత్తుని సత్యనారాయణ అని,రాజకీయాలలో నిబద్ధతతో పనిచేసి,అన్ని వర్గాల ప్రజల



ఆదరణతో నిరంతరం శ్రామికుని వలె, తనకు అండగా నిలిచిన ప్రజల కోసం పాటుపడే నేతగా, అన్నాబత్తుని సత్యనారాయణ ఈప్రాంత వాసులకు,ఆయన మన నుండి దూరమై 34 సంవత్సరాలు అయినా కూడా నేటికీ ప్రజలందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, నేడు ఆయన వార సత్వాన్ని అన్నా బత్తుల శివకుమార్ ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక రమేష్ దంపతులు మాజీ మున్సిపల్ చైర్మన్ పెండేలా వెంకట్రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, సాధు ప్రతాప్, పలువురు కొల్లిపర మండల సీనియర్ నాయకులు, వైసిపి సానుభూతిపరులు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫారెస్ట్రీ విభాగాన్ని సందర్శించిన ఇండోనేషియా శాస్త్రవేత్తల బృందం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి9, ప్రభాతవార్త:** ఏఎన్‌యులోని ఫారెస్ట్రీ విభాగాన్ని ఇండోనేషియాకు చెందిన నేషనల్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఏజెన్సీలోని రీసెర్చ్ సెంటర్ ఫర్ బయోమాస్ అండ్ బయోప్రొడక్ట్స్ కు చెందిన శాస్త్రవేత్తల బృందం శుక్రవారం వర్సిటీని సందర్శించారు. విద్యా ఫాత్రియాసారి, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అమరావతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ సైన్సెస్ అసోసియేట్ డీన్ డా.ఎస్.రంగభాసియంలు వీసి ఆచార్య కె.గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో వ్యర్థాల నిర్వహణ విధానాలు, బయో వ్యర్థ పదార్థాల సమర్థ వినియోగం, వాటి ద్వారా విలువైన ఉత్పత్తుల తయారీ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం వీసి సంయుక్త పరిశోధనలకు ఎంఓయు చేసుకోవాలని నిర్ణయించారు. అనంతరం విభాగాన్ని సందర్శించి విభాగాధిపతి ఆచార్యయ కె.మల్లిఖార్జునతో బోధన, పరిశోధన, ఫీల్డ్ స్టడీ, రీసెర్చ్ టూర్ వంటి అంశాలపై చర్చించారు. వరిడగ్గి వంటి వ్యవసాయ వ్యర్థాల నుండి హైడ్రోఫోబిక్ పదార్థాలను ఎలా తగ్గించవచ్చో విద్యా ఫాత్రియాసారి వివరించారు.

# చెరుకుపల్లిలో ఘనంగా అనగాని జన్మదిన వేడుకలు

చెరుకుపల్లి, జనవరి 9 ,ప్రభాతవార్త : రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రివర్యులు అనగానే సత్యప్రసాద్ జన్మదిన వేడుకలను శుక్రవారం మండల కేంద్రమైన చెరుకుపల్లిలో ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు సొంటి సుబ్బయ్య ఆధ్వర్యంలో బాపట్ల పార్లమెంటరీ పార్టీ ఆర్గనైజరీ సెక్రటరీ మల్లాది రామకృష్ణ, రాష్ట్ర బీసీ సంక్షేమ



సంఘం ఉపాధ్యక్షులు దివి రాంబాబులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు అనగాని నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ అనగానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఈఊరి దుర్గాప్రసాద్, కోటయ్య, ఆళ్ల విజయభాస్కర్, ఆరేపల్లి ఆంజనేయులు, వేము మోహన్, యేమినేని రమణ, నాగుల రామకృష్ణ, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కిట్స్‌లో సంస్కృతి,సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 9, ప్రభాతవార్త :** సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా జరుపుకునే పండగ సంక్రాంతి అని కిట్స్





ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామం వద్దనున్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ..మన సంస్కృతి, సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు చేకూర్చాల న్నదే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రతి సంవత్సరం కళాశాలలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సంబరాలు విద్యార్థులకు ఆటవిడుపుగానే కాక మన తెలుగు సంప్రదా యాన్ని భావితరాలకు అందించ గలుగుతామని, ఇటువంటి వాటిని మనం మరువకూడదని తెలియజేశారు. విద్యార్థులు, అధ్యాపకులు తెలుగు సాంప్రదాయ దుస్తులతో ఈ వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు సాంప్రదాయ ప్రతీకలైన ముగ్గులు, గొబ్బెమ్మలతో కళాశాల ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు. సాంప్రదాయ తప్పెట్లు, నాట్య ప్రదర్శనలు, విచిత్ర వేషధారణలు సంబరాల్లో ఆకర్షణగా నిలిచాయి. ముగ్గుల పోటీలు, వివిధ క్రీడా అంశాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బొంగరాల ఆటలు, గాలిపటాలు ఎగుర వేయడం, తాడాట వంటివి తెలుగు సంప్రదాయాన్ని పునర్జీవింపజేశాయి. గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే వేషధారణలతో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు, భోగి మంటలు, సోది వేడుకలు, ప్రత్యేక నృత్యాలు, పరికిణీలు, హరిదాసుల కీర్తనలు, బసవన్నల నృత్యాలు, విద్యార్థినిల కోలాటాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమాన్ని కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అత్యంత కోలాహలంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డా.పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డా.కె.హరిబాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి

**కొల్లిపర,జనవరి9,ప్రభాతవార్త:** ఆరోగ్యవంతమైన బిడ్డ జన్మకు అవసరమైన పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి నేహ రెడ్డి



చెప్పారు.శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శరణ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు నంబూరు ఫణి దాతృత్వాన్ని ప్రశంసించారు.గ్రామంలోని 45 మంది గర్భిణులు,బాలింతలకు పోషకాహార ప్యాకెట్లు (మదర్స్ ప్లేస్,ఉమెన్ హార్లిక్స్), చిన్నారులకు పాలపొడి ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో విజయలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, సంస్థ నిర్వాహకులు బి.మనోహర్,కె.లలిత్,కె.సుధీర్ పాల్గొన్నారు.

# తరతరాల త్యాగం అర్చకత్వం

## అర్చకులు అనుభవిస్తున్న సమస్యలు వర్ణనాతీతం

**కొల్లిపర, జనవరి 9, ప్రభాతవార్త:** అర్చకత్వం అంటేనే విరామం లేని సేవ.కనిపించని త్యాగం.మౌన ఆరోగ్య పోరాటం.ఈ ప్రపంచంలో వాస్తవంగా సెలవులే లేని వృత్తులు చాలా తక్కువ.అటువంటి అరుదైన నిరంతర త్యాగంతో సాగే వృత్తులలో అర్చకత్వం ఒకటి.ఇది ఉద్యోగం కాదు.ఇది ఒక జీవన విధానం.ఒక తపస్సు.అర్చకుని విధి రోజూ గడయారంతో కాదు.దేవుడి కాలంతో మొదలవుతుంది.తెల్లవారు జామున లేచి ఇంట్లో కాలకృత్యాలు తీర్చుకుని గుడికి చేరుకుని ముందుగా గర్భగుడిని ఊడ్చి శుభ్రపరిచి దీపాలు వెలిగించి స్వామి వారిని మేల్కొలిపి అర్చనతో ప్రారంభిస్తారు.అక్కడితో ఆగకుండా అభిషేకాలు,అలంకారాలు,మహా నైవేద్యం,దర్శనాలు బాధ్యతగా చేయాల్సిందే. సాధారణ రోజుల్లోనే ఇవన్నీ పూర్తయ్యేసరికి మధ్యాహ్నం సమయం 1 గంట దాటిపోతుంది. ఇక ప్రత్యేక పర్వదినాల సమయంలో అయితే విశేష ఉత్సవాలు,బ్రహ్మోత్సవాలు, కళ్యాణోత్సవాల నిర్వహణలో భోజనం,నిద్రకు సమయం ఉండదు.ధనుర్మాసం,కార్తీక మాసం అయితే ఆ సేవ మరింత కఠినంగా మారుతోంది. భక్తులు ఎడతెరిపి లేకుండా వస్తూనేవుంటారు. అర్చకుడికి మాత్రం విశ్రాంతి అనే మాట ఉండదు.అత్యవసర పరిస్థితిలో ఊరు వెళ్ళాల్సి వస్తే ఫోన్ ఓపెన్ చేసి కనీసం 15 మందికి కాల్ చేయాల్సిందే.14 మంది కుదరదు అన్నాక ఒక్కడు మాత్రమే అన్నా నువ్వు వెళ్ళిరా రేపు అర్చన నేను చూసుకుంటా అని చెప్పినప్పుడు ఆ అర్చ కుడిలో వచ్చే ఆనందం డబ్బుతో కొలవ లేనిది.పెద్ద దేవా లయాలలో ప్రత్యామ్నాయ అర్చకులు ఉంటారు.చిన్న దేవాల యాలలో మధ్యస్థ దేవాలయాలలో ఒకే ఒక్క అర్చకుడు ఉన్న దేవాలయాలలో ఆ ఒంటరి తనం,ఆ బాధ నిజంగా వర్ణనాతీతం.దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న దేవాలయాలలో సెలవులు కూడా అధికారుల అనుమతుల మీదే.సేవ చేయాలన్నా మనసు ఉన్నా స్వేచ్ఛ ఉండదు. ఎవరైనా ఫంక్షన్‌కు పిలిస్తే ఆనందం కాదు.భయ మేస్తుంది.ముహూర్తం వేళ గుడిలో అర్చనకి ఎవరు ఉంటారు.వెళ్ళకపోతే ఏమనుకుంటారో. ఇక మన ఇంటి శుభకార్యాలయాలకు పిలవడం మానేస్తారేమో అనే భావన కలుగుతుంది. ప్రత్యామ్నాయ అర్చకుడు దొరకక వెళ్ళలేక వదిలేసిన పెళ్ళిళ్ళు,శుభకార్యాలు పదుల్లో కాదు. వందల్లో ఉంటాయి.వాడు అంతేలే పిలిచినా రాడు అనే నిష్ఠూరాలే ఎక్కువ.మౌనంగా భరిస్తూ బాధపడుతూ వుంటారు.ఇంకా హృదయాన్ని పిండేసే విషయం.ఇంటిపేరు వాళ్ళు,చిన్నప్పటి నుంచి తెలిసినవాళ్ళు చనిపోతే కూడా వాడు ఒక్కడే గుడి చేసుకుంటున్నాడు, కార్తీక మాసం,ధనుర్మాసం అని చెప్పి మొత్తం కార్యక్రమాలన్నీ అయిపోయాక పదో రోజు ఫోన్ చేసి బాబూ రేపు తలస్నానం చేయి అనే పరిస్థితిని



అర్చకులు ఎదుర్కొంటు న్నారు.నిన్ను ఎత్తుకుని పెంచినవాడు చనిపోతే కనీసం ఆఖరి చూపు కూడా చూడలేకపోవడం అర్చకుడి జీవితంలో మాటల్లో చెప్పలేని బాధ.ఇంత సేవ చేస్తూనే ఎక్కువసేపు గర్భగుడిలో ఉండడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు చాలా తీవ్రమైనవి. కానీ వాటి గురించి ఎవ్వరూ మాట్లాడరు.గాలి ప్రసరణ లేని గర్భగుడిలో ధూపం,దీపాలు,కర్పూరం,పొగను రోజూ గంటల తరబడి పీల్చడం వలన తలనొప్పులు,మైకం,శ్వాసకోశ సమస్యలు దీర్ఘకాలంలో ఆస్తమా.గంటల తరబడి నిలబడి ఉండటం,వంగి అభిషేకాలు చేయడం వలన మోకాళ్ళ నొప్పులు,వెన్నునొప్పి, స్పాండిలైటిస్, తక్కువ వెలుతురు,పొగవలన కళ్ళ మంట,నీరు రావడం,చూపు మందగించడం.సమయానికి భోజనం లేక గ్యాస్ట్రిక్,అసిడిటి,అల్సర్లు,జీర్ణకోశ వ్యాధులు.నిద్రలేమి కారణంగా కుటుంబానికి సమయం లేక మానసిక ఒత్తిడి,ఒంటరితనం. అత్యంత దారుణమైన సమస్య ఒకటి ఉంది.ఒకసారి గుడిలో అడుగుపెట్టాక మధ్యలో ప్రకృతి పిలిచినా గర్భగుడిని వదిలి వెళ్ళే వెసులుబాటు ఉండదు.అందుకే చాలాసార్లు అవి ఆపేసుకుంటూ ఉండిపోతారు.దీని వలన తీవ్రమైన శరీర సంబంధ సమస్యలు వస్తాయి.ఒకవేళ పక్కకు వెళ్ళి వచ్చినా మళ్ళీ మళ్ళీ స్నానాలు,తలస్నానాలు.అవి తెచ్చే మరో రకమైన ఇబ్బందులు.చాలాసార్లు తినకుండా తాగకుండా అలాగే ఉండిపోతారు.పొద్దున్నే డ్యూటీ ఎక్కితే ఎప్పుడూ డ్యూటీ దిగే సమయం వస్తుందో అర్చకుడికి తెలియదు.ఇన్ని కష్టాలు తెలిసినా అర్చకుడు గుడిని వదలడు.స్వామి సేవను వదలడు.కనీసం సమాజం,గౌరవం, మాటల మర్యాద,మానవీయ దృష్టి చూపితే అదే అతనికి పెద్ద ఆరోగ్యం.అర్చకత్వం వృత్తి కాదు.తరతరాల త్యాగం.నిరంతర సేవ.నిశ్శబ్ద జీవితం.

# రైతులు పంట వివరాలను నమోదు చేయించుకోవాలి

**కొల్లిపర, జనవరి 9, ప్రభాతవార్త:** రైతు సేవా కేంద్రంలో పంట వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీనివాస్ కోరారు.శుక్రవారం రబీ



సీజన్‌కు సంబంధించి రైతులు సాగు చేస్తున్న పంటలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు సాగుచేస్తున్న పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు.రైతుల క్షేత్రాన్ని సందర్శించే సమయాన్ని వ్యవసాయ శాఖ సిబ్బంది ముందుగానే రైతులకు తెలియజేయాలని ఆదేశించారు.రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు.రసాయన ఎరువులను రైతులు తగ్గించాలని సూచించారు. మొక్క జొన్న, జొన్న పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.ఈ విధానం వలన తెగుళ్ళను నివారించుకోవచ్చన్నారు.ప్రధానంగా రైతులు సాగు చేసే పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించాలని శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వీఏఏ బంగారు బాబు,రైతులు పాల్గొన్నారు.

# క్షయరహిత మండలంగా తీర్చిదిద్దుతాం

**కొల్లిపర,జనవరి 9,ప్రభాతవార్త:** క్షయరహిత మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ కొల్లి మేఘనారెడ్డి అన్నారు.శు క్రవారం మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర, చివలూరు,మున్నంగి తదితర గ్రామాలలో క్షయ రోగులకు ఆరోగ్య సిబ్బందితో కలసి పౌష్టికాహారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మేఘనారెడ్డి మాట్లాడుతూ ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ ట్రస్ట్ అందజేసే పౌష్టికాహారం రోగుల్లో వ్యాధి నిరోధక




శక్తిని పెంచుతుందన్నారు.మండల వైద్యాధికారి నీహ మాట్లాడుతూ మనిషి ఊపిరితిత్తులను దెబ్బతీసి మరణానికి గురిచేసే క్షయవ్యాధి ప్రాణాంతకంగా ఒకప్పుడు ఉండేదన్నారు.ప్రస్తుతం ఎటువంటి భయం లేదని చెప్పారు.ప్రభుత్వం ఉచితంగానే మందులను అందజేస్తున్నదని క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యపడుతున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక,క్షయవ్యాధి విభాగం సూపర్ వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్,ఆరోగ్య విస్తరణాధికారి నాగరాజు,పిహెచ్‌ఎన్ సుమతి,ఎఎన్‌ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలి

**కొల్లిపర, జనవరి 9, ప్రభాతవార్త:** విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు



అన్నారు.శుక్రవారం మండలంలోని మున్నంగి ఉన్నత పాఠశాలలో ఎన్ఆర్ఐ పూర్వ విద్యార్థి డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి నిర్మాణం చేపట్టిన సంగాపు సాంబశివరావు సైన్స్ ల్యాబ్‌ను స్థానిక గ్రామ పెద్దలు,ఉపాధ్యాయులతో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సాంబశివరావు ప్రసంగిస్తూ విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల పై ఆధారపడి ఉంటుందన్నారు. పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాలలను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పుట్టా అప్పారావు,విద్యా కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


# అర్హులైన కూలీలకు పనులు కేటాయించాలి

**కొల్లిపర, జనవరి 9, ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ



ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులైన కూలీలకు పనులు కల్పించాలని డ్వామా పీడీ శంకర్ చెప్పారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ బృందం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఉపాధిహామీ పథకం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 2024-25 సంవత్సరాల్లో 838 పనులకు రూ.4 కోట్ల ఖర్చు చేశామన్నారు.ఈ పనులపై తనిఖీలు నిర్వహించామని చెప్పారు.సన్న, చిన్నకారు రైతులు మునగ,నేరేడు,జామ, పశువులకు పచ్చిగడ్డి వంటి పంటలు వేసుకుంటే పూర్తిస్థాయి సబ్సిడీ ఇస్తామని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో ఏపీడీ శివన్నారాయణ,ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి హనుమంతరావు. ఎంపిడీవో విజయలక్ష్మి, ఏపీవో వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# దాడి కెసులో ముద్దాయికి జైలుశిక్ష




**తెనాలి టౌన్ జనవరి9(ప్రభాతవార్త):** తెనాలి రూరల్ గ్రామం జగ్గడిగుంటపాలెం కు చెందిన తాడిబోయిన నాగరాజు పై 2021 ఆగస్టు 5వ తేదిన అదే గ్రామస్తుడు గుర్రం నాగమల్లేశ్వరరావు మరియు అతని తల్లి గుర్రం భూలక్ష్మి మరియు ఇంకొక బాలుడు కలిసి రాత్రి 9:30 గంటలకు తాడిబోయిన నాగరాజు గ్రామంలోని రామాలయం గుడి వద్ద అతని మిత్రులతో కలిసి ఉండగా, సదరు గుర్రంశివ నాగమల్లేశ్వరరావు కత్తి పీటతో మరియు అతని తల్లి గుర్రం భూలక్ష్మి మరొక బాలుడు కారంతో నాగరాజుపై దాడి చేసి అతనికి గాయపరిచారు.ఈ కేసు శుక్రవారం కోర్టులో గుర్రం నాగమల్లేశ్వరరావు పైన నేరం నిరూపణ ఐనందున తెనాలి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఆక పవన్ కుమార్ మూడు నెలల జైలు శిక్ష విధించారు. ఈ కేసులో భూలక్ష్మి పై నేరం నిరూపణ కానందున ఆమె పైన కేసుని కొట్టివేశారు.ఈ కేసుని అప్పటి తెనాలి రూరల్ ఎస్సై డి. ప్రసన్నకుమార్,ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.అలాగే బాధితులు తరుపున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరిశపోగు సునీల్ కుమార్ వాదించినారు.కోర్టు హెడ్ కానిస్టేబుల్ వాసా శ్రీనివాసరావు సహకారం అందించారు.

# ఘనంగా మునిసిపల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

- -ఉత్సాహంగా-ఉల్లాసంగా గడిపిన సిబ్బంది
- -రంగవల్లులు అద్దిన మహిళలు
- -తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి
- -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, జనవరి 9,ప్రభాతవార్త:** తెలుగువారి పండుగల్లో అతిపెద్ద పండుగ సంక్రాంతి అని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. నిడుబ్రోలు టిడ్కో గృహ సముదాయ ప్రాంగణంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే





భోగిమంటలతో ప్రారంభించి సిబ్బంది, నాయకులు, అక్కడి ప్రజలు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరిలో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. రైతులు కూడా తాము పండించిన ఉత్పత్తులను ఇళ్ళకు తెచ్చుకొని ఆనందంతో ఉంటారన్నారు. సంక్రాంతి పండుగ అంటేనే అనేక ఆటలకు, పాటలకు నిలయమైందన్నారు. సంక్రాంతి నెల రోజులు మహిళలు ఇళ్ళ ముంగిళ్ళలో రంగు రంగుల రంగవల్లికలు తీర్చిదిద్ది గొబ్బెమ్మలు పెట్టడం, హరిదాసు సంకీర్తనలు, జంగమదేవర్ల అరుపులు తదితరాలతో ప్రతి ఒక్కరూ ఆనందంగా గడుపుతారన్నారు. ఎక్కడెక్కడో ఉన్నటువంటి వారు కూడా సంక్రాంతి స్వగ్రామాలకు వచ్చి పండుగ శోభను ఆస్వాదిస్తారన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీలు, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, భోగి పళ్ళు పోయడం, భోగి మంటలు వేయడం వంటివి చేశారు. సిబ్బంది,నాయకులు, టిడ్కో ప్రాంత ప్రజానీకం ఆనందంగా గడిపారు. ఈ సంబరాలు ఏర్పాటు చేసిన మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డిఇ వెంకయ్య, పట్టణ ప్రణాళికాధికారి రఘురాం, మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, మునిసిపల్ మేనేజర్



పోతురాజు, నాయకులు గురుబాలు, షేక్ బాజిసాహెబ్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మగ్బుల్‌బేగ్, అలపర్తి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్దంగా చదవాలి

### -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, జనవరి 9,ప్రభాతవార్త:** పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్దంగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు సూచించారు. స్థానిక నేతాజీనగర్‌లోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను



అందజేశారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు సంబంధించి ప్రణాళికలను రూపొందించుకుని చదివినట్లయితే ఉత్తమ మార్కులు సాధించడం సులభమవుతుందన్నారు. శ్రద్ధయావర్ధతే విద్య అన్నట్లుగా చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. సమయాన్ని వృధా చేయకుండా పాఠ్యాంశాలపై దృష్టి సారించాలన్నారు. చదువుతోపాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రతి నిత్యం కొద్ది సేపు యోగాసనాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్, ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్‌బాబు, ఉపాధ్యాయులు మన్నవ గౌతమ్, చింతల నాగ శ్రీనివాస్ తదితరులున్నారు

# పేదలను ఆదుకోవడం మానవ ధర్మం

### -లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు ఝాన్సీరాణి

**పొన్నూరు, జనవరి 9,ప్రభాతవార్త:** పేదలను ఆదుకోవడం మానవ ధర్మమని లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ ఉద్దేశంతో లయన్స్‌క్లబ్ సభ్యురాలిగా చేరి అనంతరం అధ్యక్షురాలిగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానన్నారు.




అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీరాణి అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు ఫీడ్ ద హంగర్ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక సాంబశివనగర్ కాలనీలోని వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ మహిళ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేసి ఎంతో మందికి చేయూతనందిస్తున్నట్లు చెప్పారు. తాను ఉపాధ్యాయురాలిగా పనిచేసి రిటైర్ అయ్యాయని, తన శేష జీవితాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలనే మానవ సేవే మాధవ సేవ అన్న ఆర్యోక్తిని అనుసరించి తాను సేవా కార్యక్రమాలు చేస్తూ సంతృప్తిని పొందుతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ అవసరార్థులను ఆదుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రీజియన్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి, మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, మాజీ జోన్ ఛైర్మన్ జి.కృష్ణకుమారి, ఈ రోజు కార్యక్రమానికి కార్యదర్శి పి.మోహనలక్ష్మి, కోశాధికారి పి.నిర్మల ఆర్థిక సహాయ సహకారాలు అందించారు.

# గ్రామాభివృద్ధిలో అన్నిశాఖల అధికారులు భాగస్వాములు కావాలి

### -ఎంపిపి భవనం పద్మలీల

**పొన్నూరు, జనవరి 9,ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధిలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములై ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా




చూడాలని ఎంపిపి భవనం పద్మలీల కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో ఎంపిపి భవనం పద్మలీల అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి పద్మలీల మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రక్షిత మంచినీటిని శుద్ధి చేసి మెరుగైన జలాన్ని అందజేయాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సైడు కాలువలు, రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన పనులను వేగవంతం చేసి అవసరమైన వారికి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. గృహ నిర్మాణానికి సంబంధించి పనులను వేగవంతం అయ్యేవిధంగా చూడాలని అధికారులను కోరారు. సమావేశంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు అంబటి రాఘవయ్య, ఎంపిటిసి కందుల సరోజిని మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న పనులకు సంబంధించిన ప్రగతిని సమావేశంలో వివరించారు.

# పేద ముస్లింలకు ఎంఎం యూత్ అండగా ఉంటుంది

### అంజుమన్ కమిటి గౌరవాధ్యక్షుడు షేక్ మహమ్మద్(మాము)

**పొన్నూరు, జనవరి 9,ప్రభాతవార్త:** పేద ముస్లింలకు ఎంఎం యూత్ అండగా ఉంటుందని అంజుమన్ కమిటి గౌరవాధ్యక్షుడు షేక్



మహమ్మద్(మాము) అన్నారు. స్థానిక ఆలూరు కట్ట మీద నివశిస్తున్న పేద ముస్లిం కుటుంబానికి చెందిన ఓ మహిళ వివాహానికి ఎంఎం యూత్ ఆధ్వర్యంలో బీరువాను బహూకరించారు. ఈ సందర్భంగా మహమ్మద్(మాము) మాట్లాడుతూ పేద ముస్లింలను ఆదుకోవడంలో ఎంఎం యూత్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యమ్రంలో వైకాపా నాయకులు ఎస్ఎం బాషా, ఎంఎ మహమ్మద్, షేక్ పీర్‌సాహెబ్, పఠాన్ మునీర్‌ఖాన్, జానీ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు గణితంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

### -మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్

పొన్నూరు, జనవరి 9,ప్రభాతవార్త: విద్యార్థులు గణితము, సైన్సు, సోషల్ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల విద్యాశాఖాధికారి కొల్లి




విజయభాస్కర్ సూచించారు. మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని తెలుసుకొనేందుకు నల్లబల్లపై గణితానికి సంబంధించిన కొన్ని లెక్కలను అడిగి తెలుసుకొన్నారు. తెలియని వారిటిని నల్లబల్లపై విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రతి విద్యార్థికి చదవడం, వ్రాయడం ఖచ్చితంగా నేర్పించాలన్నారు. విద్యార్థులు కూడా చదవడం, వ్రాయడంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు రుచి, శుచిగా ఆహార పదార్థాలను తయారు చేసి వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.

# డెయిరీ ఫామ్ ద్వారా రైతులకు మెరుగైన ఫలితాలు

### -ఎడిఎ వి.రామకోటేశ్వరి

**పొన్నూరు, జనవరి 9,ప్రభాతవార్త:** డెయిరీ ఫామ్ ద్వారా రైతులకు మెరుగైన ప్రయోజనం ఒనగూరుతుందని ఎడిఎ వి.రామకోటేశ్వరి సూచించారు. ఆత్మ గుంటూరు జిల్లా సహకారంతో వెల్లలూరు పాడి రైతులు డెయిరీ ఫామ్ క్షేత్రస్థాయి పరిశీలన శుక్రవారం చేశారు. అందుకు




సంబంధించి చేబ్రోలు మండల మండల పరిధిలోని సుద్దపల్లి శ్రీగోవిందా డెయిరీ ఫామ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరి మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు పాడి పరిశ్రమ ఎంతగానో దోహదపడుతుందన్నారు. శ్రీ గోవిందా డెయిరీ ఫామ్ అధినేత నరసింహారావు పాడి పశువుల యొక్క పెంపకం, దూడల యొక్క యాజమాన్య పద్ధతలు, ముర్రుపాలు తాగించే విధానం తదితరాలను వివరించారు. పశుగ్రాసం సాగు విధానాలు, పాలు తీసే విధానం చాఫ్ కట్టర్ ద్వారా గడ్డిని చిన్న చిన్న ముక్కలుగా కోయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.ఏ విధంగా మార్కెటింగ్ చేసుకోవాలో కూడా వివరించారు. ఈ సందర్శనలో వెల్లలూరుకు చెందిన రామకృష్ణ, పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, వెల్లలూరు గోపాలమిత్ర శ్రీనివాసరావు,రైతులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయాలి

### -జీడీసిఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు

**చేబ్రోలు(పొన్నూరు), జనవరి 9,ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు పారదర్శకంగా ఉండాలని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జీడీసిఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు ఆదేశించారు. మండల కేంద్ర మైన చేబ్రోలు రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి అక్కడ ధాన్యం కొనుగోలుకు సంబంధించిన విషయాలను, విధి విధానాలను అడిగి



తెలుసుకొన్నారు. ధాన్యం షెడ్యూల్ కోసం వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమయానుకూలంగా షెడ్యూల్స్ జారీ చేసి, ధాన్యం కొనుగో ప్రక్రియ సజావుగా సాగేవిధంగా సిబ్బంది చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. నిబంధనలను రైతులకు అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్నారు. రైతుల హక్కులు కాపాడేవిధంగా తూకం నుంచి చెల్లింపుల వరకు అన్ని దశల్లోనూ జాగ్రత్తలు పాటించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతుల ప్రయోజనం కోసమే ప్రతి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గిట్టుబాటు ధరను కూడా కల్పించేవిధంగా సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దళారుల చేతిలో మోస పోవద్దని వడ్రాణం హరిబాబు సూచించారు.

10-1pg10 12 GNT_10-1pg10.qxd 09/Jan/26 10:45 PM Page 1






## మలేసియా ఓపెన్‌లో
# సెమీఫైనల్లోకి సింధు

**న్యూఢిల్లీ:** మలేషియా ఓపెన్ 2026, సూపర్ 1000లో భారత స్టార్ షట్లర్ పివి సింధు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. కౌలాలంపూర్‌లో శుక్రవారం జరిగిన ఈ టోర్నీలో జపాన్ ప్రత్యర్థి ప్రపంచ 3వ ర్యాంకర్ అకానె యమగుచి కేవలం 12 నిమిషాల ఆట తర్వాత ఓడించడంతో సింధు మొదటి గేమ్‌ను 21-11తో గెలుచుకుంది. 2021లో ఇండోనేషియా ఓపెన్ తర్వాత, ఐదు సంవత్సరాలలో సూపర్ 1000 ఈవెంట్‌లో ఆమె సెమీఫైనల్‌కు చేరుకోవడం ఇదే మొదటిసారి. పాద గాయం కారణంగా అక్టోబర్‌లో 2025 బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సీజన్ నుండి వైదొలిగిన తర్వాత సింధు తన మొదటి టోర్నమెంట్‌లో పోటీ పడుతోంది. ఇక పురుషుల డబుల్స్ జోడీ రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-శెట్టి చిరాగ్ క్వార్టర్ ఫైనల్లో ఇండోనేషియా జంట ఫజర్ అల్ఫియన్-ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రితో తలపడతారు. ఇప్పటికే లక్ష్య సేన్-ఆయుష్ శెట్టి రెండో రౌండ్ దాటడంలో విఫలమవగా, సింధు, సాత్విక్-చిరాగ్ జోడీ మాత్రమే ఈ టోర్నీలో ఉన్నారు. లక్ష్య 53 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లీ చెయుక్ యియు చేతిలో 20-22, 15-21 తేడాతో ఓడిపోగా, ఆయుష్ శెట్టి 1 గంట 10 నిమిషాల పాటు జరిగిన హోరాహోరీ పోరులో టాప్ సీడ్ యు క్వి షి చేతిలో 18-21, 21-18, 12-21 తేడాతో ఓడిపోయాడు.



# క్వార్టర్ ఫైనల్లోకి సహజ
## థాయ్‌లాండ్ అన్చిసాపై గెలుపు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 టోర్నమెంట్‌లో భారత్ మహిళల టెన్నిస్ నంబర్‌వన్, భారత్ యువతార, తెలంగాణ ప్లేయర్ యామలపల్లి సహజ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. థాయ్‌లాండ్‌లో జరిగిన ఈ టోర్నీలో సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 378వ ర్యాంకర్ సహజ 6-3, 7-5తో థాయ్‌లాండ్‌కు చెందిన అన్చిసా చాంటాపై గెలుపొందింది. ఒక గంటా 54 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ మూడు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. తొలి సర్వీస్‌లో 23 పాయింట్లు గెలిచిన ఈమె రెండో సర్వీస్‌లో 18 పాయింట్లు సొంతం చేసుకుంది. ఇక క్వార్టర్ ఫైనల్లో ఇటలీకి చెందిన లీసా పిగాటాతో సహజ సహజ తలపడనుంది. మరోపక్క ఇదే టోర్నీ డబుల్స్ విభాగం క్వార్టర్ ఫైనల్లో భారత్ ప్లేయర్ రుతుజా భోస్లే-చైనాకు చెందిన వుషువాంగ్ జెంగ్ జోడీ 6-3, 6-3తో క్యోకా ఒకమురా (జపాన్)-పింగ్‌టార్న్ ప్లిపుయెచ్ (థాయ్‌లాండ్) ద్వయంపై గెలిచింది.

## ఖేలో ఇండియాలో హర్యానా మహిళలు, ఢిల్లీ పురుషులు సెపక్‌తక్రా స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఖేలో ఇండియా గేమ్స్-2026 ఫైనల్స్‌లో హర్యానా మహిళలు, ఢిల్లీ పురుషులు విభిన్న విజయాలు నమోదు చేయడం ద్వారా సెపక్‌తక్రాలో బంగారు పతకాలు సాధించారు. మహిళల సెపక్‌టక్రా ఫైనల్లో, హర్యానా జట్టు గంటా 15 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో బీహార్‌ను 2-1 తేడాతో ఓడించింది. అలాగే ఢిల్లీ పురుషులు బీహార్‌ను 2-0 తేడాతో ఓడించారు. బీచ్ సాకర్‌లో, డిఫెండింగ్ ఛాంపియన్స్ ఒడిశా 7-0 తేడాతో ఆరంగేట్రం చేసిన హిమాచల్‌ప్రదేశ్‌పై ఆధిపత్యం చెలాయించి మహిళల ఫైనల్‌కు చేరుకుంది. విజేతల తరపున శ్రీజన తమంగ్, సత్యబతి ఖాడియా, ఖుండోంగ్‌బామ్ అంబాలిక తలా రెండు గోల్స్ చేశారు. మహిళల విభాగంలో జరిగిన రెండవ సెమీఫైనల్లో, గుజరాత్ తొలి క్వార్టర్‌లో 4 గోల్స్ చేయడంతో అరుణాచల్‌ప్రదేశ్‌పై 6-3 తేడాతో విజయం సాధించింది. ఓడిపోయిన జట్టు తరపున కెప్టెన్ గియాని రాంచింగ్ మారా మూడు క్వార్టర్లలో ఒక్కో గోల్ చేసింది. కానీ గుజరాత్ గోల్ ముందు ఇతరుల నుండి పెద్దగా మద్దతు లభించలేదు. ఇక బీచ్ వాలీబాల్‌లో తమిళనాడు పురుషులు, మహిళల విభాగాల్లో బంగారు పతకాలు గెలుచుకునే అవకాశం ఉంది. దీపిక, పవిత్రలతో కూడిన తమిళనాడు మహిళల జట్టు మొదటి సెమీఫైనల్లో 19-21, 21-12, 15-6 తేడాతో స్వాతి-దర్శినిలను ఓడించి, బంగారు పతక పోరుకు అర్హత సాధించింది.




## మహిళల హాకీ లీగ్‌లో..
# రాంచీ రాయల్స్ విక్టరీ
### 5-2 తేడాతో ఎస్‌జి పైపర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్) 2025-26లో జరిగిన చివరి మ్యాచ్‌లో రాంచీ రాయల్స్ జట్టు ఎస్‌జి పైపర్స్‌ను 5-2 తేడాతో ఓడించి ఆధిపత్య ఆల్ రౌండ్ ప్రదర్శనను కనబరిచింది. నాల్గవ త్రైమాసికంలో క్లినికల్ ప్రదర్శనతో ఆతిథ్య జట్టు టోర్నమెంట్‌లో మూడవ స్థానంలో నిలిచింది. రాయల్స్ తరపున లూసి నా వాన్ డెర్ హేడే (2వ నిముషం,47), సంగీత కుమారి (24), హన్నా కాటర్ (55, 60) గోల్స్ చేయగా, టోర్నమెంట్ ఫైనల్‌కు ఇప్పటికే అర్హత సాధించిన పైపర్స్ తరపున నవనీత్ కౌర్ (10, 58) డబుల్ గోల్స్ చేసింది. డ్రాగ్‌ఫ్లిక్ స్పెషలిస్ట్ లూసినా వాన్ డెర్ హేడ్ 2వ నిమిషంలోనే గోల్‌గా మార్చడం ద్వారా రాయల్స్‌కు తొలి ఆధిక్యాన్ని అందించాడు. కెప్టెన్ నవనీత్ కౌర్ (10) ద్వారా పైపర్స్ తిరిగి గోల్ చేసింది. రెండు జట్లు గోల్స్ చేయడంతో, తొలి క్వార్టర్ 1-1తో సమానంగా ముగిసింది. రెండో క్వార్టర్ ఎండ్‌టుఎండ్ శైలిలో సాగింది. రాంచీ ప్లేయర్ సంగీతా కుమారి (24) గోల్ చేసింది. దీంతో రాయల్స్ అర్ధభాగం చివరి దశలో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లేలా చూసుకుంది. మూడోక్వార్టర్‌లో ఇరుజట్లుపట్టుదలతో ఒకరిపై ఒకరు నియంత్రించుకోవడంతో గోల్ లేకుండా ముగిసింది. నాల్గవ క్వార్టర్‌లో లూసినా వాన్ డెర్ హేడ్ (47) పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేసి ఆతిథ్య జట్టు ఆధిక్యాన్ని పెంచింది. హన్నా కాటర్ వరుసగా రెండు చివరి గోల్స్ (55, 60) జోడించి పైపర్స్ పునరాగమనం ఆశలకు తెరదించింది. ఈలోగా పైపర్స్ కెప్టెన్ నవనీత్ కౌర్ (58) ద్వారా ఒక గోల్ సాధించినా రాయల్స్ 5-2 తేడాతో అద్భుతమైన విజయంతో ముగించింది.

# ఐపిఎల్ ప్లేయర్లకు జాక్‌పాట్
## టీమిండియాలోకి ఎంట్రీ.. నలుగురికి దక్కనున్న ఛాన్స్











**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఆడుతున్న యుత్ ప్లేయర్లకు జాక్‌పాట్ తగిలింది. నలుగురు ప్లేయర్లు టీమిండియాలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు. ఐపీఎల్‌లో అద్భుతమైన ప్రదర్శనలు, దేశీయ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డులు చాలా మంది యువ ఆటగాళ్లను వెలుగులోకి తెచ్చాయి. గత సీజన్‌లో తమ అద్భుత ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించిన నలుగురు యువ ఆటగాళ్లు త్వరలోనే టీమిండియా జెర్సీ ధరించబోతున్నారు. వైభవ్ సూర్యవంశీ నుంచి అకీబ్ నబీ వంటి పేస్ బౌలర్ వరకు టీమిండియాలో చోటు దక్కించుకోనున్నారు. సెలెక్టర్లు ఇప్పుడు పేరు గుర్తింపు కంటే ఫాం కే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో కొంతమంది కొత్త ముఖాలు టీమిండియా క్యాప్‌లను దక్కించుకునే ఛాన్స్ తగలనుంది. అటువంటి వారిలో చెన్నై సూపర్ కింగ్స్ కనుగొన్న మరో ఆణిముత్యం ఆయుష్ మ్హాత్రే. మూడు ఫార్మాట్లలో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. టీమిండియా అండర్19 జట్టుకు కెప్టెన్‌గా ఉన్న ఇతనిని సీనియర్ జట్టులోకి తీసుకునేందుకు సెలక్టర్లు ఆలోచన చేస్తున్నారు. ధోనీ శిష్యరికంలో రాటుదేలుతున్న ఆయుష్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్ నుంచి వచ్చిన స్పీడ్ గన్ అకీబ్ నబీ ప్రస్తుత దేశవాళీ క్రికెట్‌లో హాట్ టాపిక్‌గా మారాడు. రంజీ ట్రోఫీలో కేవలం 5 మ్యాచ్‌ల్లోనే 29 వికెట్లు తీసి తన సత్తా చాటాడు. ఢిల్లీ క్యాపిటల్స్ ఇతనిని రూ.8.40 కోట్లకు కొనుగోలు చేయడం ఇతని డిమాండ్‌ను తెలియజేస్తోంది. టీమిండియాలో ఫాస్ట్ బౌలర్ల రొటేషన్ పాలసీ ప్రకారం అకీబ్ కు త్వరలోనే అవకాశం దక్కవచ్చు. ఇక రాజస్థాన్ రాయల్స్ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేసిన పిన్న వయస్కుడు వైభవ్ సూర్యవంశీ సత్తా చాటుతున్నాడు. గుజరాత్ టైటాన్స్‌పై కేవలం 35 బంతుల్లోనే సెంచరీ బాది, ఐపీఎల్ చరిత్రలో రెండో వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. 206 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసే అతనికి త్వరలోనే భారత టీ20 జట్టులో ఓపెనర్‌గా కనిపించే అవకాశం ఉంది. భారత జట్టుకు ప్రస్తుతం స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ల అవసరం ఉంది. ఆ లోటును భర్తీ చేసే సత్తా విప్రజ్ నిగమ్‌కు ఉంది. 21 ఏళ్ల ఈ యువకుడు ఐపీఎల్ 2025లో 11 వికెట్లు తీయడమే కాకుండా, 180 స్ట్రైక్ రేట్‌తో విలువైన పరుగులు చేశాడు. నంబర్ 8లో బ్యాటింగ్‌కు వచ్చి ఫినిషర్ పాత్ర పోషించగల ఇతను సెలెక్టర్ల రాడార్‌లో ఉన్నాడు. ఈ నలుగురు ఆటగాళ్లు కేవలం ఐపీఎల్ ప్రదర్శనపైనే కాకుండా, దేశవాళీ క్రికెట్‌లోనూ నిలకడగా రాణిస్తున్నారు. టీ20 వరల్డ్ కప్ 2026 తర్వాత భారత జట్టులో పెను మార్పులు జరగనున్న నేపథ్యంలో టీమిండియాలోకి ఈ యువ రక్తం ఎంట్రీకి మార్గం సుగమంకానుంది.

## వారాంతంలో మార్కెట్లకు తప్పని నష్టాలు
### సెన్సెక్స్, నిఫ్టీలు భారీ పతనం



వాణిజ్యం

**ముంబయి, జనవరి 9:** వారాంతంలో స్టాక్ సూచీలు భారీ పతనం చవిచూసాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదో సెషన్‌లోనూ భారీ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ వంటి కారణాలతో శుక్రవారం ట్రేడింగ్‌లో సూచీలు కుప్పకూలాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 605 పాయింట్లు నష్టపోయి 83,576 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 193.5 పాయింట్లు క్షీణించి 25,683 వద్ద ముగిసింది. దీంతో సూచీలు రెండు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. నిఫ్టీ కీలకమైన 25,700 స్థాయికి దిగువన ముగియడం మార్కెట్ బలహీనతను సూచిస్తోంది. ఉదయం నిఫ్టీ 25,840 వద్ద ప్రారంభమై, ఒక దశలో 25,940 గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే, లాభాల స్వీకరణ వెల్లువెత్తడంతో 25,648 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న గందరగోళం, కొత్త టారిఫ్ ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనికి తోడు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాలు విధించే బిల్లుకు అమెరికా అధ్యక్షుడు ఆమోదం తెలపడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. విభిన్నరంగాల సూచీల్లో ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్ మినహా మిగిలినవన్నీ నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ రియల్టీ సూచీ 2.12 శాతం పతనంతో అత్యధికంగా నష్టపోయింది. ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా 1 శాతానికి పైగా నష్టపోయాయి. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 22 పైసలు క్షీణించి 90.11 వద్ద ముగిసింది. మార్కెట్లు కొంతకాలం ఒడిదొడుకులకు లోనయ్యే అవకాశం ఉందని, అయితే, దేశీయ జీడీపీ వృద్ధి, మూడో త్రైమాసిక ఫలితాలు సానుకూలంగా ఉంటే మార్కెట్ తిరిగి పుంజుకోవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# రిలయన్స్ జియో ఐపిఒ
## 400 కోట్ల డాలర్ల నిధుల సమీకరణ టార్గెట్




**న్యూఢిల్లీ, జనవరి 9:** రిలయన్స్ జియో ప్లాట్ ఫామ్‌పై భారీ ఐపిఒ వచ్చేస్తోంది. కంపెనీలో ఉన్న 2.5శాతం వాటాలను ఐపిఒలో విక్రయించి 400 కోట్ల డాలర్లనిధులను సమీకరించాలని నిర్ణయించింది. ముకేష్ అంబాని ఆధ్వర్యంలోని ఈ కంపెనీ దేశంలోనే అతిపెద్ద టెలికాం కంపెనీ జియోఆపరేటర్‌నడుస్తోంది. సుమారు 50 కోట్లమందికిపైగా కస్టమర్లతో ఉన్న కంపెనీ ఇపుడు ఐపిఒకు వస్తున్నది. గత నవంబరులోనే ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు జెఫరీస్ జియో విలు వలను 180 బిలియన్ డాలర్లక అంచనావేసింది. ఈ విలువలవద్ద 2.5శాతం వాటా విక్రయంతో 4.5 బిలియన్ డాలర్లు సమీకరించవచ్చని అంచనావేస్తోంది. హుండై మోటార్ ఇండియా కూడా 2024 ఐపిఒలో 3.3 బిలియన్ డాలర్లు సమీకరించిన సంగతి తెలిసిందూ గడచిన ఆరేళ్లలో జియో కృత్రిమమేధ వైపు మళ్లింది. కెకెఆర్, జనరల్ అట్లాంటిక్, సిల్వర్‌లేక్, అబూధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీలనుంచి నిదులను కూడా ఈ విభాగానికి సమీకరించింది. ఇపుడు ఐపిఒలో రిలయన్స్ కేవలం 2.5శాతం జియో వాటాలను మాత్రమే లిస్టింగ్‌చేయాలని చూస్తోంది. సెబీ కూడా భారీ కంపెనీలు ఐపిఒలకు వస్తే 2.5నుంచి ఐదుశాతానికి మాత్రమే వెళ్లాలని సూచించిన సంగతి తెలిసిందే. ఈ కోణంనుంచి చూస్తే ఇపుడు జియో ఐపిఒ 2.5శాతం వాటాలకే పరిమితం అవుతోంది. సంస్థ బిజినెస్ విలువలు 200 నుంచి 240 బిలియన్ డాలర్లు మాత్రమే ఉంటాయని బ్యాంకర్లు చెపుతున్నారు. ప్రైమరీ ఈక్విటీ ఇష్యూమార్కెట్‌లో జియో ప్రపంచంలోనే నంబర్2గా నిలిచింది. గత డిసెంబరు 18వ తేదీ నాటికి ప్రైమరీ ఇష్యూఎన్స్ మార్కెట్‌ద్వారా మొత్తం 21.6 బిలియన్ డాలర్ల నిధులు సమీకరణజరిగిన సంగతి తెలిసిందే. ముకేష్ అంబాని జియో లిస్టింగ్‌ను మార్కెట్‌కు వచ్చిన ఐదేళ్లకే చేయాలని భావించారు. ఒకపక్క ఎలాన్ మస్క్‌స్టార్‌లింక్ ఇంటర్నెట్‌సేవలు ప్రారంభిస్తున్న తరుణంలో జియో కూడా ఎఐ సేవలను ఎన్విడియా కంపెనీతో జతకట్టి భారీ ఎత్తున అమలుకు సిద్ధం అవుతోంది. మోర్గాన్ స్టాన్లీ, భారత్‌కు చెందిన కోటక్ ఏజెన్సీలు రెండూ కూడా రిలయన్స్‌కోసం ఐపిఒ ముసాయిదాలు రూపొందిస్తున్నాయి.

# 10 బిలియన్ డాలర్లు క్షీణించిన ఫోరెక్స్ నిల్వలు

**న్యూఢిల్లీ, జనవరి 9:** భారత ఫోరెక్స్ నిల్వలు గతవారం చివరినాటికి 10 బిలియన్ డాలర్లమేర తగ్గాయి. గతవారంలో మార్కెట్‌లో నెలకొన్న పసిడిధరల్లో మార్పులే ఇందుకు కారణమని ఆర్బీఐ వాదిస్తోంది. దీనికితోడు భారత్‌రూపాయి కూడా వారాంతంలో క్షీణించింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 90.16 రూపా యలుగా నడిచింది. ఆర్‌బిఐ నివేదికప్రకారం విదేశీ కరెన్సీ నిల్వలు 9.809 బిలియన్ డాలర్లు తగ్గి 686.801 బిలియన్ డాలర్లకు చేరాయి. స్థానిక స్టాక్స్‌లో నెలకొన్న బలహీనత కూడా రూపాయిపై భారం వేసింది. సెన్సెక్స్, నిఫ్టీలు రెండూ కూడా వారాంతంలో నష్టపోయాయి. గడచిన ఐదు రోజుల్లో సూచీలు 2.5శాతం నష్టపోయాయి. దీనికితోడు దేశీయ ఈక్విటీల్లో విదేశీ ఇన్వెస్టర్లు సుమారు వందకోట్ల డాలర్లమేర స్టాక్స్ విక్రయించారు. గత ఏడాది మొత్తంగా 19 బిలియన్ డాలర్లు విత్‌డ్రా అయిపోయాయి. కరెన్సీ ఆస్తులపరంగాచూస్తే 7.622 బిలియన్ డాలర్లు క్షీణించి 551.99 బిలియన్ డాలర్లకు



చేరాయి. అలాగే బంగారం విలువలు కూడా తగ్గాయి. 2.058 బిలియన్ డాలర్లు తగ్గినట్లు ఆర్బీఐ నివేదికలు సూచిస్తున్నాయి. అలాగే స్పెషల్‌డ్రాయింగ్‌రైట్స్ కూడా 25 మిలియన్ డాలర్లు క్షీణించి 18.778 బిలియన్ డాలర్లకు చేరినట్లు సెంట్రల్ బ్యాంకువ ఎల్లడించింది. ఐఎంఎఫ్‌వద్ద భారత రిజర్వుస్థాయికూడా 105 మిలియన్ డాలర్లు క్షీణించి 4.771 బిలియన్ డాలర్లకు చేరింది.

## ఐదు కంపెనీల ఐపిఒలకు సెబీ గ్రీన్‌సిగ్నల్
### వచ్చేవారం ఆరు ఐపిఒలు మార్కెట్లలోకి...



**న్యూఢిల్లీ, జనవరి 9:** జియోతోపాటే మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మరో ఐదు కంపెనీలకు ఐపిఒలను ఆమోదించింది. ఇండోఎంఐఎం, కుసుమ్‌గార్; ఆన్‌ఇఎంఐ టెక్నాలజీ సొల్యూషన్, ఆల్కోబ్రూ డిస్టిలరీస్ ఇండియా, ఆస్థా స్పింటెక్స్ సంస్థల ఐపిఒల దరఖాస్తులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత ఏడాది డిసెంబరు 29వ తేదీనుంచి జనరవ తొమ్మిది తేదీల మధ్యలో ఈ కంపెనీలకు పరిశీలన లేఖలు అందచేసింది. ఇఎంఐ టెక్నాలజీ కిష్ట్ అనే డిజిటల్ లెండింగ్‌ప్లాట్ ఫామ్ నిర్వహిస్తోంది. రూ.1000 కోట్లు నిధులు సమీకరించాలని నిర్ణయించింది.ప్రస్తుత ఇన్వెస్టర్లనుంచి ఆఫర్‌ఫర్‌సేల్ విధానంలో నిధులు సేకరిస్తోంది. బెంగళూరు కేంద్రంగా ఉన్న ఇండో ఎంఐఎం కూడా ఐపిఒకు వస్తోంది. రూ.1000కోట్లు నిధులు సమీకరణ ఒఎఫ్ఎస్ రూటులో 12.97కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫ్‌లోడ్‌చేస్తున్నారు. ఆల్కోబ్రూ డిస్టిలరీస్ ఇండియా ఐపిఒ కూడా రూ.258.26కోట్ల మేర ఒఎఫ్ఎస్ రూటులో 1.8 కోట్లు షేర్లు ప్రమోటర్లు లిక్విడేట్‌చేస్తున్నారు. ఇక కుసుమ్‌గార్ ఐపిఒ కూడా ఆఫర్‌ఫర్‌సేల్‌రూటులో ప్రమోటర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. స్టాక్ ఎక్స్ఛేంజిల్లో మార్కెట్ బ్రోకర్లకు కొంత వెసులుబాటు కల్పిస్తూ సెబీ సవరణలు తెచ్చినతర్వాత ట్రేడింగ్ మరింత సులభతరం అవుతుందని చెపుతున్నారు.ఇవికాకుండా మరో ఆరుఐపిఒలు వచ్చేవారంలో మార్కెట్లకు వస్తున్నాయి. అమేగీమీ డియా లాబ్స్ 1788.62 కోట్లకు ఐపిఒ తెస్తోంది. భారత్‌కోకింగ్‌కోల్ కూడా ఈనెల 16న ఐపిఒకు వస్తోంది.ఎస్ఎంఇ సెగ్మెంట్‌లో కూడా కొన్ని కొత్త ఇష్యూలు న్నాయి.ఐదుఇష్యూలు జనవరి 12నుంచి 14తేదీల్లో వస్తున్నాయి. అవానా ఎలక్ట్రోసిస్టమ్స్, నరమదేశ్‌బ్రాస్‌ఇండస్ట్రీస్, ఇండోఎస్ఎంసి గ్రేరెన్యూఎనర్ టెక్, ఆర్మర్‌సెక్యూరిటీ ఇండియా కంపెనీలపైనాఇన్వెస్టర్లు ఫోకస్ పెంచారు.

## ఒక్కనెలలో సిప్ పెట్టుబడులు రూ.31వేల కోట్లు




**న్యూఢిల్లీ, జనవరి 9:** ఈక్విటీ మూచువల్‌ఫండ్స్‌లో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్(సిప్)లరూపంలో రికార్డుస్థాయి పెట్టుబ డులు వచ్చాయి. ఫండ్స్ అసోసియేషన్ డేటా ప్రకారం డిసెం బరులో సిప్ పెట్టుబడులు రూ.31,002 కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. మొత్తం ఆల్‌టైమ్ రికార్డుకు నమోద యింది. నవంబరులో 29,445కోట్లు కాగా డిసెంబరులో ఈమొత్తం 31 వేలకోట్లు దాటేసింది. చిన్న పెట్టుబడిదారులకు కూడా సిప్‌లపై విశ్వాసం పెరుగుతున్నదని ఈ పెట్టుబడుల తీరు తెలుస్తోంది. డిసెంబరులో గోల్‌నడ ఈటిఎఫ్ ఫండ్స్‌లో పెట్టుబడులు రూ.11,647కి చేరాయి. నవంబరులో కేవలం 3742కోట్లుమాత్రమే ఉంటే డిసెంబరులో మూడురెట్లు పెరిగినట్లు తెలుస్తోంది.అయితే నిరకంగా డిసెంబరులో విత్‌డ్రాలు కూడా పెరిగాయి. మొత్తం 66,591 కోట్లు పెట్టుబడులు ఉపసంహరించుకుంది. వంబరులో 32,755 కోట్లు ఉపసహరించుకున్నట్లు అంచనా. అయినప్పటికీ కూడా ఫండ్స్, ఈక్విటీల్లోను, సిప్‌ల్లోకూడా భారీ వృద్ధి నమోదవుతోంది. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌లలో పెట్టుబడులు నవంబరులో 8135 కోట్లతోపోలిస్తే డిసెంబరులో 10,019 కోట్లకు చేరాయి. లార్జ్‌క్యాప్ పెట్టుబడుల పరంగా నవంబరులో 164 కోట్లురాగా డిసెంబరులో 1567 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ఇక మిడ్‌క్యాప్‌ల్లో 4487కోట్లు తాగ్గాయి. స్మాల్‌క్యాప్‌ఫండ్స్‌లో మాత్రం గతనెలలో 3824 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. థీమ్ ఆధారిత ఫండ్‌లలో పెట్టుబడులు 49శాతం తగ్గాయి. ఈ కేటగిరీల్లో పెట్టుబడులు డిసెంబరులో 946 కోట్లురాగా డెట్ మూచువల్‌ఫండ్స్‌లో డిసెంబరులో 1.32 లక్షలకోట్లు, డిసెంబరులో ఓవర్‌నైట్‌ఫండ్స్ 254.25 కోట్లు బయటికి వెళ్లిపోయాయి. సిప్‌లలో ఎక్కువగా జెన్‌జడ్ తరంతోపాటు మహిళలు, గృహిణులు, చిన్న నగరాలు, పట్టణాలనుంచి ఎక్కువ స్తున్నట్లు తేలింది. నవంబరువరకూ సిప్‌ప్లాన్‌లలో ఇన్వెస్టర్లు మూడు లక్షలకోట్లు నిధులు కుమ్మరించారు. ఈ నిధులతో మూచువల్‌ఫండ్స్ నిర్వహణ ఆస్తులు 2035 నాటికి 300 లక్షలకోట్లకు పెరుగుతాయన్న అంచనాలున్నాయి.

## ఉద్యోగులకు టిసిఎస్ హుకుం: ఆఫీసుకు రాకుంటే ప్రమోషన్లు కట్

**న్యూఢిల్లీ, జనవరి 9:** ప్రముఖ ఐటీ దిగ్గజం టీసీఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. వర్క్ ఫ్రమ్ హోమ్ కు పూర్తిగా స్వస్తి పలకాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే కఠిన నిర్ణయాలను అమలు చేస్తోంది. వర్క్‌ఫ్రమ్‌ఆఫీస్ విధానాన్ని మరింత కఠినతరం చేసింది. ఇకపై ఉద్యోగులు కచ్చితంగా ఆఫీస్‌కు రావాల్సిందేనని స్పష్టం చేసింది. లేనిపక్షంలో వారి యాన్యువల్ ఇంక్రిమెంట్స్, ప్రమోషన్స్ వంటివి నిలిపివేస్తామని హెచ్చరించింది. ప్రస్తుతం టీసీఎస్ ఉద్యోగులు రోజుకు 9 గంటలు ఆఫీసులో గడపాలి.దేశంలోని ఇతర ఐటీ కంపెనీలు వారానికి రెండు లేదా మూడు రోజులు ఆఫీస్‌కు వస్తే చాలని చెబుతున్నారు. కానీ టీసీఎస్ మాత్రం ఐదు రోజులు కచ్చితంగా రావాలని నిబంధన పెట్టింది. అంతేకాకుండా వేరియబుల్ పే ను కూడా అటెండెన్స్‌తో లింక్ చేసింది. కంపెనీ నిర్ణయంతో సంస్థలోని ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఈ నిర్ణయంపై ఉద్యోగులు పలు విధాలుగా స్పందిస్తున్నారు. పెరిగే జీతం కంటే ఆఫీసుకు వెళ్లేందుకు అయ్యే ఖర్చే ఎక్కువ అని వాపోతున్నారు. పెరుగుతున్న అద్దెలు, రవాణా, భోజన ఇతర ఖర్చులను సాకుగా చూపుతూ చాలా మంది వర్క్‌ఫ్రమ్ హోమ్‌కే మొగ్గు చూపుతున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14